భారతీయ విద్యాచరిత్రము ..

(భారతినుండి)

To
M.R.Ry.
T. Achyuta Rao pantulu gu
with the author's respects

మారేమండ రామారావు,

బి. ఏ. (ఆనర్సు), బి. ఇడి.

౧౯౩౪

చెన్నపురి:
ఆంధ్రపత్రికా ముద్రాలయమున
ముద్రితము.

భారతీయవిద్యాచరిత్రము

విషయసూచిక

భారతీయవిద్యాచరిత్రము

పీఠిక

భారతదేశచరిత్రమునకు సంబంధించిన ప్రమాణములను బరిశీలించుచునెడ శాసనములందును, సంస్కృత వాఙ్మయమునను, విదేశీయుల వ్రాతలయందును తాత్కాలికవిద్యావిధానమునుగూర్చినయంశము లెన్నియో నాకు లభించినవి. వీని యాధారమున నేను ౧౯౩౨-వ సంవత్సరము జనవరినెలలో "ప్రాచీనభారతీయవిద్యాసంస్థ"లను గూర్చి రాజమండ్రి గవర్నమెంటు ట్రెయినింగు కాలేజీలోను, సెప్టెంబరునెలలో "భారతీయ విద్యావిధానపరిణామము"ను గూర్చి అర్యాపుర సంస్కృతపాఠశాలలోను రెండుపన్యాసముల నొసంగితిని. వానిని మిత్రులు కొందరు విని ప్రకటింపుమని కోరిరి. అప్పుడు నే నీరెండుపన్యాసములను విపులీకరించి "భారతీయవిద్యాచరిత్రము" అను పేర గ్రంథరూపమున నిర్మించితిని.

ఇయ్యది 'భారతి' లో ౧౯౩౩-వ సంవత్సరము జూలై నెలనుండి డిశంబరునెలవరకును వెలవడిన యారు సంచికలలో బ్రకటింపబడినది. ఇందు ప్రాచీనకాలము నుండి క్రీ.శ. ౧౯౨౬-వ సంవత్సరమువరకునుగల విద్యావిధానములును, సంస్థలును, వానిచరిత్రమును సంగ్రహముగ జేర్కొనబడినవి. ఆయా యధ్యాయములను రచిం

భారతీయ విద్యాచరిత్రము

మారేమండ రామారావు,

బి. ఏ. (ఆనర్సు) బి. ఇడి.

మొదటి అధ్యాయము

[ఆధారములు:—

Macdonell - History of Sanskrit Literature,

Rapson - Cambridge History of India, Vol. I.

Smith - Early History of India.

Kaey - Ancient Indian Education.

Venkateswar - Indian Culture through ages.

Ray Chowdary - Political History of Ancient India.]

హిందూవిద్య

ఆధునిక ప్రపంచమునందలి విశేషభాగ మాదిమ స్థితియందుండి యనాగరికముగ నుండినసమయమున సకలవిద్యానిదానమనియు, సర్వవైభవోపేత

మనియు, నుత్కృష్టమగు నాగరకత కాలవాలమనియు పేరెన్నికగాంచినది భారతదేశము. ఈదేశమునందు పెక్కువేలసంవత్సరములనుండి మానవసాధ్యములగు విద్య లెన్నియో పెంపొందింపబడుచుండినవి. నేటికిని విదేశీయు లనేకు లీదేశమున కేతెంచి తమ విద్యాపిపాసను బాపుకొని కృతార్థు లగుచున్నారు. ఇట్టి భారతీయ విద్యావైదుష్యముల చరిత్రము విశేషముగ దేశచరిత్రపై నాధారపడియుండును. కాన నీచరిత్రమునందును దేశ చరిత్రమునందువలెనే హిందూ, బౌద్ధ, మధ్య, మహమ్మదీయ, బ్రిటిష్‌యుగములను గుర్తింపవలసియున్నది.

భారతదేశచరిత్రమునకు బ్రారంభస్థాన మాధునిక పరిశోధనలమూలమున నానాటికిని మార్పుజెందుచున్నది. ప్రాచీనార్యు లీదేశమున బ్రవేశించిననాటినుండియు నీదేశపు చరిత్ర మారంభమగుననియు నంతకుబూర్వపు స్థితి వేదవాఙ్మయమునుండియు, బూర్వ చారిత్రక (Pre-historic) శిథిలములనుండియునే దెలియదగిన దనియు నింతవరకును జరిత్రకారు లభిప్రాయ పడియుండిరి. కాని యిటీవల పంజాబుప్రాంతమున మొహన్‌జొడారో, హరప్పా మున్నగుస్థలముల బయలుపడిన ప్రాచీనశిథిలములనుండి యార్యు లీదేశమునకు వచ్చుటకుబూర్వమే యిచ్చట మహోన్నతమగు నాగరికత ప్రబలియుండెననియు, నయ్యది క్రీ.పూ. నాలుగైదువేల సంవత్సరములకు బూర్వపుదైన నయియుండుననియు స్పష్టమగుచున్నది. చరిత్రమున కీనూతనపరిశోధనలు ముఖ్యములేయైనను వానినిగూర్చి సునిశ్చితములగు విశేషాంశములు దెలియువరకును భారతీయవిద్యాచరిత్ర

మున కార్యులప్రవేశమునే ప్రారంభస్థానముగ గైకొన వలసియున్నది. ఈ విషయమునుగూర్చియు జరిత్రకారులలో నభిప్రాయభేదము లున్నవి. అయినను క్రీ. పూ. ౩౦౦౦ ప్రాంతమునం దార్యు లీదేశమునకు వచ్చియుందురనుటను సామాన్యముగ నెల్లరు నంగీకరించుచున్నారు.

నాటినుండి సుమారు క్రీ. పూ. ౨౦౦ వరకు, ననగా నశోకచక్రవర్తి రాజ్యారంభమువరకును గల కాలము హిందూమహాయుగముగ గుర్తింపవచ్చును. ఈకాలమున వేదములును, వైదికవాఙ్మయమును నిర్మింపబడి, దత్సంబంధమగు విద్యయు, హిందూమతమును బ్రబలినవి. అశోకునికాలమునుండి శ్రీహర్షుని రాజ్యాంతమువరకును (క్రీ. శ. ౬౪౭) గల కాలమున హిందూబౌద్ధమతము లీదేశమున ప్రబలినవి. దానజేసి రెండుప్రత్యేక విద్యావిధానములు బయల్వెడలినవి. మొత్తముమీద నీకాలమున బౌద్ధమతము విశేషప్రఖ్యాతి నందియుండుటచే నీకాలమునకు బౌద్ధయుగ మనునామము నొసంగవచ్చును. దీనినుండి క్రీ. పూ. ౩౦౦౦ నుండి క్రీ. శ. ౬౪౭ వరకునుగూడ నీదేశమున హిందూవిద్యావిధాన మవిచ్ఛిన్నముగ సాగినదని స్పష్టమగుచున్నది. ఇటుపై నీవిద్యావిధానమును బైయుగవిభాగము ననుసరించి పరిశీలింపవలసి యున్నది.

I. క్రీ. పూ. ౨౦౦౦-౨౦౦

పరిస్థితులు:— తమ యాదిమనివాసస్థానములను వీడిన యార్యులు కేవల కుక్షింభరులై దేశముల ద్రిమ్మరుచు

బాహుబలముచే నచ్చటివారల దరిమి వారిదేశమునందు వసించుచుండిరి. ఎచ్చటనైనను సస్యశ్యామలమును, సుభిక్షమును నగు దేశము గన్పడినచో నీయాగంతుకులలో గొందరచ్చట స్థిరపడుచుండిరి. మిగిలినవారలు యథాపూర్వముగ శస్త్రోపజీవులై దేశాంతరముల కేగుచుండిరి. ఇట్టి వారిలో నొకశాఖ ప్రకృత పర్షియాదేశమునకు వలస వచ్చి యచ్చట స్థిరపడినది. కొంతకాలమునకు బిమ్మట దీనినుండి యొక యుపశాఖ బయల్వెడలి భారతదేశమునకు బశ్చిమోత్తరముననున్న బర్వతపంక్తుల నతిక్రమించి పంజాబున ప్రవేశించినది. విశ్వవిఖ్యాతము లగు భారతీయ నాగరికతాధినివేశములను నిర్మించిన దీ యార్యశాఖయే. సింధునదితీరమున కేతెంచిన కొంతకాలము వరకు నీ యార్యులు సుఖమనుదాని నెరుంగక నంతకు బూర్వమే యచ్చట ప్రబలులుగ నుండిన దేశీయులతో నిరంతరమును బోరుచుండిరి. అందువలన వారలు దమ బలశౌర్యములను బెంపొందించుకొని మహాశూరులుగ ప్రఖ్యాతి నందియుండిరి. వేదములనుండి యాకాలమున ఋషులు సహితము ఖడ్గమును, గలమునుగూడ నద్వితీయ సామర్థ్యముతో నుపయోగించుచు, నొకవంక వేదమంత్రములను, మఱియొకవంక శత్రుబలముల దెగటార్చుచు,నిర్మించుచు జయించిన భూభాగముల సేద్యము జేయుచు జీవించుచుండిరని తెలియుచున్నది. కొలదికాలమునకే యార్యుల యదృష్టము బయల్పడ వారిదాడి కోర్వజాలక దేశీయులు పలాయితులు కాజొచ్చిరి. దానజేసి యీ యాగంతుకులకు సస్యశ్యామలమును, సువిస్తృతమును నగు నొకభూభాగము లభ్యమయ్యెను. అంతటి-

నుండియు వారికి విశేష మగు క్షాత్రవృత్తి యనవసర మయ్యెను. పంజాబునందలి శీతోష్ణ స్థితి సమముగ నుండుటచేతను, భూమి సారవంత మగుటజేసి సునాయా సముగనే సర్వ వస్తువులును సమకూడుటచేతను ఆర్యులు కాయకష్టమునుమరచి సౌఖ్యమున కలవడజొచ్చిరి. అందు వలన వారలమానసిక ప్రవృత్తి యనేకవిధముల బయల్వెడ లినది. తినుటకు వలసినంత యన్నమును, వసించుటకు జాలినంత దేశమును, శాంతిసౌఖ్యములు నొనగూడుటచే నార్యులు దమ పరిసరములనుండు వస్తువులనుగూర్చియు, దత్రస్థము లగు ప్రకృతి వైచిత్ర్యములను గూర్చియు తాత్త్వికవిమర్శనము నారంభించిరి. ఈ యాదృచ్ఛిక కౌతూహలమే వైదికవాఙ్మయమునకు మూలము. వార లాకాలమున గృషైకజీవనులుగ నుండుటవలనను, యీసే ద్యము కేవలము బ్రకృతిపై నాధారపడియుండుట చేతను ఆర్యులు ప్రథమమున బ్రకృతి నారాధించు చుండిరి. ప్రకృతిని ప్రసన్నను జేసికొని యందలి వైచి త్ర్యములను గనుగొనుటకే వారి బుద్ధికౌశల ముపయో గింపబడుచుండెడిది. ఈ ప్రకృత్యారాధనమే ప్రాచీ నార్యుల మతనిర్మాణమునందలి ప్రథమసోపానము. వేద ములలో బ్రాచీనతమ మగు ఋగ్వేదమునందలి మంత్రము లన్నియు నీవిషయమునే స్పష్టీకరించుచున్నవి. ఈ యుపాసన మభివృద్ధినందుటచే తదంగములుగ యజు స్సామాథర్వములను మరిమూడువేదములు నిర్మింపబడినవి.

పై వైదికయుగ మంతమగునాటికి దేశమునం దనేకములగు మార్పు లొదవినవి. ఆర్యులు సింధుమైదా

నము నతిక్రమించి మధ్యదేశము నాక్రమింప దొడగిరి. క్రమముగ వారికి గంగానదీతీరమునకును, దక్షిణమున వింధ్యపర్వతములవరకును గల భూభాగ మంతయు స్వాధీన మయ్యెను. ఇం దనేకరాజ్యము లుత్పన్నము లైనవి. జీవితసౌకర్యార్థమై తమతమ యిచ్ఛాప్రకృతులనుబట్టి యొక్కొక రొక్కొకకార్యమును నిర్వహించున ట్లేర్పరుపబడినది. యజ్ఞయాగాదికముల నొనర్చి దైవానుకూల్యమును బడయుటయు, పరిలబ్ధము లగు భూభాగములలో శాంతిని నెలకొల్పి యింకను క్రొత్తభూములను జయించుటయు, భూమినిదున్ని పంటలను పండించుటయు నాకాలమునం దార్యులకు ముఖ్యకర్తవ్యములుగ గన్పించినవి. వానిని సాధించుటకై యప్పటిసంఘము నాల్గువిభాగములుగ నొనర్పబడినది. ఇవియే చతుర్వర్ణములు. ఈ విభజనము కేవలము వారువా రొనర్చు పనులనుబట్టియే జేయబడియుండినది. ప్రకృతమున ప్రతివారికిని దమ యిచ్ఛవచ్చినవృత్తుల ననుగమించుట కెటుల స్వాతంత్ర్యము గలదో యటులే యాకాలమునం దీవర్ణవిభజనము వృత్తిభేదమునే సూచించునదిగ నుండెను. అందుచే నేవ్యక్తికిని, నేకార్యమును జేయుటకైనను విధినిషేధములు లేకుండెడివి. ఈకాలమున ప్రత్యేకముగ గొందరు దేవతారాధనమునకై నియోగింపబడి యుండుటచే వీరి నిరంతర కృషివలన వైదికవాఙ్మయము సర్వతోముఖముగ నభివృద్ధి నందినది. వేదములందలి మంత్రములను, కర్మకాండను వివరించి వానిని సుగమముల నొనర్చుటకై వేదాంగములు నిర్మింపబడినవి. ఈకాలమునం దార్యు లెక్కు డభివృద్ధిని గాంచిరి. జాతివైషమ్యము

లాకాలమున లేకుండినవి. బుద్ధికుశలతయును, మేధా సంపదయు గలవారందరును జీవితపరమావధిని గూర్చియు జీవితతత్త్వమును గూర్చియు జర్చించుచుండిరి. క్షత్రియుడగు జనకరాజు నొద్దకు బ్రహ్మనిష్ఠాగరిష్ఠులగు ఋషులనేకులేగి పరమార్థ రహస్యములను దెలిసికొనుచుండిరి. వేదాంగములగు నుపనిషత్తులనుండి యాకాలపుటార్యుల పారమార్థిక జిజ్ఞాసను గూర్చి విశేషాంశములు దెలియుచున్నవి. స్త్రీలయెడ నాకాలమున విశేషగౌరవము జూపబడుచుండెడిది. వారిలో విద్యావతులనేకులుండిరి. గార్గి, మైత్రేయి మున్నగువారలు తత్త్వజిజ్ఞాసలలో బాల్గొనుచుండిరి.

హిందూయుగమునందలి మూడవ యుపవిభాగము సూత్రయుగము. ఈకాలమునందార్యులలో వర్ణభేదములు ప్రబలి శాశ్వతసాంఘికవిభాగములుగ నేర్పడినవి. ఈవర్ణముల కర్తవ్యములను వివరించుటకును, సంఘమును సంస్కరించుటకును శ్రౌత, ధర్మ, గృహ్యాది సూత్రములు నిర్మింపబడినవి. రాజకీయముగగూడ నీ సమయమునందనేకపరిణామము లొదవినవి. ఆర్యావర్తమునందేర్పడిన వివిధరాజ్యము లొండొంటితో గలహించుచుండుటచేతను, విదేశీయులగు పర్షియనుల దండయాత్రలమూలమునను దేశమునందధికమగు సంక్షోభ మొదవెను. కాలక్రమమున కాశి, కోసలము, మగధ యను మూడురాజ్యములు ప్రబలినవి. అనంతరము మగధ రాజ్య మితరప్రత్యర్థులనోడించి యేకచ్ఛత్రాధిపత్యమును వహించెను. క్రీ. పూ. ౫-వ శతాబ్దమున గౌతమబుద్ధుడుద

యించెను. ఇప్పటికే వైదికవాఙ్మయమును, వైదికమతమును అతివిస్తృతములు, బహుళములునై ప్రజాసామాన్యమున కగమ్యములుగ నుండినవి. దానజేసి బుద్ధుడు ప్రజా సామాన్యము తమజీవితమును సౌఖ్యముగ సాగించి యిహమున శాంతి ననుభవించుట కుపకరింప గల మార్గము నన్వేషించి యహింసాసౌభ్రాత్రమూలక మగు నూతన సిద్ధాంతమును బోధించెను. ఈ మతమును అజాతశత్రుడు మున్నగు మగధ రాజు లాదరించిరి. ఇంతటినుండియు బౌద్ధమత మీదేశమున ప్రబల జొచ్చినది. ఇదేసమయమున వర్ధమానుడను మరియొక క్షత్రియవీరుడు బయల్వెడలి, యిచ్ఛారాగములే సర్వ దుఃఖములకును మూల మనియు, వానిని త్యజించి, కష్ట సహనమూలకముగ మనస్సును నిగ్రహించుటవలననే సౌఖ్య మొనగూడు నని మరియొక సిద్ధాంతమును బోధించెను. ఇదియే జైనమతము. ఉత్తరాపథమునం దిటులు మతసంఘర్షణము జరగుచుండినకాలమున గ్రీకులు విఖ్యాతవిజేతయగు నలెగ్జాండరు నాయకత్వమున భారత దేశముపై దండెత్తివచ్చిరి. తత్ఫలితముగ నీదేశము నందలి పశ్చిమోత్తర ప్రాంతమున యవనరాజ్యములు స్థాపింపబడినవి. హిందూమతమును, హైందవస్వాతంత్ర్య మునుగూడ ప్రమాదమునకు లోనైయుండిన యీక్లిష్ట సమయమున గౌటిల్యుని సాహాయ్యమున జంద్రగుప్త మౌర్యుడు మగధసింహాసనము నధిష్ఠించెను. ఈతని బాహుబలమువలనను, గౌటిల్యుని రాజనీతివలనను యవ నులవలని ప్రమాదము తొలగింపబడి దేశమున శాంతి సౌఖ్యములు నెలకొల్పబడినవి. చంద్రగుప్తుడు హిందూ

మతమునుగూడ నుద్ధరించెను. ఆతని పౌత్రుడగు నశోక చక్రవర్తి బౌద్ధమతమునం దాసక్తిగలిగి యామతము ననేకవిధముల నాదరించెను. ఇదియే హిందూమతక్షైణ్యమునకును బౌద్ధమతప్రాబల్యమునకును ప్రారంభము.

విద్యాచరిత్రము:—ఇంతవరకును క్రీ. పూ. ౨౦౦౦-౨౦౦ నడుమగల భారతదేశచరిత్రమును సంగ్రహముగ జెప్పియుంటిమి. ఇటుపై నీకాలమునందలి విద్యావిధానమును వర్ణింపవలసియున్నది. జాతీయచరిత్రమునకును, తదీయవిద్యావైదుష్యములకును సన్నిహిత సంబంధము గలదని ప్రపంచచరిత్రము దెల్పుచున్నది. ఆకాలపు సాంఘికనియమములనుబట్టి యొక్కొకవర్ణము వారల కొక్కొకవిధమగు విద్య విధింపబడియున్నది. ప్రథమమున వైదికవిద్యయే సర్వగమ్యముగ నుండినను, పిమ్మట నేతెంచిన జాతిభేదములనుబట్టి యీవిద్యయందును భేదములు కల్పింపబడినవి.

బ్రాహ్మణవిద్య:—ప్రాచీనార్యులు మొదటిలో ప్రకృత్యారాధకులుగ నుండి యందలి వైచిత్ర్యముల నభివర్ణించుచు ప్రకృతిలక్షణములను ప్రత్యేకవ్యక్తులుగ భావించి వానిని గీర్తించుచుండిరి. ఈ సందర్భమునం దనేకములగు మంత్రములు రచింపబడినవి. అటుపై నీ వైయక్తికదేవతల నారాధించుటకై యజ్ఞయాగాదికములు నిర్ణయింపబడినవి. ఇందు నడుపవలసిన కర్మకాండనుగూడ మంత్రములలోనే చేర్కొనిరి. అందుచే ఋగ్యజుస్సామాథర్వము లను నాల్గువేదములును ప్రాచీన హైందవవాఙ్మయసౌధమునకు బునాదులుగ నుండినవి.

ఆకాలపుటార్యులకు దమ వైదుష్యమును లిఖించి జాగ్రత్త పరచుకొను నాచారము లేకుండెడిది. కాన నీ వేద విద్య మౌఖికముగనే వ్యాపించుచుండెను. తండ్రినుండి పుత్రుడును, గురువునుండి శిష్యుడును దానిని గ్రహించు చుండిరి. కాలక్రమమున వాఙ్మయ మభివృద్ధి నంది కర్మకాండ పెరుగుటచే నెంత మేధావంతునకైనను దాత్కాలిక వైదుష్యమునంతటిని యనుసరించుట కష్ట సాధ్యముగ నుండెను. అందుచే నీవిద్యాభ్యాసమున ప్రత్యేకపరిశ్రమ మొనర్చు టవసరమయ్యెను. తదను సారముగ యాగములలో హోతృవృత్తిని నెరవేర్చువా రలు ఋగ్వేదమును, అధ్వర్యులు యజుర్వేదమును, ఉద్గాతలు సామవేదమును బఠించుచుండిరి. వివిధవేద పారగు లగు బ్రాహ్మణులు సుప్రశాంతములగు నరణ్య ముల నివసించుచు యజన యాజనాదిక మొనర్చు చుండిరి. బ్రాహ్మణయువకు లీవేదపారగులవద్దకు బోయి యా విద్యను గ్రహించుచుండిరి. సుస్నాతులయి నిశ్చల మనస్కులయి గురుశిష్యులొక ప్రశాంతస్థలమున నందాసీ నులగుచుండిరి. పిమ్మట గురువు వేదమంత్రము నొక దానిని బఠింప శిష్యు లాతని ననుసరించుచుండిరి. దీనికి "విధి" యని పేరు. ఇటులు నాలుగైదుపర్యా యములు బాఠప్రవచనము లయినపిమ్మట నాచార్యుడు మంత్రార్థమును బోధించుచుండెను. దాని "కర్థవాద" మని పేరు. ఈ వాక్యప్రవచనములనుండియే శిక్షా వ్యాకరణాదివేదాంగములు బయల్వెడలినవి. ఆకాల మున భాండాగారములును, లేఖనసాధనములును ఉప యోగింపబడకుండుటచే విద్యయంతయు గంఠస్థముగనే

యుండెడిని. ఇట్టులు విషయములను మనోగతములు నొనర్చుకొనుటకు నుపకరించుటకై యనేకములగు పునశ్చరణపద్ధతు లాకాలమునం దుండెడివి. ప్రత్యేణ, నిర్భుజ, ఉభయమంతరేణ, సంహిత, పద, క్రమ, ఘన, జట—అనున విట్టివే. ఇంతియగాక శబ్దములన్నియు బాహుళ్యమునుబట్టియు, వత్తు (Accent) ను బట్టియు నక్షరసంబంధమునుబట్టియు "మాత్ర, బలము, సామము, సంతానము" విధముల విభజింపబడినవి. వేదములందలి యారణ్యకభాగములనుండి ప్రాచీనార్యవిద్యావికాసమునుగూర్చి తెలియనగున దింతియే.

ఆరణ్యకములకుబిమ్మట నిర్మింపబడిన బ్రాహ్మణములనుండియు, నుపనిషత్తులనుండియు గొన్ని విశేషాంశములు తెలియుచున్నవి. ఉపనయనసంస్కారము జరగినపిమ్మటగాని బ్రాహ్మణునికైనను వేదాధ్యయనాధికారము లేకుండెడిది. ఈయుపనిషత్కాలమునకు వైదికవాఙ్మయ మెక్కుడుగ నభివృద్ధినందినది. నాల్గు వేదములు, ఇతిహాసపురాణములు, రాశి యను గణితము, ఏకాయతనమను నీతిశాస్త్రము, దేవవిద్యయను శబ్దశాస్త్రము, శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, జ్యోతిషము కల్పము, నిరుక్తము నను వేదాంగములు-ఇవియన్నియు నాకాలమున బఠనీయములుగ నుండెడివి. తలిదండ్రులు బాలున కుపనయనమునొనర్చి వానిని యోగ్యుడగు నొక గురునిగృహమునకు గొనిపోయి యచ్చట విడచుచుండిరి. ఆత డచ్చట నుండి గురుసుశ్రూషను జేయుచు బ్రహ్మచర్యమునూని పండ్రెండుసంవత్సరములవరకును విద్యను

నేర్చి యటుపిమ్మట గురునిచే ననుజ్ఞాతుడై స్వగృహము నకు మరలుచుండెను.

సాధారణముగ విద్యాభ్యాసము శ్రావణ శుద్ధ పూర్ణిమనాడు ప్రారంభింపబడుచుండెడిది. ఉషః కాలముననే లేచి స్నానసంధ్యాద్యనుష్ఠానములను నిర్వర్తించుకొని బాలురందరును గురువునొద్దకు జేరుచుండిరి. అచ్చట వీరలు కొన్ని నియమములను పాటింపవలసియుండెను. గురునకు భక్తిపూర్వకముగ నమస్కరించి, యాతనిచే ననుజ్ఞాతులై యాత డాసీనుడైనపిమ్మట శిష్యులు దాము గూర్చొనుచుండిరి. అప్పుడు తమపాదములను గురునివైపున కుంచకుండునటుల జాగరూకతతో నుండవలసియుండెను. పిమ్మట నాచార్యు డుచ్చరించిన మంత్రాదికములను బాలురు జాగరూకతతో ననువదించుచుండిరి. అటుపై నాత డొనర్చు వాక్యార్థములను శ్రద్ధగ నాలకించి దానిని మనోగతముగ జేసికొను చుండిరి. ఈవిధమున ప్రాతః కాలమున విద్యాభ్యాసము ముగియుచుండెడిది. సాయంసమయమునందు బాలు రుదయమున నేర్చినదానిని పునశ్చరణచేసి గట్టిపరచుకొనుచుండిరి.

ప్రాచీనార్యులు, విద్యాభ్యాసమువలన విద్యార్థికి కేవలము మనోవికాసమేగాక చక్కని శీలము గూడ నేర్పడవలెనని నిశ్చయించియుండిరి. అందువలననే బ్రహ్మచర్యవ్రతమునకును విద్యాభ్యాసమునకును అవినాభావసంబంధము నేర్పరచిరి. ఇంతియగాక నీకాలమున బయల్వెడలు తామసరాజసప్రవృత్తుల నణచి విద్యార్థియొక్క మానసమును సాత్త్వికమార్గముననే

కేంద్రీకరించుటకై యనేకములగు నేర్పాటులు గావింప బడినవి. ధర్మసూత్రములలో గాంచనగు నిట్టి విధు లలో నీక్రిందివి ముఖ్యములు:—

౧. మధురపదార్థములు, సుగంధ ద్రవ్యములు, దివానిద్ర, పాదరక్షలు, వాహనములు మున్నగు రాజ సములను వర్జించుట,

౨. ప్రణయమును, కోపమును దరికి రానీయ కుండుట,

౩. వాక్కును, హస్తములను, క్షుధను సాధించి స్వనియామకత్వమునం దుంచుకొనుట,

౪. సత్యమునే పల్కుట, పరుష వాక్యముల నాడకుండుట,

౫. నిష్కళంకమగు బ్రహ్మచర్యమును బూనుట,

౬. వినయవిధేయతలతో బ్రవర్తించుట.

౭. గురువును, గురునికుటుంబమును భక్తిగౌరవ ములతో జూచుట,

౮. అనన్యమనస్కుడై విద్య నేర్చుట.

గురుశిష్యులకు గల సంబంధమును బలపరచి వారి సౌమనస్యము నభివృద్ధిపరచుటకుగూడ బ్రాచీనులచే కొన్ని నియమము లేర్పరుపబడినవి. విద్యార్థి తన విద్యా భ్యాసము పూర్తియగువరకు నాచార్యుని విడువరాదు. గురుని గృహము నూడ్చియు, నాతని దేవతారాధనకై పుష్పములను, సమిధలను, జలమును దెచ్చియు సపర్యల నొనర్పవలెను. భిక్షాటన మొనర్చి యన్నమును సంపాదింప

వలెను. అటులనే గురువులును శిష్యులను దమబిడ్డవలె స ప్రేమాభిమానములతో జూచుకొని, మృదుమధుర భావణ ములచే వారి మానసములను రంజింపజేసి, పరిపూర్ణమగు శ్రద్ధనువహించి వారికి విద్యను నేర్పుచుండిరి. గురుకుల మునందుండి బాలుగు నేర్చెడి విద్య యుచితముగనే చెప్ప బడుచుండెడిది.

క్షత్రియవిద్య :— విద్యావిధాన మంతయు బ్రా హ్మణుల యధీనమునందే యుండిన వైదికయుగమున హిత మితరజాతులవారలలో ననేకులగు విద్వాంసుల లుండిరి. కాని కాలక్రమమున సంభవించిన సాంఘిక రాజకీయాదిపరిణామములచే బ్రాహ్మణుల పలుకుబడి హెచ్చి క్షత్రియ వైశ్య శూద్రుల విద్యాభ్యాసముకూడ వారి యధీనమునందే యుండెను. ఇంతవరకును బ్రాహ్మణబాలకుల విద్యావిధానమును వర్ణించియుం టిమి. ఇటుపై నితరజాతుల కెట్టివిద్య నేర్పబడు చుండెడిదో పరిశీలింపవలసియున్నది.

గౌతముడు క్షత్రియులకు వేదత్రయమును, తర్కము, ధర్మశాస్త్రము, పురాణములు, నీతిశాస్త్రము మున్నగువానిని నేర్పవలె నని చెప్పియున్నాడు. ఇంతి యగాక వారలకు యుద్ధవిద్యయందుగూడ శిక్షణ మొసంగబడుచుండెడిది. క్రీ. పూ. ౨౦౦-౩౦౦ రె నడుమ నీదేశమున రాజనీతినిగూర్చి యనేకగ్రంథములు రచింప బడినవి. వానిలో నగ్రగణ్యమగు గౌటిల్యుని యర్థ శాస్త్రమునం దీక్రిందిక్షత్రియవిద్యాప్రణాళిక యొసంగ బడియున్నది:

౧. శైశవమున దలిదండ్రుల లాలనను శిక్షణము.

౨. అక్షరాభ్యాసము – ప్రారంభవిద్య.

౩. ఉపనయనము.

౪. సాంఖ్య, యోగ, లోకాయతనములు గల "ఆన్వీక్షకీ" విద్య. దీనిని దగు నాచార్యులయొద్ద నేర్వవలసియుండెను.

౫. వార్త – కృషి, గోరక్షణ, వాణిజ్యములు గలది. రాజపుత్రులు వీనిని రాజకీయోద్యోగులవద్ద నేర్చుచుండిరి.

౬. దండనీతి – సుప్రసిద్ధులగు రాజ్యాంగవేత్తలు దీనిని నేర్పుచుండిరి.

సాధారణముగ యువకులు ప్రాతఃకాలమున దేహపరిశ్రమను జేయుచు నాయుధవిద్య నభ్యసించుచుండిరి. సాయంసమయములందు వారలు గురువులవద్ద కేగి విద్యను నేర్చుచుండిరి. అట్టి సమయములందు వీరి కితిహాసపురాణములును, ఇతివృత్తమును, నీతిని బోధించు కథలు, ధర్మశాస్త్రము, అర్థశాస్త్రమును బోధింపబడుచుండెడివి. (cf. విష్ణుశర్మ సుదర్శన రాజపుత్రులకు నేర్పినవిద్య). ఆకాలమున కౌటిల్యుని యర్థశాస్త్రమును, కామందకుని నీతిసారమును, హితోపదేశ పంచతంత్ర కథాసరిత్సాగరములును, భారత రామాయణములును బఠనీయగ్రంథములుగ నుండెడివి.

వైశ్యవిద్య: — బ్రాహ్మణబాలురకు బోధింపబడు వైదికవాఙ్మయమున గొంతమాత్రమే క్షత్రియు

లకు నేర్పబడి వారల విద్యాప్రణాళికయందు విశేష ముగ జాతీయవృత్తి కనుగుణము లగు విషయములే జేర్ప బడినవి. వైశ్యులకు నేర్పబడు విద్యలో నేమాత్ర మైనను వైదికవాఙ్మయము లేకుండెడిది. వారివృత్తి కనుగుణము లగు వాణిజ్యము, కృషి, భూగోళశాస్త్రము, గణితము, భాషలు మున్నగునవిమాత్ర మీజాతియువకు లకు బోధింపబడవలె నని శుక్రుడు, మనువు మున్నగు వారలు వ్రాసియున్నారు. వారి నైతికజీవితమును పెంపొందించుటకై పురాణేతిహాసములును, నీతిదాయక ములగు కథలునుగూడ వారలకు బోధింపబడుచుండెడివి. తండ్రులును, పెద్దలును వాణిజ్యమును జేయుచుండ వారి వద్దనే యుండి యువకులు యథార్థజ్ఞానమును సంపా దించుచుండిరి.

ప్రాచీనకాలమున వైశ్యులకు సంఘమునం దెక్కుడు ప్రాముఖ్య ముండెడిది. ఆకాలమున వర్తకసంఘము లనేకము లుండినటుల ప్రాచీన వాఙ్మయమునుండి తెలియుచున్నది. ఈ సంఘ ముల కనేకనామము లుండెడివి. మనుస్మృతిలోని 'శ్రేణి' యను పదమునకు మేధాతిథి, గోవిందరాజు, నందన మున్నగు వ్యాఖ్యాతలు, వర్తకసంఘ మని యర్థముచెప్పిరి. మహాభారతముగూడ నీ యర్థమునే దెలుపుచున్నది. కాశికావృత్తి, వీరమిత్రోదయము, వివాదరత్నాకరము మున్నగువానిలో 'పూగ' యను పద మీయర్థమునం దుపయోగింపబడినది. బౌద్ధవాఙ్మయ మునగూడ పదునెనిమిది వర్తకసంఘములు పేర్కొన

బడినవి. ఈసంఘము లుత్తమపద్ధతులపై నిర్మింపబడి నేటి నిధులు (Banks) నిర్వర్తించు కార్యముల నన్నిటిని జేయుచుండెడివి. వీనికి బాలురను వివిధవ్యాపారములలో శిక్షితుల నొనర్చు టొకకర్తవ్యముగ నుండెడిది.

వృత్తివిద్య:—పరిశ్రమోపజీవులగు తుదియవర్ణపు బాలురకు వాఙ్మయ మనవసర మని తలచి ప్రాచీనులు వారలకు పారంపర్యముగ వచ్చు వృత్తివిద్యనే యేర్పరచిరి. వర్తకసంఘములవలెనే మనదేశమున బూర్వము వృత్తిసంఘము లనేకము లుండెడివి. ధర్మశాస్త్రాదులును, శాసనములును వీనినిగూర్చి విశేషాంశములను దెలుపుచున్నవి. కర్షకులు, నర్తకులు, మణికారులు, స్వర్ణకారులు, లోహకారులు, వడ్రంగులు, శిల్పులు, చర్మకారులు, సాలెవారు, తిలఘాతకులు, కుమ్మరులు, మేదరులు, దంతపుపనివారు, పశులకాపరులు మున్నగు వారెల్లరకును బ్రత్యేకసంఘము లుండెడివి. కొన్నికొన్ని గ్రామములు కొన్నికొన్ని పరిశ్రమల నభిమానించుటయు, నగరములలో నొక్కొక భాగమునం దొక్కొక వృత్తియు, పరిశ్రమయు పోషింపబడుటయు గూడ నుండెడివి. మానసారము మున్నగు వాస్తుశాస్త్రము లీవిషయమును తెల్పుచున్నవి. ఈవృత్తిసంఘములు వర్తకసంఘములకంటె పాటవము గల్గియుండినవి. వీనికిగూడ సభ్యుల బాలురకు దగినవృత్తిశిక్షణము నొసంగుట ముఖ్యకర్తవ్యముగ నుండెడిది. దీనిని గూర్చి పెక్కు నిబంధనలు గలవు. తనజాతియొక్క వృత్తిని నేర్చుకొనగోరు యువకుడు బంధువుల యనుమతిని గైకొని, విద్య నభ్యసింపవలసిన కాలము

నేర్పరచుకొని యొకగురువువద్ద కేగి విద్యాభ్యాసాంత
తమువరకు నచ్చట నుండవలెనని నారదుడు వ్రాసి
యున్నాడు. గురువు శిష్యుని తన పుత్రునివలె జూడ
వలెను. అతని నితరకార్యముల నియోగింపరాదు. నిర్దిష్ట
కాలముగుటకుపూర్వమే యువకుడు గురువును విడువ
గూడదు. అటుల జేసినచో నాతడు శిక్షకుపాత్రుడు.
ఆతనిబంధువు లాతనిని రప్పించుకొనినయెడల గురువు
వారిపై చర్య తీసికొనవచ్చును. నిర్దిష్టకాలములో
బాలునికి విద్యరానిచో నాతడు మరికొంతకాల ముండ
వలెను. అంతకు బూర్వమే యాత డుత్తీర్ణుడైనను
గురువునాజ్ఞ లేక యింటికి మతలరాను. ఈ శిక్షణ
కాలమున శిష్యుని పరిశ్రమచే లభ్యములగు వస్తువులపై
గురువునకు సర్వస్వామ్య ముండెడిది. ఈవిద్య కేవల
ము మౌఖికమేగాక వాస్తవముగూడ నైయుండె
డిది. గురువు దా నేదేనొక పనిని జేయుచు శిష్యునిచే
గూడ జేయించుచు, ప్రమాదములను సరిచేయుచు నాతని
కావృత్తిని నేర్పుచుండెను. శిష్యుడు గురువునెడ
వినయవిధేయతలను గలిగి యప్రమత్తుడై విద్యను నేర్వ
వలసియుండెను.

బౌద్ధవాఙ్మయమునుండి యొక్కొక్క రనేక
వృత్తులను నేర్చుచుండిరని తెలియుచున్నది. హేయము
లును, క్రౌర్యముతో గూడినవియు దక్క నితరవృత్తు
లన్నియు సగౌరవములుగనే బరిగణింపబడుచుండెడివి.

విద్యాసంస్థలు :— ఇంతవరకును క్రీ. పూ.
౨౦౦౦ – ౨౦౦ ల నడుమ గల ప్రాచీనార్యవిద్యా

విధానమును సంగ్రహముగ జేర్కొనియుంటిమి. ఈ విద్యావిధానమునకు గొన్ని సంస్థలు ముఖ్యాధారములుగ నుండినవి. దైవోపాసనాంగములగు యజ్ఞయాగాది క్రతువులను నిర్వహించుటకై యార్యులు నిర్జనములు, ప్రశాంతములు నగు నరణ్యములలో నేర్పరచిన యాశ్రమములే యీ దేశమునందలి ప్రథమవిద్యాసంస్థలు. ఒక్కొక యాశ్రమమున కొక్కొకఋషి కులపతిగ నుండెను. ఈతనియొద్ద కనేకులగు శిష్యులు జేరి వేదవిద్య నభ్యసించుచుండిరి. అప్పుడపుడీ ఋషులు సంచారము జేయుచు నొకరొకరిని గలసికొనుచు వేదార్థమును గూర్చియు, నితరాధ్యాత్మికవిషయములను గూర్చియు వాక్యార్థములను జేయుచుండిరి. ఈసమయములలో శిష్యులు వారి ననుగమించుచుండుటచే వారలకు విశేషాంశములను దెలిసికొన నవకాశము లొదవుచుండెడివి. ఈ యాశ్రమవాసులకు గల్గు బాధలను నివారించి వారివలన రాజులు ధర్మోపదేశము నందుచుండిరి.

కాలక్రమమున వైదికవాఙ్మయ మభివృద్ధి నందుటచే విద్వాంసు లొక్కొకవేదముననో, వేదాంగముననో ప్రత్యేకముగ గృషిచేయుచుండిరి. ఇట్టివారలు గ్రామములలో నివసించుచు, విద్యనభ్యర్థించుచు దమవద్ద కేతెంచిన యువకులకు విద్యను నేర్పుచుండిరి. ఇట్టి పండితుల గృహములు గురుకులము లనుపేరిట వాసికెక్కి ముఖ్యములగు విద్యాసంస్థలుగ నుండినవి. ఇచ్చట విద్యార్థులకు విద్యయు, భోజనము నుచితము

గనే లభించుచుండెడివి. గురువునకు శుశ్రూష జేయుచు ననన్యమనస్కులై యిచ్చట బండ్రెండు సంవత్సరము లను గడపి బాలురు విద్యను నేర్చుచుండిరి. అటుపై నాచార్యుడు వీరినెల్లరను జేరదీసి వారలు ముందు, గృహముల కేగి గృహస్థాశ్రమమున బ్రవేశించినపిమ్మట బ్రవర్తింపవలసిన రీతులను వారలకు బోధించి యాశీర్వ చనపూర్వకముగ వీడుకొలుపుచుండెను. ఇట్టి యుపదే శమే తైత్తిరీయోపనిషత్తునందలి "వేదమనూచ్యాచా ర్యోఽన్తేవాసిన మనుశాస్తి" యను భాగమున జేర్పం నబడియున్నది. ఉపనయనానంతరము వటువులుగ గురుకులమున కేతెంచినబాలురు స్నాతకులుగ వాని నుండి మరలుచుండిరి. ఈ యాచారము ప్రస్తుతము విశ్వవిద్యాలయములలో నేఁటేటను యువకులకు పట్ట ముల నిచ్చుచో జేయబడు సమావేశోపదేశములకు సరి యగును.

ఆశ్రమములకును గురుకులములకును బిమ్మట జేర్పంనవలసిన విద్యాసంస్థలు పరిషత్తులు. ఇం దనేక శాస్త్రవేత్త లగు పండితులు జేరి విద్యావిషయ కములును, మతవిషయకములును నగు సమస్యలను నిర్ధా రించుచు సామాన్యముగ విజ్ఞానమును వ్యాపింపజేయు చుండిరి. ఈ పరిషత్తులలో తత్త్వసిద్ధాంతధర్మశాస్త్ర వేత్తలగు నిరువదియొక్క బ్రాహ్మణ పండితులు సభ్యు లుగ నుండిరి. వేదాంతపారగులు నల్వురును, ధర్మ శాస్త్రజ్ఞులు ముప్వురును, మరిముప్వురును ఇందుండవలెనని గౌతముని యభిప్రాయము. వసిష్ఠ బోధాయను లీ సమావేశములలో నొకమీమాంసకుడును, ఒక వేదపారగు

డును, గృహస్థ వానప్రస్థ సన్యాసాశ్రమముల నందు వారలు మరిముప్పురు నుండవలెనని వ్రాసియుండిరి. ఇతర ధర్మశాస్త్రకారులు భిన్నాభిప్రాయముల నొసంగియుండిరి. ఇందలి సభ్యులందరును బండితులు, నధ్యాపకులు నై యుండిరి. వార లీ పరిషత్తుల కేగునపుడు శిష్యులు కూడ నేగి యాసమావేశములం దొదవు వాదోపవాదములనుండి విశేషాంశముల ననేకములను గ్రహించుచుండిరి. ఈసమావేశములు గ్రామములలోనో, లేక నగరములందో జరగుచుండెడివి. రాజులును, శ్రీమంతులును వీనికి దానధర్మముల నొనర్చుటేకాక, నితరవిధముల ననేకము లగు సౌకర్యముల నొనగూర్చుచుండిరి.

విద్యాపీఠములు :— కాలక్రమమున నీదేశమున గొన్ని ప్రత్యేక విద్యాస్థానములు బయల్వెడలినవి. అట్టి వానిలో బదరికాశ్రమ మగ్రగణ్యము. ఇయ్యది హిమాలయముపై హరిద్వారమునకు ౨౫౦ మైళ్ళ దూరమునం దున్నది. వేదాంతవిద్య కీస్థలముపెట్టినది పేరుగ నుండెను. వేదాంతసారము లగు బ్రహ్మసూత్రములను, పంచమవేద మగు భారతమును వ్యాసమహర్షి యిచ్చటినుండియే ప్రచారముచేసె నని హిందువుల నమ్మకము. గంగోత్పత్తిస్థాన మగుటచే నీస్థలము హిందూ పుణ్యక్షేత్రములలో నగ్రగణ్యము. వేదములకును, ప్రస్థానత్రయమునకును ప్రత్యేకవ్యాఖ్యానములను రచించి ప్రత్యేక సిద్ధాంతములను స్థాపించిన శంకరరామానుజ మధ్వాభిధు లగు నాచార్యులు ముప్పురు నిచ్చటి కేతెంచి తమ వ్యాఖ్యానముల నిచ్చట వేదవ్యాసునకు వినిపించి యాతని యనుజ్ఞనందియే జనులకు బోధించిరి.

వేదాంతమునకు బదరికవలెనే నైమిశారణ్యము పురాణేతిహాసముల కుత్పత్తిస్థానము. యజ్ఞయాగాది సమయములందును, పర్వకాలములందును ఇచ్చట వాని ప్రచారము జరగుచుండెడిది. జను లెల్లరు నిచ్చట జేరి యిచ్చటి ఋషిపుంగవులవలన దమ సందియము లను బాపుకొనుచు తత్త్వమును దెలిసికొనుచుండిరి.

చరిత్రకాలమునకు కాశీక్షేత్రమును, బశ్చిమోత్త రమున దక్షశిలానగరమును ప్రఖ్యాత విద్యాపీఠములుగ నున్నవి. గౌతమబుద్ధుని కాలమునకే తక్షశిలానగరము పేరెన్నిక గాంచియుండెనని చెప్పబడియుండుటచే దీనియుత్పత్తి క్రీ. పూ. ౫-వ శతాబ్దికి బూర్వమైయుండ వలెనని స్పష్టమగుచున్నది. మహాపురుషు లనేకు లీ విద్యాపీఠమును పవిత్రమొనర్చిరి. రామాయణ మహా భారతములలో నీనగరము ప్రశంసింపబడియున్నది. ఇచ్చట వైద్యశాస్త్ర మభిమానవిద్యగ నుండెడిది. నగరము చుట్టును పదునేను మైళ్ళదూరమున మూలికావనము లుండెడివి. జీవకు డనునాత డిచ్చట నేడుసంవత్సర ములు గృషిసల్పి యాయుర్వేదమునందలి రహస్యముల నెల్ల గ్రహించెను. ఈతడు మగధరాజ్యాధీశుడగు బింబి సారునకును, బుద్ధునకునుగూడ చికిత్సజేసెనని చరిత్రము దెల్పుచున్నది. ఆకాలమునం దాత్రేయు డిచ్చట నాచార్యుడుగ నుండెను. ఆతనికి బిమ్మట చరకు డాచార్యపదవిని వహించి వైద్యవిద్యను పెం పొందించెను. కాయచికిత్సామూలక మగు నష్టాంగ వైద్య మీతనిచే వ్యాప్తి నందింపబడెను. హార్య

రాజ్యస్థాపకుడగు చంద్రగుప్తునికి గురుడు, మంత్రియు నై, రాజ్యాంగవేత్తలలో నగ్రగణ్యుడుగ నుండిన యాచార్య చాణక్యుడీ తక్షశిలానగరముననే విద్య నభ్యసించెను. అశోకునికాలమునం దీ విద్యాలయము విశేషవిఖ్యాతిని బడసియుండె ననుటకు యవనచరిత్ర కారుల వ్రాతలును, విదేశీయు లనేకు లిచ్చట విద్యార్థులుగ నుండుటయునే ప్రబల నిదర్శనములు. సంస్కృత వ్యాకరణమును రచించిన పాణిన్యాచార్యుడుగూడ నిచ్చట జదివియుండెను. బుద్ధు డవతరించి తనసిద్ధాంతములను బోధించిన పిమ్మట నీ తక్షశిలావిద్యాలయము బౌద్ధవిద్యనుగూడ బోధించుచుండె నని ఫాహియాన్ వ్రాసియున్నాడు. ఈ విశ్వవిద్యాలయము క్రీ. శ. ౫-వ శతాబ్దమువరకును నిలచియుండి యటుపై క్షీణించెను. చరిత్రకాలమునకు పూర్వమే బయల్వెడలి యనేక పరిణామములను గాంచి, నేటికిని సజీవముగ నున్నది కాశీవిద్యాపీఠము. ఇచ్చట గంగానది యుత్తర వాహినియగుటచే నీస్థలము విశేష ఫలప్రదముగ నెంచ బడుచున్నది. అనాదినుండియు నీ వారణాశి క్షేత్రము హిందూపుణ్యక్షేత్రములలో నగ్రగణ్యముగ నుండినది. వివిధప్రాంతములనుండియు జను లిచ్చటికి కేతెంచు చుండిరి. సాధారణముగ నాధ్యాత్మికచింతకులును, పండితులు నిట్టి పుణ్యక్షేత్రములనే వసించుచుండిరి. బుద్ధునికాలమున కీ నగరము వేదశాస్త్రాదుల కాలవాలమై ప్రాచీన హిందూ వైదుష్యమునకు కేంద్రముగ నుండినది. గౌతము డిచ్చటి కనతిదూరమున గల సారనాథ్ వద్దనే తన ప్రథమమతబోధలను గావించెను.

పుణ్యక్షేత్రము, పండితనివాసము నగుటచే నిచ్చటి కనేకులగు విద్యార్థు లేతెంచుచుండిరి. విద్వత్పోష ణము నొక ముఖ్యకర్తవ్యముగ నెంచుచుండిన రాజు లీ విద్వాంసుల కనేకసౌకర్యములను గల్పించుచుండిరి. అప్పటినుండి నేటివరకు నీ కాశీక్షేత్రము వైదుష్యమున కగ్రస్థానముగ నున్నది. నేటికిని పండ్రెండు సంవత్సర ములకాలము నిరంతర కృషి జేసినగాని యొకశాస్త్రమున సరియగు నభినివేశము లభింపదని యిచ్చట విద్యాభ్యాస మొనర్చిన పండితులు చెప్పుచున్నారు.

II. క్రీ. పూ. ౨౦౦ నుండి క్రీ. శ. ౬౫౭ వరకు

ఇంతవరకును క్రీ. పూ. ౫౦౦౦-౨౦౦ నడుమ నీదేశమునం దభివృద్ధినందిన విద్యావిధానమును, తదం గములగు విద్యాపీఠములును వర్ణితములయినవి. క్రీ. పూ. ౨౦౦ సంవత్సరప్రాంతమునుండి క్రీ. శ. ౬౫౭ వర కును గలకాలము భారతీయవిద్యాచరిత్రమునందలి రెండవ విభాగము. విషయప్రాముఖ్యమునుబట్టి యీ విభాగ మును బౌద్ధయుగమని పేర్కొనదగును. ఈకాలమున రెండు విద్యావిధానము లీదేశమున బ్రబలినవి. కొన్ని సమయములందును, గొన్ని స్థలములందును బౌద్ధమత ముతోబాటుగ బౌద్ధవిద్యయు, మరి కొన్నిట హిందూ విద్యయు నభివృద్ధినందినవి. ఈ హిందూవైదుష్యము పూర్వోక్తమగు వైదికవిద్యయొక్క పరిణామమేయగుట వలనను, విషయము సులభముగ బోధపడుట కనుకూల ముగ నుండుటవలనను ఇటుపై బౌద్ధయుగమునంద

హిందూవిద్యాచరిత్రము పేరొక్కనబడుచున్నది. రాబోవు నధ్యాయమున బౌద్ధవిద్యాచరిత్ర మభివర్ణింపబడును.

పరిస్థితులు:—ఈయుగమునందలి హిందూవిద్యాచరిత్రమును దెలిసికొనుట కీకాలమునందలి హిందూమతముయొక్క చరిత్రమును, సాంఘికరాజకీయాదిపరిస్థితులను సంక్షేపముగ గమనింపవలసియున్నది. ఈయుగారంభమున పాటలీపుత్రమునుండి మౌర్యవంశీయులుత్తరదేశముపైనను, దక్షిణాపథమునందలి విశేషభాగముపైనను ఏకచ్ఛత్రాధిపత్యమును వహించియుండిరి. కడపటిమౌర్యుల కాలమున బశ్చిమోత్తరమునుండి విదేశీయు లనేకు లీదేశమున బ్రవేశించి, జాతిభేదములను బాటింపక మానవకల్యాణమును జేకూర్ప యత్నించుచుండిన బౌద్ధమతము వీరల నాకర్షించుటవలనను, మౌర్యుల యాదరమును బడయుటవలనను బౌద్ధమతము ప్రబలి తాత్కాలికహిందూమతము క్షీణించెను. మౌర్యచక్రవర్తులకు బిమ్మట మగధరాజ్యము నేలిన సుంగకణ్వవంశజులు హిందూమతమును పునరుద్ధరించి యవనులను నిర్జించిరి. యవనసంపర్కమువలన హిందువుల శిల్పనాటకాదికళలును, గణితజ్యోతిషాదిశాస్త్రములు నభివృద్ధి జెందినవి. క్రీస్తుశకారంభమున యవనశకపహ్లావులీదేశమున బశ్చిమోత్తరభాగము నెల్ల నాక్రమించి పాలింపసాగిరి. పిమ్మట కుషాను లీదేశముపై దండెత్తి వీరినెల్లరను, దేశీయపాలకులనుగూడ నిర్జించి తమ సామ్రాజ్యమును నెలకొల్పిరి. వీరిలో నగ్రగణ్యుడగు కనిష్కచక్రవర్తి బౌద్ధమతము నుద్ధరించెను. ఈకాల

మున దక్షిణాపథమున రాజ్యమేలుచుండిన శాతవాహన వంశజులలో నగ్రగణ్యుడగు గౌతమీపుత్రశాతకర్ణి బ్రాహ్మణమతమును పునరుద్ధరించెను. పిమ్మట మగధ రాజ్యము గుప్తవంశీయుల పాలనమునకు లోనయ్యెను. వీరికాలమున హిందూమత మపూర్వమగు నభ్యుదయమును గాంచెను. పురాణేతిహాసాదులును, చక్కని ప్రబంధ ములును, శాస్త్రము లనేకములు నీకాలమున రచింపబడి నవి. హిందూమతమును, సంస్కృతభాషను గుప్తచక్ర వర్తులు విశేషముగ నాదరించి వానికి నూతన తేజమును గల్గించిరి. పిమ్మట హూణులీదేశముపై దండెత్తివచ్చి క్రీ. శ. ౬-వ శతాబ్దమున గుప్తసామ్రాజ్యము నంత మొందించిరి. అటుపై ౬౦౬-౬౪౭ నడుమ శ్రీహర్షు డుత్తరదేశమును పాలించి హిందూ బౌద్ధమతముల రెండి టిని, సంస్కృతభాషనుగూడ విశేషముగ నభివృద్ధికి దెచ్చెను. ఈకాలమునం దేతెంచిన విదేశీయు లందరు నిచ్చటనే స్థిరపడి దేశీయులతో గలసి వారి మతాచార వ్యవహారముల నవలంబించి భారతదేశమునే దమ మాతృ భూమిగ జేసికొనిరి. అందుచే నీకాలమున హిందూదేశ మునకు విదేశపాలన దౌర్భాగ్యము లేకుండినది. మతా చారవ్యవహారముల సంఘర్షణమువలనను, మహాకవుల వాఙ్మయసేవనమువలనను, శాంతిసౌఖ్యము లెల్లెడలను ప్రబలుటచేతను జాతీయజీవితము నూతనోత్సాహముతో నూతనమార్గముల సాగుచుండెను. ఇప్పటి సాంఘిక జీవితము నిర్దుష్టముగ నుండినది. వర్ణభేదములు వైషమ్య కారకములుగ నుండక వృత్తిభేదమునే జూపుచుండె డిది. స్త్రీలలో బాల్యవివాహములు లేవు. వారిలో

వనేకులు విద్యావతులుగ నుండిరి. ఇప్పటికే హిందూమత తత్త్వము పరమగహనమగుటచే జనసామాన్యము యొక్క యుపయోగార్థమై విగ్రహారాధన మాచరణలోనికి వచ్చెను.

విద్యాచరిత్రము:— క్రీ. పూ. ౨౦౦ – క్రీ. శ. ౧౪౭ నడుమ హిందూవిజ్ఞాన మనేకవిధముల నభివృద్ధి నందినది. అదియంతయు విద్యలనియు, కళలనియు రెండుగ విభజింపబడెను. నాల్గువేదములు, షడంగములు, మీమాంస, న్యాయము, ధర్మశాస్త్రము, పురాణము, ఆయుర్వేదము, ధనుర్వేదము, గాంధర్వము, అర్థశాస్త్రము వనునవి అష్టాదశవిద్యలు. స్మృతి, నాస్తిక వాదము, కామశాస్త్రము, శిల్పము, అలంకారశాస్త్రము, కావ్యము, యవనసిద్ధాంతము, తంత్రము మున్నగునవి కళలు. కాళిదాసాది మహాకవు లీ విద్యలను, కళలను పేర్కొని యున్నారు. అప్పటి హిందువులు మహోన్నతమగు నాగరికత ననుభవించుచుంటిమని తలంచు నాధునికులకు సహిత మాశ్చర్యమును గల్గించు విశేషములను గన్గొని యుండిరి. ఆధునిక వైద్యవిజ్ఞానమునందలి Anatomy, Physiology అను భాగములు "ఆకృతి" యను పేరిటను, Theraputics, Medicine అనునవి "భేది" యను పేరిటను ప్రాచీన వైద్యశాస్త్రమున గాంచనగుచున్నవి. చరకుడు, సుశ్రుతుడు ననువార లీ శాస్త్రము నభివృద్ధిపరచిరి. మన ప్రాచీనులు ధ్వనులను స్వర (Voice), కాల (Time), స్థాన (Vocal position), ప్రయత్న (Muscular effort) ము లనువానినిబట్టి

విభజించి శబ్దశాస్త్రమును నిర్మించియుండిరి. సాంఘిక నైతికజీవితమును చక్కజేయుటకై ధర్మశాస్త్రము లాకాలమున నిర్మింపబడినవి. కాళిదాసభవభూత్యాది మహాకవులు నాటకముల నభివృద్ధిపరచిరి. ఇటీవల ల్యూడర్స్ అను పండితుడు కనిష్కునికాలమున రచింపబడిన రెండు నాటకములను గన్గొనినటుల దెలియుచున్నది. నాటకకళ యాకాలమున రాజాదరమును బడసెను. చరిత్రమును దెల్పుటకును, ప్రజాసామాన్యమునకు ప్రబోధమును గల్గించుటకునుగూడ నీ కళ యెక్కుడుగ నుపయోగించుచుండెడిది. (cf. మాళవికాగ్నిమిత్రము, ముద్రారాక్షసము etc.) ఇటుల విద్యలును, కళలు నేకాక ఈయుగమున పరిశ్రమలుగూడ విశేషముగ నభివృద్ధి జెందినవి.

హిందూవిజ్ఞాన మీవిధమున సర్వతోముఖాభివృద్ధిని బడయుటకు ప్రత్యేకపరిశ్రమ మొక ముఖ్యకారణము. ఒక్కొకచో నొక్కొకశాస్త్రమున గృషిసేయబడుచుండెడిది. ఇయ్యది సారస్వతమునగూడ గాంచనగును. ఉత్తరదిశ శ్లేషకావ్యములకును, పశ్చిమ మర్థగౌరవమునకును, దాక్షిణాత్యు లుత్ప్రేక్షకును, గౌడులు అక్షరడంబరమునకును ప్రసిద్ధులుగ నుండిరని దండిమహాకవి చెప్పియున్నాడు. ఉత్తరదేశమున వాఙ్మయమును, దక్షిణమున కావ్య, శిల్ప, చిత్రలేఖన, సంగీతములును వ్యాప్తి నందినవి. పల్లవమహేంద్రవర్మ శిల్పకళాపోషణము దక్షిణదేశమున బేరెన్నికగాంచినది. మొత్తముమీద నీకాలమున వైదుష్యము సర్వసామాన్య

ముగ నుండెను. సంగీతసాహిత్యకళావిహీనులు ద్విపాద పశువులని యీకాలపు కవి యొకడు వ్రాసియున్నాడు.

ఈకాలపు కవులయొక్కయు, వారి రచనముల యొక్కయు ప్రశంసలేనిదే యీకాలపు హిందూవిద్యావైదుష్యముల చరిత్రము సమగ్రము కానేరదు. ఇప్పటికవులలో కాళిదాసమహాకవి కగ్రస్థానము నొసంగవలసియున్నది. కవితా మాధురియందును, పదప్రయోగము నందును, ప్రకృతిసిద్ధములగు వర్ణనలయందును, భావనాశక్తికి నీతనికి సరియగు కవి నేటివరకు నీదేశమున బుట్టలేదు. ప్రపంచమునందలి కవికుంజరులలో నీతని కగ్రస్థానమొసగబడియున్నది. ఈతడు రచించిన కుమారసంభవ, మేఘదూత, రఘువంశాదికావ్యములును, శాకుంతల, మాళవికాగ్నిమిత్ర, విక్రమోర్వశీయ నాటకములును సంస్కృతసారస్వత ముండునంతకాలము నుండగలవు. కిరాతార్జునీయరచయితయగు భారవియును, దశకుమారచరితమును రచించిన దండియు, కాదంబరీహర్ష చరితములను నిర్మించిన బాణకవియునుగూడ నీకాలమునందే యుండిరి. నీతిబోధకములగు కథలలో నగ్రగణ్యమై యనేకభాషలలోనికి బరివర్తింపబడిన పంచతంత్రమును, హైందవసాంఘికనైతికజీవితములకు బట్టుకొమ్మయైనదగు మనుధర్మశాస్త్రము నీకాలపు రచనములే. సంస్కృతసారస్వతముతో బాటుగ జ్యోతిశ్శాస్త్రముగూడ నీకాలమున నభివృద్ధినందినది. ప్రఖ్యాతజ్యోతిషికులగు గర్గపరాశరు లీకాలముననే యుండిరి. క్రీ. శ. ౬-వ శతాబ్దినాటివాడగు వరాహమిహిరుడు తనకు బూర్వ మీదేశ

మున బ్రహ్మ, వైశ్య, సూర్య, వాసిష్ఠ, అత్రి, కాశ్యప, నారద, మరీచి, మను, ఆంగీరస, రోమక, పులిశ, చ్యవన, యవన, భృగు, శౌనకుల పేరిట వేరువేరు సిద్ధాంతము లుండినవని వ్రాసియున్నాడు. ఆతనికి బూర్వ ముండిన ఆర్యభటుడు మిగుల ప్రజ్ఞాశాలి. భూమియే సూర్యునిచుట్టును దిరుగుచుండుననియు, సూర్యచంద్ర గ్రహణములకు జంద్రుడును, భూచ్ఛాయయునే గారణములనియు నీతడు కనిపెట్టెను. వరాహమిహిరుని బృహత్సంహిత, పంచసిద్ధాంతము ఖ్యాతివహించిన జ్యోతిష గ్రంథములు. గణితశాస్త్రమునగూడ నీదేశమున విశేష పరిశ్రమ జరిగినది. బీజగణితమునను, ఖగోళశాస్త్రమునను, రేఖాగణితమునను దాని నుపయోగించువిధము నీదేశముననే గన్గొనబడినది. భారతవర్షము వైద్యశాస్త్రమున కాచార్యత్వమును వహించినది. వేదములలోగూడ దీని ప్రశంస గలదు. అథర్వవేదమునం దాయుర్వేదము శల్యతంత్ర, శాలాక్యతంత్ర, కాయచికిత్సా, భూతవిద్యా, కౌమారభృత్య, అగద, రసాయన, వాజీకరణములను నెనిమిదిభాగములుగ విభజింపబడినది. తరువాతి కాలమునం దగ్నివేశల, భేల, జతుకర్ణ, పరాశర, హారిత, క్షారపాణులనువారలు వైద్యగ్రంథములను రచించిరి. కుషాన్ చక్రవర్తియగు కనిష్కుని యాస్థానవైద్యుడుగ నుండిన చరకుడు తన పేరిట నొకసంహితను రచించెను. ఇందు వ్యాధులును, వానిని వారించు నౌషధక్రియలును వర్ణింపబడియున్నవి. పిమ్మట సుశ్రుతునిచే రచింపబడిన సుశ్రుతసంహిత వైద్యప్రపంచమున మిగుల ప్రఖ్యాతమగు గ్రంథము. శస్త్రచికిత్సను వివరించు

నీగ్రంథము శస్త్రసాధనములనుగూర్చియు, వాని యుప యోగమునుగూర్చియు విశేషాంశములను దెల్పుచున్నది. ఇంతవరకు నీబౌద్ధయుగమునందలి విద్వాంసులనుగూర్చి సంక్షేపముగ వ్రాసియుంటిమి. ఇంక ననేకు లాకాల మున జీవించియుండి యెన్నియో యుద్గ్రంథములను రచించిరి.

ఈ వైదుష్యప్రాదుర్భావమునకు విద్వాంసులు, రసజ్ఞులు నగు రాజు లొసంగిన యాదరణమే కార ణము. ఈకాలమున పుష్యమిత్ర, హాల, గౌతమీ పుత్ర, సముద్రగుప్త, చంద్రగుప్త, విక్రమాదిత్య, శ్రీ హర్ష, మహేంద్రవర్మాది విద్వద్రాజన్యులు విద్వాంసుల ననేకవిధముల గౌరవించి వారిచే ననేకగ్రంథములను వ్రాయించుచుండిరి. ఇట్టి విద్వత్సమ్మాన మానాటి రాజాస్థానములకు ముఖ్యకర్తవ్యముగ నుండెడిది. పండిత, కవి, గాయకులు రాజసభలకు ముఖ్యాంగము లుగ నుండెడివారు. పాండితీ ప్రదర్శనములును, శాస్త్ర వాదములును ఆకాలమునం దాయాస్థానములందు జరుగు చుండెడికార్యక్రమమున ముఖ్యభాగములుగ నుండెడివి. సర్వవిధముల నీ రాజాస్థానములు విద్యాస్థానములుగ నుండినవి.

విద్యాపీఠములు:—బౌద్ధయుగమునందలి హిందూ విద్యాచరిత్రమును ముగించుటకుబూర్వ మీకాలపు విద్యాపీఠములనుగూర్చి ప్రశంసించు టవసరము. ఈ కాలమునం దార్యావర్తమున బౌద్ధ విశ్వవిద్యాలయములు విఖ్యాతి నందుచుండ దక్షిణాపథమున ఘుటికలును,

ద్రవిడదేశమున సంగములును విద్యావ్యాపనము నొనర్చు చుండినవి.

ఘటికలు:—వీని ప్రశంస విశేషముగ దక్షిణాపథమునందలి శాసనములలో గన్పడుచున్నది. వేంగీనగరమునుండి యాంధ్రదేశమును బాలించిన తూర్పుచాళుక్యరాజగు మొదటిజయసింహవల్లభుని (క్రీ. శ. ౬౩౩–౬౬౬) కాలమునాటి నిడమఱ్ఱుశాసనమునుండి అసనపురమనుస్థలమున నొకఘటిక యుండెడిదనియు, నందు పై జయసింహునినుండి నిడమఱ్ఱుగ్రామమును దానముగ బొందిన కాటిశర్మతాతయగు మండశర్మ "ఘటికాసామాన్యుడు"గ నుండెననియు దెలియుచున్నది. దక్షిణమున కాంచీపురముగూడ నొకఘటికాస్థానముగ నుండెనని మరికొన్నిశాసనములనుండి తెలియుచున్నది. కదంబవంశనిర్మాతయగు మయూరశర్మ తానొక సుప్రసిద్ధతార్కికుడు గావలెనను నుద్దేశ్యముతో ననేకఘటికాస్థానముల కేగెనని యొక కదంబశాసనము దెల్పుచున్నది. కాంచీనగరమున రాజ్యముచేసిన రెండవనరసింహవర్మయను పల్లవరాజు కంచిలో నొక బ్రాహ్మణఘటికను నిర్మించెను. పై యాధారములనుండి యీఘటికాస్థానములు విద్యలకు, విద్వాంసులకు నాలవాలములై యుండెడివనియు, వీనిని రాజు లనేకవిధముల బోషించి ప్రోత్సహించుచుండిరనియు స్పష్టమగుచున్నది. ఈఘటికలలో జరిగెడి వాదప్రతివాదములలో జయమునందినవారికి "ఘటికాసాహసు" లను బిరుద మొసంగబడుచుండెడిదట.

సంగము:—'సంగము' అనునది 'సంఘ' మను సంస్కృతశబ్దమునకు ద్రవిడరూపము. ప్రాచీనకాలము నుండియు ద్రవిడదేశము ప్రత్యేకముగనుండి, యుత్తరాపథమునను, బిమ్మట దక్షిణాపథమునను జరగిన సాంఘిక, రాజకీయ పరిణామములతో సంబంధము లేకుండినది. ద్రవిడవాఙ్మయము ప్రత్యేకముగ నభివృద్ధి నందినది. భక్తులు, కవులు ననేకులు ద్రవిడమునం దుత్కృష్టములగు గ్రంథములను రచించిరి. ప్రాచీన ద్రవిడరాజవంశములలో పాండ్యవంశము మిగుల ముఖ్యమైనది. ఈవంశమువారికి మధుర ముఖ్యపట్టణము ఈరాజు లనేకులు విద్వాంసులుగను, విద్యాభిమానులుగను నుండిరి. వీరి ప్రోత్సాహముచే విద్వత్సంఘములు దేశమున బయల్వెడలినవి. ఇవియే సంగములు. ద్రవిడ వాఙ్మయమునుండి యిట్టివి మూడుసంగము లుండెడివని తెలియుచున్నది. ఇందు సుప్రసిద్ధులగు కవులు, నితర పండితులు సభ్యులుగ నుండిరి. ద్రవిడమున రచింపబడిన ప్రతికావ్యము నీసంగములయెదుట ప్రదర్శింపబడుచుండెడిది. అందలి విద్వాంసు లీగ్రంథములను విమర్శించి యవి నిర్దుష్టములుగ నుండినచో ప్రకటనార్హములుగ నిర్ణయించుచుండిరి. అంతియగాక కావ్యపురాణాదులను రచింపవలసిన పద్ధతులనుగూడ నీవిద్వత్సంఘములు సూచించుచుండెడివి. పెరియపురాణము, మణిమేఖలై మున్నగు సుప్రసిద్ధద్రవిడగ్రంథము లీసంగములచే ప్రవర్తింపబడినవే.

III. విశేషాంశములు

ఇంతవరకును హిందూబౌద్ధయుగములందలి హిందూవిద్యావిధానమును, విద్యాసంస్థలను వర్ణించియుంటిమి. ఇటుపై హిందూమతమునందును, తద్విద్యావిధానమునందును గల విద్యావిషయకవిశేషాంశములను బరిశీలింపవలసియున్నది. ఆధునికవిద్యాసంస్కర్తలుత్తమ విద్యావిధాననిర్మాణమునకై చేయు సూచనలనేకములు ప్రాచీనహిందువులకు దెలిసియుండినవి. ఈవిషయము హిందూమతమును, వర్ణవ్యవస్థను, ప్రాచీనబోధన నియమములను బరిశీలించినచో స్పష్టము కాగలదు:

హిందూమతము: — ఆధునికకాలమున బాఠశాలలో విద్యార్థులకు బోధింపబడు విషయమును నిర్ణయించునెడ వైజ్ఞానికయుగవాదము (Culture Epoch theory) అను నొకవాదము గలదు. మానవజాతి యారంభమునుండి నేటివరకు ననేకపరిణామములను గాంచెను. అటులే ప్రతిమానవుడును పుట్టినదాదిగ ననేకములగు ననుభవములను గాంచును. ఈ జాతీయపరిణామమునందలి యవస్థలకును, వైయక్తికపరిణామము నందలి యవస్థలకును సన్నిహితమగు సామ్యము గలదు. కాన విద్యార్థి యేయవస్థలో నుండునో బరిశీలించి, దాని కనుగుణమగు జాతీయావస్థను గుర్తించి యందలి యంశమునే బాలకునికి బోధింపవలెను అని యీవాదము యొక్క ముఖ్యోద్దేశ్యము. ప్రాచీనార్యులు ప్రతి మనుజునకును ఆధ్యాత్మికచింతనము, నాత్మతత్త్వజ్ఞానమునే జీవితాదర్శములని విధించియుండిరి. అవియే

మతమునకును, జాతికినిగూడ నాదర్శములు. ఈయా దర్శములను గ్రహించుటకై, మానవ జీవితమంతయు బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసములను నాలుగాశ్రమములుగ విభజింపబడెను. ప్రతివారు నీయాశ్రమములను క్రమముగ నతిక్రమించి యందం దొదవు ప్రత్యేకానుభవములను బొంది, జ్ఞానపరిపాకమును గాంచవలసియుండెను. పై వైజ్ఞానికయుగవాదమునకును, వర్ణాశ్రమవ్యవస్థకును సామ్యము స్పష్టమగుచున్నది.

ఇప్పటి మానసికతత్త్వశాస్త్రజ్ఞులు (Psychologists) మన కెల్లపుడును కర్మాచరణమునకై లోపలినుండి ప్రోద్బలము (Impulse) గలుగుచుండుననియు, నట్టి ప్రోద్బలముచే జేసిన ప్రతిపనియును స్వేచ్ఛాకృతములనియు జెప్పుచున్నారు. ఆధునిక విద్యాసంస్కర్తల యభిప్రాయము ననుసరించి విద్యార్థి స్వప్రవృత్తిమూలముననే (Self activity) విషయములను గ్రహింపవలె నని వాదించుచున్నారు. ప్రాచీనహిందువులు వీనికి సరియగు నియమములనే యేర్పరచియుండిరి. యుక్తాయుక్తములను విచారించి స్వప్రవృత్తిని నియమించుకొని ప్రతివారును స్వయంకృషిమూలముననే తత్త్వమును దెలియవలెనని వారి యభిప్రాయము.

మానవునకు తననుదాను బూర్తిగ దెలిసికొని సిద్ధత్వము (Perfection) నందుటయె జీవిత పరమావధియనియు, మానవప్రవృత్తియంతయు నీవిషయమునే సాధింపవలెననియు, నందుచే జీవితలక్ష్యైక్యము

(Unity of Life) గలదనియు సాధునికులు జెప్పు చున్నారు. ఈవిషయమునే ప్రాచీన హిందువు లాశ్రమ విభజనచే సాధించిరి. ధర్మార్థకామమోక్షములు నాలుగు పురుషార్థములు. బ్రహ్మచర్యాశ్రమమున ధర్మమును, గార్హస్థ్యమునం దర్థకామములును, వానప్రస్థ సన్న్యాశ్రమములలో మోక్షమును సాధ్యములు. మొదటినుండి తుదివరకును మోక్షమే పరమపురుషార్థము; ఇతరములు తత్సాధనములు.

ప్రకృత మానసిక తత్త్వశాస్త్రజ్ఞులు వైయక్తిక పరిణామమున కేవలమును బ్రకృతియేకాక వాతావరణముగూడ విశేషముగ దోడ్పడునని చెప్పుచున్నారు. ఈ విషయమును హిందువు లనేకశతాబ్దములకు బూర్వమే గ్రహించిరి. వినయవిధేయతలను పెంపొందించి, కేంద్రీకృత మనఃప్రవృత్తి కనుకూలములై, యుత్తమాదర్శ సన్నిబద్ధములై, జిజ్ఞాసావృత్తి కనుకూలములగు వాతావరణములు ముఖ్యము లను విషయమును గ్రహించియే మన ప్రాచీనులు గురుకులములను నిర్మించిరి. అనుకూలవాతావరణమునకు దోడుగ నిచ్చట విద్యార్థుల కాచార్యుని యాదర్శవిశేషముగూడ లభించుచుండెడిది. ఆధునిక విద్యాప్రపంచమున విద్యార్థుల వసతిగృహములను నిర్మింపవలెననియు, గురుశిష్యులు గలసియుండవలెననియు, విద్యార్థుల నైతిక సంపద నభివృద్ధిచేయుట విద్యావిధానమునకు ముఖ్యావధియనియు జేయబడు సిద్ధాంతములన్నియు ప్రాచీన గురుకులపద్ధతిలో నిమిడియున్నవి.

నిర్బంధ విద్యాభ్యాసము, ఉచిత విద్య (Free and Compulsory Education) యనునవి యీకాలపు సంస్కరణములలో నగ్రస్థానము వహించుచున్నవి. ప్రాచీనభారత దేశమున ప్రతివారును స్వకులోచితమగు విద్య నభ్యసింపవలసియుండెడిది. లేనిచో వాని కాకులమున తావు లేకుండెడిది. ఆకాలమునందాచార్యులెల్లరు నుచితముగనే విద్యను నేర్పుచుండిరి. స్వాధ్యాయమువలెనే ప్రవచనముగూడ బ్రతివారికిని విధియైయుండెడిది. ఆధునికులు ప్రబలాందోళన ఫలితముగ చట్టమూలమున జేయ యత్నించు నీకార్యమును మన ప్రాచీనులు సులభముగనే తమ మతసాంఘిక నియమముల మూలమున సాధించియుండిరి.

వర్ణవిభజనము:—హిందూమత నియమములకు బిమ్మట జర్చింపవలసినది వర్ణవిభజనమునందలి విద్యావిషయక విశేషములు. ప్రాచీనార్యులు సట్లెజ్ నదీతీరమునం దుండినపుడు వారిలో సాంఘిక విభాగములు లేకుండినవి. ఎవరికి నేపనిజేయుటకును విధినిషేధములు లేకుండెడివి. క్రమముగ నార్యభూమియు, దన్మతమునుగూడ నభివృద్ధినందినవి. యజ్ఞయాగాదులును, దత్సంబంధమగు కర్మకాండయు బెరుగుటచే గొందరు బ్రత్యేకముగ నీవిషయమున గృషిసలుపవలసి వచ్చెను. అటులనే యార్యులు గంగామైదానము నాక్రమించి రాజ్యముల నేర్పరచుకొనినపిమ్మట రాష్ట్రరక్షణమును, కృషివాణిజ్యములు నవసరములుగాజొచ్చినవి. మతమునందువలెనే యీ యైహిక విషయములందుగూడ

ప్రత్యేక పరిశ్రమ మావశ్యకమయ్యెను. కాన జనులు తమ ప్రకృతుల ననుసరించియు, దమ యర్హత ననుసరించియు నీప్రత్యేకకార్యములందు ప్రవర్తించుచుండిరి. ఇటుల వీరు వేరవు కర్మలు వేరుగ నుండినవి. ఈగుణకర్మలపైననే వర్ణవిభజన మేర్పడినది. అయిన నీ కర్మవిభాగములు చాలకాలమువరకును వృత్తివిభాగములుగనేయుండినవి. వానిమూలమున సాంఘికవిభాగము లేర్పడియుండలేదు. ఈ కర్మలను బరిగ్రహించునెడ జన్మమేవిధమగు యోగ్యతానర్హతలను దెచ్చిపెట్టియుండలేదు. జనకుడు, జాబాలి మున్నగు క్షత్రియులు బ్రహ్మజ్ఞానసంపన్నులుగ నుండిరి. క్షత్రియకులసంజాతుడగు విశ్వామిత్రుడు మహర్షి యయ్యెను. పంచముడగు వాల్మీకి కవిబ్రహ్మ యయ్యెను. శీలము, మనస్సంయమము, వైదుష్యము ననునవియే యుత్తమవర్ణులకు గావలసిన లక్షణములు. ఆధునికులుగూడ ప్రతివాని ప్రకృతియు నాతని జన్మసమయముననే స్థిరపరుపబడునని, పిమ్మట నాతడు స్వయంకృషిమూలమునను, ఇతరులు, వాతావరణమునొసంగు శిక్షణ మూలమునను దనకు బ్రకృతిసిద్ధములగు లక్షణములనే యభివృద్ధిపరచుకొనునని నిరూపించియున్నారు. ఆధునికవిద్యావిధానమున విద్యార్థియొక్క పారంపర్యము (Heredity) న కెక్కువ ప్రాముఖ్యమొసంగబడుచున్నది. మన ప్రాచీన వర్ణవిభజనముగూడ నీసిద్ధాంతముపైననే నిర్మింపబడినది. ప్రతివానికిని బ్రకృతి యొకవిధముగా బ్రవర్తనమును, వృత్తిని, అర్హతను (Fitness and aptitude) ఏర్పరచుననియు, నాతడట్టి వృత్తినే యవలంబింపవలయుననియు నభిప్రాయ

పడియుండిరి. మనస్సంయమమును, ఆధ్యాత్మికచింతనమును సహజగుణములుగ నుండువారలెల్ల నగ్రవర్ణమున కర్తలుగ నుండిరి. దేహబలమును, ధైర్యసాహసములును సహజముగ నుండినవారెల్ల క్షత్రియులుగ నెంచబడిరి. అటులనే యాముష్మికసాధనములగు కృషి, వాణిజ్యము మున్నగువానియందు బ్రకృతిసిద్ధమగు నభిరుచిగలవార లితరవర్ణములకర్తలుగ నెంచబడిరి. ఇట్టిచో నెల్లరును దమ యిచ్ఛాప్రకృతుల ననుసరించి ప్రత్యేకవృత్తుల ననుసరించుచుండిరి. కొంతకాలమునకు పారంపర్యముగ దండ్రి నుండి కొడుకులకు సంక్రమించుటచే నీవృత్తులు ప్రత్యేకత నందినవి. క్రమముగ నీవృత్తి విభాగము లనుల్లంఘనీయములగు సాంఘికవిభాగములుగ బరిణమించినవి. ప్రతివర్ణము నారోజులలో సాంఘిక జీవితమునందలి యొక్కొక యంశమును జూపుచుండెను. కాన బ్రతివ్యక్తియు నత్యవసరమగు సాంఘికాంగముగ నుండెను. ఆకాలమునం దాత్మవికాసమును, సంఘసేవయు నత్యుత్తమాదర్శములుగ బరిగణింపబడుచుండెడివి. ఇటుల వివిధవృత్తుల కాలవాలములగు వివిధవాతావరణములలో బుట్టి పెరిగిన విద్యార్థులకు వారివారి యోగ్యతావశ్యకతల ననుసరించియే శిక్షణ మొసంగబడుచుండెడిది. ఇట్టివిద్యను నేర్చినపిమ్మట స్వప్రకృతి కనుకూలమగు వాతావరణమునందుండి ప్రతివ్యక్తియు నాత్మసిద్ధిని బడసి సంఘసేవను జేయుట సుకరముగ నుండెడిది. ఆధునికులు సహితము విద్య సాంఘికమనియు, నిర్దుష్టమగు సాంఘికజీవితమును గడపగల వ్యక్తులను నిర్మిం

చుటయే విద్యావిధానమునకు బరమావధియనియు జెప్పు చున్నారు. ఈయాదర్శము లన్నియు బ్రాచీన హిందూ వర్ణవ్యవస్థలో గాంచనగుచున్నవి.

బోధనవిధి:—ప్రాచీన హిందూయుగమునందలి పఠనబోధనవిధులనుగూర్చి కొన్ని విశేషాంశములు దెలియుచున్నవి. ఆధునికవిద్యాతత్త్వజ్ఞులు "తెలిసిన విషయములద్వారా తెలియనివానిని జెప్పవలెను. సులభ విషయములనుండి క్లిష్టవిషయములను సాధింపవలెను; ప్రత్యక్షమునుండి యనుమానమునకు బోవలెను." అను సూత్రములను బోధనసందర్భమున ప్రతిపాదించి యున్నారు. మన ప్రాచీను లీసూత్రములను గ్రహించియే యుండిరి. దృశ్యమానప్రపంచమునందలి పదార్థములను వివరించి వాని లక్షణములను దెల్పు శాస్త్రములును, మానవీయము లగు నితరకళలునుగూడ బారమార్థికములు గనే యుండినవి. సుజ్ఞేయములును, సులభములును, బ్రత్యక్షములును నగు విషయములమూలమున బ్రాచీన భారతీయవైదుష్యమంతయు గుహ్యమును, పరోక్ష సాధ్యమును, పరమార్థమును నగు బ్రహ్మపదార్థమునే జేర్చునదిగ నుండినది.

శాస్త్రనిర్మాణమున బ్రాచీనులు Inductive method నే యనుగమించిరి: పదార్థతత్త్వమును సవిమర్శముగ వివరించి శాస్త్రకారులు సిద్ధాంతములను సాధకునికే వదలియుండిరి. దానజేసి బుద్ధివిశేషమును, దార్కికశక్తిని ఉపయోగించి ప్రతివారును దమకు దోచినరీతిని సిద్ధాంతముల నేర్పరచుకొనుట కవకాశ

మేర్పడెను. ఇట్లు మతాంతరములు, పక్షాంతరములు నేర్పడి విజ్ఞాన మభివృద్ధినందుటకును, వ్యక్తుల కిచ్ఛాస్వాతంత్ర్య మొదవుటకును అవకాశ మేర్పడెను.

పూర్వము పరిశోధనకును, విమర్శనమునకును నెక్కుడు ప్రాముఖ్య మొసంగబడుచుండెడిని. అనేకులు తమ పూర్వు లొనర్చిన సిద్ధాంతములను విమర్శించి నూతనసిద్ధాంతములను జేసి, వాదప్రతివాదములమూలమున వానిని బలపరచుకొని ప్రచారము చేయుచుండిరి.

* * *

రెండవ అధ్యాయము

[ఆధారములు

Dutt-Civilisation in the Buddhistic Age
Rhys Davids-Buddhist India
Samaddar-The Glories of Magadha
Satyanarayana-Bauddha Mahayugamu
NarayanaRao- Pracheena Vidya-
Pithamulu]

బౌద్ధవిద్య

ప్రాచీనకాలమునుండి క్రీ. శ. ౬౪౭. వరకును ప్రబలియుండిన హిందూవిద్యాచరిత్రము నింతవరకు వర్ణించియుంటిమి. క్రీ. పూ. ౨౦౦ నుండి క్రీ. శ. ౬౪౭ వరకును గలకాలమున హిందూబౌద్ధమతములు

రెండును భారతదేశమున వ్యాపించినవి. ఈ కాలమున బౌద్ధమత మనేకవిధముల అపరప్రోత్సాహములనంది సర్వతోముఖముగ విజృంభించి ఖండాంతరములకును దేశాంతరములకునుగూడ వ్యాపించినది. బౌద్ధులు తమ మతాచారముల ననుసరించి ప్రత్యేకవిద్యావిధానమును, విద్యాసంస్థలను నిర్మించిరి. ఈకాలపు రాజకీయాది పరిస్థితులను బూర్వప్రకరణమున వివరించియుంటిమి. బౌద్ధయుగమునందలి బౌద్ధవిద్యాచరిత్రము నభివర్ణించుటకు బూర్వము బౌద్ధసిద్ధాంతములను, బౌద్ధమతచరిత్రమును, బౌద్ధహిందూమతములకు గల పరస్పరసంబంధమును సంగ్రహముగ బరిశీలింపవలసియున్నది.

I. బౌద్ధమతము

క్రీ. పూ. ౬-వ శతాబ్దినాటికి వైదిక మతిబహుళమై, కష్టసాధ్యముగ నుండెను. వాఙ్మయమును, తత్త్వమునుగూడ కేవలపాండితీసాధ్యములై, ప్రజాసామాన్యమునకు దురవగాహములును, నిరర్థకములును నైనవి. అందుచే పామరులకు దైనందినజీవితమునం దత్యవసరమగు నాధ్యాత్మికచోదనము గరవయ్యెను. అట్టిసమయమునం దిర్వురు క్షత్రియవీరులు బయల్వెడలి యీ సమస్య నెదుర్కొనిరి. వీరే వర్ధమాన గౌతములు. విశేష కష్టములేకనే ప్రజాసామాన్యము పాపభీతియు, సౌహార్దము నలవడజేసికొని శాంతియుతజీవితములను సాగించునటు లొనర్చుటయే యీసంస్కర్తల ముఖ్యోద్దేశ్యము. గౌతము డనేకదేశముల దిరిగి ప్రజాతత్త్వమును గ్రహించియు, సుదీర్ఘకాలము చింతనజేసియు నొక నూతన

భాషలలోనే చేయుటచే నామతవాఙ్మయ మాయా భాషలలో నిర్మింపబడినది.

3. బౌద్ధులు వేదముల ప్రామాణ్యము నంగీకరింపరు.

४. స్త్రీపురుషులకు సమానములగు నధికార గౌరవములు గలవు.

౫. భిక్షుభిక్షుణీజనముల కేకాంతవాస మవసర మగుటచే వీరలకై యనేకములగు నారామవిహారములు నిర్మింపబడుచుండెడివి.

౬. ప్రతివారికి నెనిమిదవయేట 'పబ్బజ్జ' యను సంస్కారపూర్వకమగు మతప్రవేశమును, యిరువదవ యేట 'ఉపసంపద' యను మతదీక్షయు నొసంగబడు చుండెడివి.

౭. బౌద్ధు లెల్లరును సౌశీల్య, నిస్సంపత్త్వ (Poverty), ఆత్మసంయమములను, గలిగియుండవలెను.

౮. భిక్షువులు భిక్షాటనమూలమున నాహారమును సంపాదింపవలెను.

౯. పాపకార్యముల నొనర్చినవారలు బహిరంగముగ వానిని దెలిపి నిజమగు పశ్చాత్తాపము నందుటచే బరిశుద్ధు లగుదురను సిద్ధాంతము బౌద్ధులలో నుండెడిది.

ఇటులు క్రీ. పూ. ౫-వ శతాబ్దమున గౌతమునిచే బ్రవర్తింపబడిన యీ నూతన మతమునకును, ప్రాచీనవైదికమతమునకును అనేకసాదృశ్యవైదృశ్యము లుండినవి. బౌద్ధమతము కేవలము విలక్షణమగు నూతన

తత్త్వమును గన్గొని యెల్లరకును బోధింపసాగెను. అందలి ముఖ్యాంశము లీక్రింద పేర్కొనబడియున్నవి:

౧. దృశ్యమానమగు నీప్రపంచము నశ్వరము.

౨. మానవజన్మము సుఖాపేక్షియై యనేక దుఃఖముల ననుభవించును.

౩. తృష్ణయే సర్వదుఃఖములకును గారణము. దీనివలననే దుష్కార్యప్రవృత్తి గల్గును.

౪. కాన వాంఛలను తెగటార్పవలయును.

౫. నిర్వాణమే పరమపురుషార్థము. దానిని జెందుటకు భూతదయ, సౌభ్రాత్రము, సర్వసమభావము, వినయము, నిరాశ మున్నగునవి సాధనములు.

ఈ సిద్ధాంతములు సర్వజనాకర్షకములుగ నుండుటచే శీఘ్రముగ ననేకు లీబౌద్ధమతము నవలంబింపజొచ్చిరి. ఇట్టివారిలో రెండుతరగతు లేర్పడినవి. సర్వసంగపరిత్యాగ మొనర్చి సన్న్యాసులై సదా యాధ్యాత్మికచింతన మొనర్చువారలు గొందరు. వీరిలో స్త్రీలును, బురుషులునుగూడ నుండిరి. అటుగాక మరి కొందరు గృహస్థులైయుండియు బౌద్ధధర్మము నవలంబించుచుండిరి. వీర లుపాసకులని పిలువబడుచుండిరి. అనతికాన ముననే బుద్ధ, ధర్మ, సంఘ-యనునవి బౌద్ధులకు ముఖ్యాదర్శములుగ నొప్పినవి. ఈమతమున మరికొన్ని విశేషాంశము లుండినవి:—

౧. ఇందు జాతివర్ణభేదములు లేవు.

౨. పండితసాధ్యమగు గీర్వాణభాషను వదలి బుద్ధుడు,నాతనియనుచరులును దమమతబోధనలను దేశీయ

మతము గాదనియు, నందలి సిద్ధాంతములు, నాచార ములు ననేకముగ వైదికమతముపై నాధారపడియున్న వనియు బండితుల యభిప్రాయము. పూర్వజన్మకృత కర్మవలననే సుఖదుఃఖానుభవము గల్గుచుండుననియు, జన్మబాహుళ్యము, తృష్ణావిషయేచ్ఛలే సర్వదుఃఖమూల ములనియు, నిస్సంగమగు సన్న్యాసమే మోక్షసాధన మనియు, వాసనారాహిత్యమే ముక్తిలక్షణ మనియు నీరెండుమతములును జెప్పుచున్నవి. వర్ణభేదమును, యజ్ఞయాగాదిరాహిత్యమును దప్ప హిందూబౌద్ధ గృహస్థధర్మములకు భేద మేమియు లేదు. అయిన నీరెండుమతములకు నొక ముఖ్యవైషమ్యము గలదు. వైదికమతమంతయు పరబ్రహ్మపదార్థ నిరూపకమై యుండ బౌద్ధధర్మ మనాత్మవాదకముగ నున్నది. పర మాత్మపదార్థము కేవలము మిథ్యయని బౌద్ధుల సిద్ధాంతము.

బుద్ధునికి బిమ్మట వైదిక బౌద్ధ మతములకు విశేష ముగ సంపర్క సంఘర్షణములు జరగుటచే నీ రెండు మతములందునుగూడ గొన్ని మార్పులు జరగినవి. మొదట బౌద్ధగ్రంథములన్నియు పాళీభాషలోనే నిర్మింపబడి యుండినను, దమ సిద్ధాంతములు వైదికపండితులకు సుగమములుగ నుండుటకై బుద్ధుని తరువాతివారలు తమ గ్రంథములను సంస్కృతములోనికి బరివర్తించిరి. వర్షా కాలమున సంచారమును మానివేయుట, చాతుర్మాస్య దీక్ష నవలంబించుట, అనధ్యాయదినములను బాటించుట మున్నగు వైదికాచారములను బౌద్ధు లనుకరించిరి. మహాయానశాఖకు జెందిన బౌద్ధుల గ్రంథము లనేక

ములు హిందూపురాణముల కనుకరణములే. వారి యవలోకితేశ్వరచరిత్రము విష్ణుభాగవతపురాణములను సూచించును. హిందువులు బౌద్ధసిద్ధాంతములను, బౌద్ధులు వైదికసిద్ధాంతములను బఠించుచుండిరి. కాలక్రమమున హిందూమతము బుద్ధుని యొకయవతారముగ బరిగణించి బౌద్ధధర్మమును దనలో నిముడ్చుకొనియెను. వాస్తవముగ వైదికమతమునందలి యాధ్యాత్మికాదర్శములను సాధించుటకు బౌద్ధమతమునందలి నైతికసాంఘిక విధులు లౌపచారికములుగ నుండుటచే నీ రెండుమతములకును తీవ్రమగు వైషమ్యము లేకుండినది. దానజేసియే యీ రెండుమతములు నేకకాలమున మహోచ్ఛదశ ననుభవింపగల్గినవి. వీనికి గల సన్నిహితసామ్యమే కడకు బౌద్ధమతము హిందూమతమున గలసి జన్మస్థానమగు నీ దేశము రూపుమాయుటకు గారణము.

ఇంతవరకును బౌద్ధమతతత్త్వమును నిర్ణయించి యుంటిమి. క్రీ. శ. ౬౪౭ వరకును గల యామతచరిత్రమునుగూడ సంగ్రహముగ బరిశీలించినచో దాత్కాలిక విద్యాచరిత్రము సుగ్రాహ్యము గాగలదు. గౌతమ బుద్ధుని యనంతర మాతనిశిష్యు లీనూతనమతము ననేక విధముల వ్యాపింపజేసిరి. బుద్ధుడు నిర్వాణమునందిన సంవత్సరముననే బౌద్ధసమావేశ మొకటి గావింపబడెను. ఇందు బౌద్ధులందరును జేరి గౌతముని బోధనలను గూడ బల్కికొనిరి. పిమ్మట మరియొక శతాబ్దమున కింకొక పరిషత్సభ సమావేశమయ్యెను. ఇప్పటికే బౌద్ధులలో నభిప్రాయభేదములు ప్రబలినవి. వీనిని సరిచేయుటకే యీపరిషత్సభ యత్నించెను. కాని బౌద్ధులందరును

రెండుశాఖలుగ జీలిపోయి నేపాళ, త్రివిష్టప (Tibet), జపాను దేశములలోనివా రుత్తరబౌద్ధులనియు, సయాం, సింహళ, బ్రహ్మదేశములందలివారలు దక్షిణబౌద్ధులనియు పిలువబడుచుండిరి. క్రీ. పూ. 3-వ శతాబ్దమునం దశోక చక్రవర్తి యిటులు క్షీణించుచున్న బౌద్ధమతమునకు జేయూత నొసగెను. ఈతడీమతమున కమూల్యము, నిరుపమము నగు సేవను జేసియుండెను. బౌద్ధధర్మములను శిలాస్తంభములపై వ్రాయించి తనరాజ్యమునందలి వివిధ భాగముల బ్రతిష్ఠించియు, ననేకులగు మతప్రచారకులను దూరదేశములకు సహితము పంపియు నీచక్రవర్తి యనేక విధముల బౌద్ధమతమును వ్యాపింపజేసెను. అంతియగాక నీతడు స్వయముగ మతదీక్షను గొని, యప్పటికే బౌద్ధ మతమునగల వైషమ్యములను సరిచేయుటకై తృతీయ బౌద్ధపరిషత్సమావేశమును గావించెను. ఈసభకుఫలిత ముగనే యశోకునికుమారుడగు మహేంద్రు డనునాతడు సింహళద్వీపమునకు బోయి యచ్చట త్రిపిటకమును వ్యాపింప జేయుటయును, వేనవేలుగ బౌద్ధభిక్షువులు సింహళ, బ్రహ్మ, శ్యామ, త్రివిష్టపాదిదూరదేశముల కేగి బౌద్ధధర్మమును బ్రచారము చేయుటయును జరిగినది. క్రీ. పూ. ౨-వ శతాబ్దమునందు మౌర్యవంశ మంత రించినపిమ్మట శుంగవంశజులు మగధరాజ్యము నాక్ర మించిరి. వీరు వైదికమతావలంబులై యజ్ఞయాగాది కముల నొనర్చి బ్రాహ్మణమతము నభివృద్ధిపరచిరి. కాన దాత్కాలికముగ బౌద్ధమతమునకు గొంచె మొత్తిడి గల్గెను. దక్షిణాపథమున బ్రబలిన శాతవాహనాంధ్రులు బౌద్ధమతము ననేకవిధముల నాదరించి దేశమును విహారా

రామశోభితముగ నొనర్చిరి. ఈకాలమున భారత భూమిపై దండెత్తివచ్చిన విదేశీయు లనేకులు బౌద్ధ మతము నవలంబించిరి. క్రీ. శ. ౧-వ శతాబ్దమున దిరిగ బౌద్ధమతమునకు మంచిదినములు గల్గినవి. అప్పటికి కుషాను లుత్తరదేశము నాక్రమించి పాలించుచుండిరి. వారిలో నగ్రగణ్యుడగు కనిష్కచక్రవర్తి యశో కునివలెనే బౌద్ధమతము ననేకవిధముల నాద రించెను. స్వబాహుబలముచే మధ్య ఆసియా నంత టిని జయించి యీతడు బౌద్ధధర్మము నచట ప్రచారము చేయించెను. ఈతనికాలముననే బౌద్ధమత మున మహాయానశాఖ ప్రబలినది. హీనయానమని పేర్కొనబడు పూర్వబౌద్ధమతమునం దీకాలమున నాగా ర్జునుడను భిక్షువు విశేషములగు మార్పులను జేసెను. మహా యానమున వైదికమత సంప్రదాయము లెన్నియో చొప్పింపబడినవి. బుద్ధు డొకయవతారముగను, దైవము గను బరిగణింపబడి యాతని యారాధనము, నుత్సవములు గల్పింపబడినవి. బౌద్ధధర్మము భక్తిరసప్రధానము గాజొచ్చెను. మరియును గనిష్కుడు కుండలివనమున జతుర్థబౌద్ధపరిషత్సభను సమావేశపరచెను. అప్పుడు వసుబంధువనుభిక్షు వగ్రస్థానము నలంకరించెను. అటులు సమావేశమైన పండితు లందరును జేరి బౌద్ధసారస్వత మును దరచి భాష్యములను వ్రాసిరి. ఈసభకుఫలితముగ నుత్తర-ఆసియాప్రాంతములందెల్ల మహాయానమతము వ్యాపించినది. కనిష్కు డనేకవిహారములను, సౌధము లను నిర్మించెను. ఆతనికి బిమ్మట బౌద్ధమతమునకు దుర్దినము లేతెంచినవి. ఇందలి మహాయానమతము వైదిక

మతమును సర్వవిధముల బోలియుండుటచేతను, బౌద్ధ సంఘమున దురాచారములు ప్రబలుటచేతను, బౌద్ధ మతము రూపుమాయదొడగెను. వీనికన్నను ముఖ్యమగు కారణము గుప్తవంశీయులకాలమున జరిగిన వైదికమత పునరుద్ధరణము. కుషానులకు బిమ్మట గుప్తవంశీయులు మగధరాజ్యము నాక్రమించిరి. వీరలు వైదికధర్మ నిరతులై తన్మతము ననేకవిధముల బోషించిరి. ఇతిహాసపురాణాదికము లొకవంక గ్రంథస్థములగుచుండ, కాళిదాసాదిమహాకవు లింకొకవంక గీర్వాణభాషా యోషకు నూతనాలంకారములను సమకూర్చుచుండ, హిందూ దేవాయతనము లింకొకవంక వేనవేలుగ నిర్మింపబడుచుండ, నిరుపమ తేజోవంతమై వెలుగొందు చుండిన హిందూదీపికలో బౌద్ధధర్మము లీనమైపోయి నది. దక్షిణాపథమునగూడ నీవైదికమతవిజృంభణ మీకాలమున గాంచనగుచున్నది. గుప్తచక్రవర్తుల యనంతరము శ్రీహర్షునికాలమున బౌద్ధమతము కడసారి యొక వెలుగు వెలిగినది. ఈచక్రవర్తికాలమున బౌద్ధబ్రాహ్మణ మతములు రెండును బ్రబలినవి. స్వయముగ నీతడు బుద్ధ భక్తుడై బౌద్ధుల ననేకవిధముల సత్కరించెను. సర్వ మతముల నీతడు సమానముగ జూచెను. ఈతడుగూడ నొకబౌద్ధపరిషత్సభను సమావేశపరచి మతవైషమ్య ములను జక్కబరుప యత్నించెను. మహావైభవముతో జరగిన యీసభలో తుదకు మహాయానమతమే సర్వో త్కృష్టమని నిశ్చయింపబడినది. చక్రవర్తి తనసర్వస్వ మును బౌద్ధభిక్షువులకు, నితరమతప్రవర్తకులకును ధార వోసెను. శ్రీహర్షునియనంతర ముత్తరాపథము నంతటి

నేలిన ఘనుడు లేకుండెను. దానజేసి బౌద్ధధర్మము నిరాలంబమయ్యెను. పిమ్మట మగధరాజ్యము నేలిన కడపటి గుప్తవంశీయులు కొంతవరకును బౌద్ధుల నాదరించిరి. వీరిచరిత్రము నాలందావిక్రమశిలావిశ్వవిద్యాలయముల చరిత్రమున చెప్పఁబడును.

II. విద్యావిధానము

ఇంతవరకును బౌద్ధమతసిద్ధాంతములను చెప్పి యామతచరిత్రమును సూచించియుంటిమి. ఇటుపై బౌద్ధవిద్యావిధానమును వర్ణింపవలసియున్నది. బౌద్ధవాఙ్మయమంతయు సూత్ర, గేయ, నిదాన, వ్యాకరణ, గాథా, అవదాన, వదాన, ఇత్యుక్త, ఉపదేశ, జాతక, అద్భుత, ధర్మ, వైపుల్యయను విభాగములకు లోనైయుండెను. ఈవాఙ్మయమును, మతధర్మమును బ్రచారముచేయుటకై యొక ప్రత్యేకవిధానము నిర్మింపబడెను. విద్యాపోషణము రాజులకు ముఖ్యకర్తవ్యమై యుండెను. వారలు, గురుశిష్యులు నిశ్చలమనస్కులై విద్యావ్యాసంగము చేయుట కనువగు ప్రశాంతస్థలములలో ననేకములగు నారామవిహారములను నిర్మించి వానికి భూములను, ద్రవ్యమును దానము చేయుచుండిరి. కడపటి గుప్తపాలకులగు శక్రాదిత్య, బాలాదిత్యాదులు నాలందావిశ్వవిద్యాలయమునం దెన్నియో కట్టడములను గట్టించిరి. విద్యాభ్యాసము పూర్తియైనపిదప ననేకులు రాజాస్థానముల కేగి యున్నతోద్యోగములను బడయుచుండిరి. పదిసంవత్సరములు భిక్షువులై యుండి నిష్కళంకచరిత్రులగువార లుపాధ్యాయులుగ నుండిరి. విద్యార్థికి

త్రిపిటకాంతమువరకును విద్యను నేర్పి, యాతని ప్రవర్తనమును నీతిమార్గమున జొప్పించి, యాతని దనపుత్రునివలె ప్రేమించు టాకాలపు గురువులకు విధియైయుండెను. శిష్యులుగూడ గురువునెడ పుత్రునివలె ప్రవర్తించి, భిక్షాటనమునం దాతని ననుసరించి యాతనికి సపర్యలొనర్చుచు, విద్యలుపూర్తియగువరకు నాతనివద్దనే యుండవలసియుండెను. ఈవిద్యావిధానమునందలి శిక్షణముగూడ కఠినముగనే యుండెను. ఉల్లిపాయ, మద్యము మున్నగు తామసపదార్థములు నిషేధింపబడినవి. దేహమునం దస్వాస్థ్య మొదవినచో నుపవాసము విధింపబడెను. సాయంకాలమున గురుశిష్యులు కొంత దూరము నడచి దేహపరిశ్రమ మొనర్పవలసియుండెను.

ఈత్ సింగ్, హ్యూయాన్ ష్వాంగ్ అనుచైనాదేశ యాత్రికులవ్రాతలవలన బౌద్ధవిద్యాప్రణాళికను గూర్చి విశేషాంశములు దెలియుచున్నవి. సాధారణముగ బాలుర కారవయేట నక్షరాభ్యాసము చేయబడుచుండెడిది. వా రక్షరములను, చిన్నచిన్న మాటలను నేర్చుట కొక సంవత్సరము పట్టెడిది. ఎనిమిదవయేట వారు "సిద్ధా" యను గద్యపఠనమును జేయుచుండిరి. అటుపై "సిద్ధాంత" మను పండ్రెండుప్రకరణములుగల వ్యాకరణము వారికి బోధింపబడుచుండెడిది. ఈవిధానము మన ప్రకృత ప్రారంభవిద్యాప్రణాళికకు సరియగుచున్నది. ఇటుపై నభిరుచి ననుసరించి బాలురు కళలు, పరిశ్రమలు, వైద్యము, తర్కము మున్నగువానిలో ప్రత్యేక కృషి నొనర్చుచుండిరి. ఇయ్యది ప్రస్తుతవృత్తివిద్యకు సరి

యగును. అటుగాక ఇంకను విద్యాభ్యాసమును సాగింపఁ దలఁచువారు పాణినీయ సూత్రములను, ధాతుపాఠమును, ఖిలప్రకరణములను, వృత్తిసూత్రములను బఠించి, యిరువదవసంవత్సరమున విద్యాభ్యాసమును బూర్తిచేయుచుండిరి. ఇంకను విశేషప్రజ్ఞ నార్జింపదలచినవారలకు గూడ నొకప్రత్యేక ప్రణాళిక యేర్పరుపబడెను. గద్యపద్యరచనము, హేతువిద్య, అభిధర్మకోశము, న్యాయద్వారా తర్కశాస్త్రము, పాతంజలి మహాభాష్యము, భర్తృహరిసూత్రము, వాక్యవృత్తి, పెయినము, వినయపిటకము మున్నగు విషయము లిందలిభాగములు.

బౌద్ధవిద్యావిధానమునందలి బోధనవిధులలో గూడ గొంతప్రత్యేకత గాంచనగుచున్నది. బ్రాహ్మణ విద్యార్థులవలెనే బౌద్ధబాలురుగూడ ప్రాయికముగ విషయములను గంఠస్థములుగ నొనర్చుకొనుచుండినను, ఇచ్చట వాక్యార్థమునకును, చర్చలకును విశేషమగు ప్రామాణ్య మీయబడెను. విఖ్యాతవిద్యాలయములన్నిటి యందునుగూడ బండితశ్రేష్ఠు లొకప్రత్యేకభవనమున జేరి యచ్చట తత్త్వమునుగూర్చి వాదోపవాదములను జేయుచుండిరి. దీనిచే విషయము సుగమమగుటయే కాక విద్యార్థుల విమర్శనాబుద్ధి పెంపొందుటయు, స్వతంత్ర వ్యాఖ్యానములు బయల్వెడలుటయు జరగుచుండెడిది.

III. విద్యాపీఠములు

బౌద్ధవిద్యావిధానమునకును ప్రాచీనభారతీయ నాగరికతకునుగూడ బౌద్ధవిద్యాలయములు వెలలేని భూషణములు. సుప్రశాంతస్థలములలో నిర్మింపబడి

యసంఖ్యాకములగు సౌధగోపురస్తూపములతో రాజి ల్లుచు, రాజాదరణమును బడసి, భిక్షుభిక్షుణీజనముల తోడను, పండితప్రకాండములతోడను రాజిల్లి, సరస్వతీ నిలయములై యొప్పిన విద్యాలయము లనేకము లీదేశ మున వర్ధిల్లినవి. దూరదేశములనుండి యనేకు లీ యా లయములలో విద్యాభ్యాసము చేయుచుండిరి. ఫాహి యాన్ అను చైనాదేశయాత్రికుడు క్రీ. శ. ౭-వ శతాబ్ద మున ఉద్యాన, పురుషపుర, మథుర, సంకాశ్య, కన్యా కుబ్జ, శ్రావస్తి, సాకేత, రామగ్రామ, కపిలవస్తు, వైశాలి, పాటలీపుత్ర, రాజగృహ, వారణాసి, గయా, చంపా, తామ్రలిప్తి మున్నగు స్థలములలో సుప్రసిద్ధ విద్యాపీఠము లుండెడివని వ్రాసియున్నాడు. హ్యూయన్ ష్వాంగ్ అను నాతడు సింహపుర, ఉరశ, కాశ్మీర, పునచ, రాజపుర, నాలందా, వృజ్జి, హిరణ్యపర్వత, పుండ్ర, వర్ధన, కామరూప, సమతట, వేంగీ, ధనకటక, మంకూయట, భరుకచ్ఛ, వల్లభీ, ఉజ్జయినీ, మూలస్థాన విద్యాలయములను దర్శించెను. ఈత్సింగ్ అను మరి యొకయాత్రికుడు తామ్రలిప్తి, హరికేల, రాజగృహ, కుశనగర విద్యాపీఠములను గాంచియుండెను. ఇవికాక నింక ననేకములగు విద్యాలయము లుండెడివి. వాని నామములు సహితము నేడు దెలియకున్నవి. పై విద్యా లయములలో ముఖ్యములగువాని చరిత్రముమాత్ర మిట సంగ్రహముగ బేర్కొనబడుచున్నది :

నాలందా:—బౌద్ధవిద్యాలయములలోనే కాక ప్రాచీనభారతీయవిద్యాపీఠములలో నెల్ల నాలందా

విశ్వవిద్యాలయ మగ్రగణ్యము. ప్రస్తుతపు పాట్నాజిల్లా లోని రాజగిరికి ఎనిమిదిమైళ్లదూరమునందున్న బారగాన్ అను గ్రామమున పాడుపడిన చెఱువులును, సుమారు 3000 అడుగులదూరము వ్యాపించిన మట్టిదిబ్బలును బూర్వపు నాలందావిద్యాపీఠ ముండిన స్థలమున నేటికి గానవచ్చుచున్నవి. ఇటీవల ప్రభుత్వమువారి యార్ష శాఖచే నీస్థలమంతయు బరిశోధింపబడి యమూల్యములగు శిథిలములు బయల్వెడలింపబడినవి. అందు సువిశాలములగు భవనములును, చక్కని స్తూపములును, వసతిగృహములును నెన్నియో గలవు. ఈవిద్యాలయము వృద్ధిలోనుండినపు డిటకేతెంచిన యాత్రికుల వ్రాతల నుండి యిందలి శిథిలములను గుర్తించుటకు వీలగుచున్నది. తారానాథుడను చరిత్రకారు డీస్థలమున శారిపుత్రుడను భిక్షువు జన్మించెననియు, నాతనిచైత్యమును జేరి యశోక చక్రవర్తి యొకయాలయమును నిర్మించెననియు వ్రాసి యున్నాడు. హ్యూయాన్ ష్వాంగ్ అనునాతడు శక్రాదిత్యుడనురాజు నాలందాసంఘారామమును నిర్మించెననియు, నాతనికి బిమ్మట రాజ్యమేలిన బుధగుప్త, తథాగతగుప్త, బాలాదిత్య, వజ్ర యనువార లిచ్చట ననేకభవనములను నిర్మించిరనియు వ్రాసియున్నాడు. అటుపై నింకొకరాజీయారామములచుట్టు నొకగోడను గట్టించి యందొక ద్వారమును వేయించెను. దీనినుండి క్రీ. శ. ౪౫౦ నాటి కీవిద్యాపీఠము గుప్తరాజుల యాదరము నందెనని స్పష్టమగుచున్నది.

ఇందు సుందరశిల్పవిరాజమానములగు గోపురములు, గిరిశృంగములను ధిక్కరించు బురుజులు నుండెడివి.

సౌధములందలి పైయంతస్తులు మేఘమండలమును దాటి యుండ వానిపై నిర్మింపబడిన గ్రహదర్శనశాలలు (Observatories) సాధారణముగ నదృశ్యములుగ నుండి నవి. భిక్షువులు నివసించుటకు నాల్గంతస్తులభవనము లుండినవి. వానియందలి స్తంభములును, దూలములును చక్కని శిల్పనైపుణిని జూపుచుండినవి. వాని పైభాగ మునం దమర్పబడిన పెంకులు సూర్యకాంతిలో వింత వింతలగు రంగుల నీనుచుండెడివి. ఇందలి గోపురముల మధ్య సువిశాలములు, మహోన్నతములు నగు భవనము లుండెడివి. ఇందు నిరంతరమును శాస్త్రవాదములు జరగుచుండెడివి. గోపురముల కిరుపార్శ్వములను చైత్యములును, ఆలయములును ఉండెడివి. వీనికి బాహ్య ప్రదేశమున భిక్షువులవసతు లుండెడివి. వీని చుట్టును మనోహరములగు కాసారములు, ఆహ్లాద కరములగు మామిడితోపులు నుండెడివి. కాసారము లందలి స్వచ్ఛమగు నీటిపై నల్లకలువలు, రక్తవర్ణము లగు కణకపుష్పములు నీప్రదేశమున కంతటికిని విలక్షణ మగు శోభ నొనగూర్చుచుండినవి. ఈవిద్యాలయమున శిక్షణము నందుటకై కొరియా, మంచూరియా, బొఖారా మున్నగు దూరదేశములనుండికూడ ననేకు లేతెంచుచుండిరి. ఇందలిజనులు ౧౦౦౦౦ లకు మించి యుండిరి. ఇచ్చటి భిక్షువులందరును మహామేధా సంప న్నులు. వారి ప్రవర్తనము నిష్కళంకము. ఈవిద్యా పీఠమునందలి శిక్షణ మతికఠినముగ నుండెను. ఇందు ప్రవే శమునందుటకుబూర్వ మెల్లరును ద్వారమును గాచి యుండు పండితశ్రేష్ఠునితో వాదించి యాతనియనుమతి

పైననే లోని కేగవలసియుండెను. ఈపరీక్షయం దుత్తీర్ణులైనవారలు లోపలి మహాభవనములలో జరుగుచుండెడి వాదప్రతివాదముల నాకర్ణించి తమ యల్పజ్ఞతను దెలిసికొనుచుండిరి. ఇచ్చట విద్య నేర్చినవారలకు దేశమునందంతటను విశేషమగు గౌరవము చూపబడుచుండెను. క్రీ. శ. ౭-వ శతాబ్దమునం దిచ్చట నెనిమిది కళాశాలలు, మూడువందలకు మించిన సౌధములు నుండెడివి. ఇచ్చటియాచార్యులలో నాగార్జున, అశ్వఘోష, వసుబంధు, దిఙ్నాగ, కమలశీల, సంఘభద్ర, శాంతరక్షిత, వీరదేవ, మంజుశ్రీదేవ, శ్రీజ్ఞాన మున్నగువారల నామములు వినవచ్చుచున్నవి. వీరిలో నెల్ల నాగార్జునుడగ్రగణ్యుడు. విశేషప్రజ్ఞాశాలియగు నీతడు నాలందావిద్యాపీఠమున శిక్షితుడై వైద్య, జ్యోతిష, రసాయన, తత్త్వశాస్త్రములపై నెన్నియో గ్రంథములను రచించెను. పిమ్మట నీత డావిద్యాపీఠమున కధ్యక్షుడై మాధ్యమిక సిద్ధాంతమును బ్రతిపాదించెను. ఈవిద్యాలయమున విఖ్యాతమగు నొక భాండాగారముండెడిది. ఇయ్యది రత్నసాగర, రత్నోదధి, రత్నరంజక యను మూడుభవనములలో నుండెడిది. రత్నోదధియను తొమ్మిదియంతస్తులభవనమున ప్రజ్ఞాపారమితాసూత్రము మున్నగు బౌద్ధగ్రంథములన్నియు నుండెడివి.

రాజులందరు నీవిద్యాపీఠమున కనేకవిధముల సహాయమొనర్చుచుండిరి. హ్యూయాన్ ష్వాంగ్ కాలమున నూరుగ్రామములపై యాదాయ మీవిద్యాలయమునకొసంగబడుచుండెడిది. ఆగ్రామములందలి గృహస్థులందరును బియ్యము, పాలు, వెన్న, ఫలములు మున్నగు

తినుబండములను ప్రతిదినమును బంపుచుండిరి. దానం జేసి యిందలి విద్యార్థులకు భిక్షాటనావసరము లేకుండె డిది.

ఈవిద్యాలయమున బ్రతివిద్యార్థియు నొకగురువు నొద్దనే యుండి యాతనికి శుశ్రూష చేయుచు విద్య నేర్చుచుండెను. ఇదిగాక విరామసమయములలో నాతడు ఆచార్యులు చేయు వాదోపవాదములనుగూడ వినుచుండెను. మహాయానమును, మరి పదునెనిమిది బౌద్ధ దర్శనములును, వేదములు, హేతువిద్య, శబ్దవిద్య, చికిత్సావిద్య, తంత్రము, సాంఖ్యము, వ్యాకరణము మున్నగునవియు నీవిద్యాలయమున నేర్పబడుచుండెడివి. ఇచ్చట సూత్రములను, శాస్త్రములను బోధించువారలు వేయిమందియు, తత్త్వరహస్యములను జెప్పగలవార లైదువందల మందియు నుండిరి. ఇచ్చట నూరుపన్యాస వేదిక లుండెడివి. ధర్మపాల, చన్ద్రపాల, గుణమతి, ప్రభామిత్ర, జ్ఞాన చంద్ర, శీలభద్రాద్యాచార్యు లనే కులు వీనినుండి యుపన్యాసములను జేయుచుండిరి.

క్రీ. శ. ౯-వ శతాబ్దమున విక్రమశిలావిద్యాల యము విజృంభించినపిదప నీనాలందావిద్యాపీఠము పూర్వౌన్నత్యమును గోలుపోయెను. అయిన నీ విద్యా పీఠము ౧౨-వ శతాబ్దమువరకును వర్ధిల్లి పిమ్మట మహమ్మ దీయులచే నాశమొనర్పబడెను. ముదితభద్రుడనునాత డిందలి కొన్ని భాగముల నుద్ధరించెను. తుద కీవిద్యా లయము హుతాశనున కాహుతి యయ్యెను. *క్షమచే కోపమును, సత్కార్యములచే దుష్టులను, దానముచే

లోభులను, సత్యముచే మృషావాదులను జయింపవలెను" "ధర్మము, నధర్మము నొకేవిధమగు ఫలము నీయవు. అధర్మము నరకమున కీడ్చుకొనిపోవ ధర్మము మనుజునికి స్వర్గమున శాశ్వతనివాసము నొనగూర్చును" అను నాలందావిశ్వవిద్యాలయాదర్శములు సర్వకాలములందును, సర్వదేశములందునుగూడ ప్రాచీనభారతీయుల నైతికశుద్ధిని, హృదయవైశాల్యమును వేనోళ్ళ జాటగలవు.

విక్రమశిల:—నాలందావిద్యాపీఠమునకు ప్రత్యర్థియై యనతికాలముననే దానిని మించి విజృంభించినదీ విక్రమశిలావిద్యాపీఠము. దీని శిథిలములైనను నేడు కానరాక స్థలనిర్ణయముసహితము క్లిష్టముగ నున్నది. గంగానదికి కుడిభాగమున భాగల్పురమువద్ద నుండు పాతర్ఘాటాకొండలపై నీవిద్యాలయ ముండియుండునని పండితులప్రకృతాభిప్రాయము. క్రీ. శ. ౭౧౦-వ సంవత్సరమున ధర్మపాలుడను పాలరాజు దీనిని స్థాపించెను. మొదట నిచ్చట నూర్గురాచార్యులు వివిధవిషయములను బోధించుచుండిరి. వీరుగాక కొందరు భిక్షువులుగూడ నిటనుండిరి. ఈ విద్యాపీఠమును ఆర్గురుసభ్యులుగల సంఘము రాజాదరణముచే నిర్వహించుచుండెను. ఇచ్చట విద్యాభ్యాసమును ముగించినవారిని రాజులు "పండిత" యను బిరుదము నిచ్చి గౌరవించుచుండిరి. రత్నవజ్ర, జేతారి, దీపంకర, రత్నకీర్తి, జ్ఞానశ్రీమిత్ర, రత్నాకరశాంతి మున్నగువార లిట్టి పండితులలో నగ్రగణ్యులు.

విక్రమశిలావిద్యాపీఠమున కారుద్వారము లుండెడివి. వానివద్ద దిగ్దంతులగు పండితు లుండిరి. వీరిలో ప్రజ్ఞాకరమతి యనునాతడు దక్షిణద్వారమును, రత్నాకరశాంతి ప్రాగ్ద్వారమును, వాగీశ్వరకీర్తి యుత్తరద్వారమును, నరోపంతయనునాతడు పశ్చిమద్వారమును నొకప్పుడు రక్షించుచుండిరని తారానాథుడను చరిత్రకారుడు వ్రాసియున్నాడు. ఇందలి భిక్షువులకు, నాచార్యులకును రాజులు వసతుల నేర్పరచిరి. విద్యాలయమధ్యమునం దొకవిశాలసౌధ ముండెడిది. అందలి యారుద్వారములకు నెదురుగా నారువిశాలము లగు కళాశాల లుండెడివి. ఒక్కొకకళాశాలలో నూటయెనమండుగు రుపాధ్యాయు లుండిరి. ఇదిగాక నీయంతర్భాగమునం దొకేసారిగ నెనిమిదివేలమంది యుపాసకులు నిల్చుటకు సరియగు బహిరంగప్రదేశ ముండెడిది. ఒక్కొకద్వారముకడనుండు పండితు డొక్కొక కళాశాల కధ్యక్షుడుగ నుండెను. విద్యాపీఠమును ప్రవేశించుటకు బూర్వ మభ్యర్థులెల్లరును ద్వారపండితునిచే బరీక్షింపబడుచుండిరి. ఈవిద్యాలయమునందు విద్యార్థులకు భోజనాదిసౌకర్యములను గల్గించుటకై ధర్మసత్రము లుండెడివి. వీనికి రాజులును, ధనికులును వసతులను గల్పించుచుండిరి. ఈవిద్యాపీఠముచుట్టును గల గోడపై సింహద్వారమునకు దక్షిణపార్శ్వమున నాగార్జునునియొక్కయు, నుత్తరపార్శ్వమునం దతిశునియొక్కయు చిత్రములు వ్రాయబడియుండినవి. ఈవిధమున పండితశిఖామణు లిచ్చట బహూకరింపబడుచుండిరి.

విక్రమశిలావిద్యాపీఠము బౌద్ధతంత్రమునకు విశేషఖ్యాతి వహించియుండెను. క్రీ. శ. ౫-వ శతాబ్దమునం దింద్రజాలాదికములతో గూడిన తంత్రశాస్త్రము బౌద్ధులలో ప్రబలి ౮, ౧౦ శతాబ్దములలో విశేషముగ నభివృద్ధి నందినది. ఏకేశ్వరాత్మకమగు మహాయానబౌద్ధమునం దీశక్త్యారాధనపర మగు తంత్రము చొప్పింపబడినది. వ్యాకరణ, వేదాంత, తర్కములు పిమ్మట పేర్కొనవలసిన విషయములు. నాలందా విద్యాపీఠమునకు బిమ్మట విశేషవిఖ్యాతిని గాంచిన యీ విద్యాపీఠము తుదకు భక్తియార్ ఖిల్జీచే నాశమొనర్పబడెను.

ఒదంతపురి:—ఒదంతపురి బీహారులో నుండినది. ఈ నగరమున కుద్దండపురమను నామాంతరము గలదు. పాలవంశీయుడగు గోపాలుడనురాజు క్రీ. శ. ౮-వ శతాబ్దమునం దీవిద్యాపీఠమును నిర్మించెను. ఇచ్చట కేవలమును బౌద్ధగ్రంథములేగాక బ్రాహ్మణవిద్యగూడ గరపబడుచుండెడిది. ఈ విద్యాలయమునందలి గ్రంథాగారము మిగుల ఖ్యాతివహించియుండెను. క్రీ. శ. ౧౧౩౭ లో మహమ్మదీయు లీయుద్దండపురిని జయించి, యిచ్చటిభిక్షువులను, విద్యార్థులను జంపి యిందలిగ్రంథాలయమును నాశమొనర్చిరి.

ఇంతవరకు నుత్తరహిందూస్థానమున ప్రసిద్ధిగాంచిన బౌద్ధవిద్యాపీఠములలో ముఖ్యములగువానిని వర్ణించియుంటిమి. ఈ సమయమున దక్షిణమునగూడ బౌద్ధధర్మము వ్యాపించి యనేకముగ నచ్చటి నాగరికత నభివృద్ధిచేసెను. విహారములు, సంఘారామములు, స్తూప

ములు మున్నగున వెన్నియో బయల్వెడలినవి. క్రీస్తుశక ప్రారంభమున దక్షిణాపథము శాతవాహనాంధ్రుల పాలనమునం దుండెను. వారిలో ననేకులు బౌద్ధమతము నాదరించియుండిరి. కాన నిచ్చటగూడ భిక్షుసంఘములు విద్యావ్యాసంగము చేయుట కవకాశము లేర్పడినవి. ఆకాలపు విద్యాపీఠములలో నీక్రిందివి ముఖ్యమైనవి:

ధాన్యకటకము:—ఇయ్యది ప్రకృతము గుంటూరు జిల్లాలో ధరణికోట యని పిలువబడు గ్రామము. కృష్ణా నదీతీరమునం దమరావతికి సమీపమున గొన్ని మట్టి దిబ్బలచే నావరింపబడియున్న యీగ్రామ మొకప్పుడు విఖ్యాతినందిన విద్యాపీఠముగ నుండినది. బ్రాహ్మణబౌద్ధవిద్యలు రెండునుగూడ నిచ్చట ప్రబలినవి. క్రీ. శ. ౨-వ శతాబ్దమున బౌద్ధమతమును సంస్కరించి మహాయానసిద్ధాంతమును నెలకొల్పిన సిద్ధనాగార్జును డీధాన్యకటకవిద్యాపీఠము ననేకవిధముల నభివృద్ధిపరచెను. విదేశయాత్రికుల వ్రాతలనుండి యీవిద్యాలయమును గూర్చిన విశేషాంశములు నాలందావిద్యాపీఠమునందలి గ్రంథాగారములలో పదిలపరుపబడియుండెడివని తెలియుచున్నది. క్రీ. శ. ౭-వ శతాబ్దమునం దీదేశమునకు వచ్చి, బౌద్ధతత్త్వమును దెలిసికొనుచు, బౌద్ధగ్రంథములను సేకరించుచు బర్యటన మొనర్చిన హ్యూయాన్‌ష్వాంగ్ అను చైనాదేశ యాత్రికు డీధాన్యకటకనగరమునం దనేకసంఘారామములు, స్తూపములు నుండెడివనియు నచ్చట విద్యావ్యాసంగములును, బౌద్ధపూజలును నిరంతరాయముగ జరగు

చుండెడివనియు వ్రాసియున్నాడు. టిబెట్ దేశము నందలి "డాపంగ్" సంఘారామ మీధాన్యకటకము నందలి నిర్మాణము ననుసరించియే కట్టబడెననుటలో నీయాంధ్రవిద్యాపీఠముయొక్క మహత్త్వము తెలియు చున్నది.

వేంగీ:— బౌద్ధయుగమునం దాంధ్రదేశమున విఖ్యాతిగాంచిన విద్యాపీఠములలో వేంగిపీఠము మరి యొకటి. చక్కనిశిల్పములతో విరాజిల్లు నైదంతస్తుల హర్మ్యము లిచ్చటి సంఘారామమునం దుండెడివనియు, నిచ్చటిస్తూపము నిరుపమముగ నుండెడిదనియు చైనా దేశయాత్రికుల వ్రాతలవలన దెలియుచున్నది. ఇచటి విద్యాపీఠమునకు దిఙ్నాగాచార్యు డధ్యక్షుడుగ నుండెను.

శ్రీశైలము:—ఇచ్చటగూడ క్రీ. శ. ౨, 3 శతాబ్దములలో నొకసంఘారామ ముండెడిది. నాగార్జును డిచ్చట నొకగ్రంథాలయమును స్థాపించి, యనేకుల నిట జేర్చి విద్యోపదేశమును జేసెను.

కాంచీపురము:—ధాన్యకటక, శ్రీశైల విద్యా పీఠములవలెనే బౌద్ధయుగమున గాంచీపురము దక్షిణ దేశమునం దొక ప్రఖ్యాతవిద్యాలయముగ నుండెను. ఇట బౌద్ధబ్రాహ్మణవిద్యలు రెండును వ్యాప్తినందినవి. బౌద్ధగ్రంథములనుండి క్రీ. శ. 3-వ శతాబ్దములో నుత్తరమునుండి యిటకు గొందరు భిక్షువు లేతెంచిరనియు, నిటనుండియే బౌద్ధమతము సింహళదేశమున వ్యాపించె ననియు దెలియుచున్నది. హ్యూయన్‌ష్వాంగ్ ఈవిద్యా పీఠమునుగూర్చి ప్రశంసించియున్నాడు.

* * *

మూడవ అధ్యాయము

[ఆ ధా ర ము లు

Lakshmana Rao - Hindumaha yugamu

Mazumdar - History of Ancient Indian History and Civilisation

Virabhadra Rao - Andhrula Charitramu

Rama Rao - Political History of the Kakatiyas

Sarma - Pracheena Vidyasamsthalu

Annual reports on South Indian Epigraphy

South Indian Inscriptions Vol. IV, V, VI.]

మధ్యయుగము

క్రీ. శ. ౬౪౭ లో శ్రీహర్షచక్రవర్తి మరణించినయనంతరమునుండియు మధ్య యుగారంభమగును. ఉత్తరాపథము నేలిన చక్రవర్తులలో హర్షవర్ధనుడే కడపటివాడు. ఆతనికి బిమ్మట చిన్నిచిన్ని సంస్థానము లనేకములు బయల్వెడలినవి. పశ్చిమమున రసపుత్రులును, దూర్పున పాల, సేనరాజులును విజృంభించిరి. దక్షిణాపథమున దూర్పుపడమరతీరముల చాళుక్యులు ప్రబలిరి. కాంచీపురప్రాంతమున బాదుకొని పల్లవులు చోళపాండ్యాదులతో బోరి తమ

యధికారమును విస్తరించుకొనజొచ్చిరి. ఉత్తరాపథమున క్రీ. శ. ౧౧-వ శతాబ్దినాటికే హిందూరాజుల పాలన మడుగంటి దేశము మహమ్మదీయులకు లోనయ్యెను. అంతటినుండియు హిందూవిజ్ఞానము క్షీణింపసాగెను. ఇట్టియెడ దక్షిణాపథముమాత్రమే విదేశీయుల పీడ నెరుంగక శౌర్యధనులును, విద్యాపక్షపాతులును నగు రాజన్యుల పాలనమునం దుండి క్రీ. శ. ౧౪-వ శతాబ్ది మొదటిపాదమువరకును శాంతిస్వాతంత్ర్యముల ననుభవించెను. పౌనఃపున్యముగ యవనవిజయయాత్రల నడ్డగించి యిరువదిసంవత్సరములకాలము విదేశీయులతో నిరంతరమును బోరుచు దక్షిణాపథహిందూస్వాతంత్ర్యమును నిలువబెట్టి తుద కాత్మార్పణమును సహితము గావించిన యేకశిలానగరాంధ్రసామ్రాజ్యము నశించిన పిమ్మట కొంతకాలము దక్కనులో విదేశీయపీడ గల్గినది. కాని క్రీ. శ. ౧౩౩౫ లోనే హిందూపౌరుషము విజయనగరమున మొలకెత్తి శీఘ్రముగ విజృంభించినది. కాన క్రీ. శ. ౭-వ శతాబ్దమునుండి ౧౬-వ శతాబ్దమువరకును దక్షిణాపథమున హిందూవిద్యావైదుష్యము లభివృద్ధినందుచుండినవని స్పష్టమగుచున్నది. ఈ ప్రకరణమునం దీచరిత్రము వివరింపబడుచున్నది. ఉత్తరాపథమునం దీసమయమున ఢిల్లీసుల్తానుల పాలనమున మహమ్మదీయవైదుష్యము ప్రబలినది. ఆచరిత్రము రాబోవు ప్రకరణమున జర్చింపబడును.

పరిస్థితులు:—మధ్యయుగమునాటి దక్షిణాపథమునందలి విద్యాచరిత్రమును వర్ణించుటకు బూర్వ

ముచ్చట తాత్కాలిక రాజకీయాది పరిస్థితులను సంగ్రహాముగ బేర్కొనవలసియున్నది. శ్రీహర్షుని కాలమునకే మహారాష్ట్రదేశమున బూర్వచాళుక్యులు విశేషఖ్యాతి గాంచియుండిరి. రెండవ పులికేశి మహారాజు దక్షిణాపథమునందలి రాజుల ననేకుల నోడించి తూర్పుతీరమునందలి యాంధ్రభూమి నెల్ల జయించి, యచ్చటనత తమ్ముని బ్రతినిధిగ నెలకొల్పెను. అప్పటినుండియు ౧౧-వ శతాబ్ది మధ్యభాగమువరకును వేంగీచాళుక్యులను పేరిట జళుక్యు లాంధ్రదేశము నేలసాగిరి. ౮-వ శతాబ్ది మధ్యకాలమున రాష్ట్రకూటవంశజులు ప్రబలి, మహారాష్ట్రమునందలి చాళుక్యుల నణచి, వారి దాయాదులగు వేంగీ చాళుక్యులతో నిరంతరమును బోరుచు, దక్షిణమునకు దమ రాజ్యమును విస్తరించుకొనిరి. ఈసమయమున కాంచీనగరమునుండి పల్లవులు విజృంభింపసాగిరి. ౧౦-వ శతాబ్దమునాటికి పరిస్థితులు మారినవి. పల్లవ రాష్ట్రకూట వంశములు క్షీణించినవి. మహారాష్ట్రమున బశ్చిమచాళుక్యులును, వారికి బ్రాగుత్తరమున దేవగిరి యాదవులును, రాష్ట్రకూటుల స్థానమున గాకతీయులును, దత్తమండల తొండమండలములలో నాంధ్రచోళులును, దక్షిణమున చోళపాండ్యులును, గర్ణాటకమున హోయసలరాజులును బయల్వెడలి సామ్రాజ్యనిర్మాణదీక్షతో నన్యోన్యమును బోరుచుండిరి. ౧౧-వ శతాబ్దమునం దీ సామ్రాజ్యసమరములలో బశ్చిమచాళుక్యులు విజయమంది దక్షిణాపథమంతటిని స్వాధీనము చేసికొని పాలించిరి. ఈసందర్భమున త్రిభువనమల్ల విక్రమాదిత్యుని రాజ్యకాల మగ్రగణ్యము. ఇదేసమయ

మున చోళరాజు లితరప్రత్యర్థులను నిర్జించి దక్షిణదేశ మునం దప్రతిములై యుండిరి. ౧౨-వ శతాబ్దినాటికి బశ్చిమచాళుక్యులయొక్కయు, దాక్షిణాత్యచోళుల యొక్కయు బ్రతిభ నశింప ద్రవిడమున బాండ్య రాజులును, ఆంధ్రదేశమున గాకతీయులును విజృంభిం చిరి. ఏకశిలానగరకేంద్రమగు నీకాకతీయాంధ్రసామ్రాజ్య మనతికాలమునకే యాంధ్రభాగమును,దత్తమండలములను, తొండమండలమునుగూడ నాక్రమించి దక్షిణదేశవిజయ మునకై బాండ్యులతో స్పర్ధింపసాగినది. గోదావరీనది నుండి కాంచీనగరమువరకును గల భూభాగమున దుర్ని రీక్ష్యతేజోవంతమై రాజిల్లిన యీ కాకతీయాంధ్ర సామ్రాజ్యము క్రీ. శ. ౧౩౨౩ లో దురుష్కులచే నాశమొనర్పబడెను. కాని మరి పదిపదునైదువత్సరము లకే యీ యాంధ్రసామ్రాజ్యము, త్రిమూర్త్యాత్మకముగ బయల్వెడలి రాచకొండ, కొండవీడు, విజయనగర సామ్రాజ్యములుగ విజృంభించెను. ఇంతకుబూర్వ మేక శిలానగరమున విశేషాదరమును బడసిన హిందూవైదు ష్యమున కిపుడు మూడు కేంద్రములు లభించినవి.

ఈకాలమునందలి మతచరిత్రము భారతదేశ చరి త్రమునకు మిగుల ముఖ్యమైనది. మధ్య యుగారంభ కాలమునకు జైన, బౌద్ధ, బ్రాహ్మణమతములు మూడును దక్షిణాపథమునం దుండినవి. క్రమముగ బౌద్ధమతము క్షీణింప జైనులును, బ్రాహ్మణులును అత్యుత్సాహమున దమతమ మతములను వ్యాపింపజేయజొచ్చిరి. రాజు లలో ననేకులు జైనమతము నాదరించి జైనుల కనేక

సౌకర్యముల నొనగూర్చుచుండిరి. విశేషించి బ్రాహ్మణ మతమే ప్రబలముగ నుండినది. మతవైషమ్యములును, తద్విషయకములగు హింసాప్రతిహింసలు నీ కాలమున లేకుండినవి. ఇట్టిపరిస్థితు లుండుటచే నీ కాలమునం దనేకులగు మతసంస్కర్తలు బయల్వెడలిరి. ౧౦-వ శతాబ్దమున శ్రీ శంకరాచార్యుడు బయల్వెడలి నిగూఢ తాంత్రిక సిద్ధాంతకళంకితమగు బౌద్ధమతమును ఖండించి యద్వైతసిద్ధాంతస్థాపన మొనర్చి ప్రాచీన వైదికమతము నకు నూతనోత్తేజమును గల్గించెను. అటుపై శ్రీరామానుజాచార్యుడు బయల్వెడలి విశిష్టాద్వైతసిద్ధాంతమును ప్రతిపాదించి జైనమతమును నిర్మూలమొనర్చి, వైదిక మతమును విశేషముగ వ్యాపింపజేసెను. దక్షిణమున వైష్ణవమతము ప్రబలుచుండ బశ్చిమోత్తరమున గల్యాణీ నగరమున బసవేశ్వరుడు వీరశైవసిద్ధాంతమును బ్రతిష్ఠించి యమితోత్సాహముతో జైనమతనిర్మూలనమును, స్వమత విస్తరణమును నొనర్చుచుండెను. పిమ్మట శ్రీ మధ్వాచార్యుడు ద్వైతసిద్ధాంతమును ప్రతిపాదించి భక్తి తత్త్వమును బ్రచారముచేసెను. ఇదేసమయమున గోళగీ మఠశైవాచార్యులు శైవమతమును వ్యాపింపజేయు చుండిరి. ఈపరిస్థితులలో విజ్ఞానమోష యనేకగతుల విలాసనృత్యముల నొనర్చినది. బ్రాహ్మణమతమునకు, సంస్కృత భాషకు నద్వితీయమగు ప్రోత్సాహము లభింప నయ్యవి సర్వతోముఖమగు నభివృద్ధి నందినవి. వీరశైవాదిమతప్రవర్తకులు దేశభాషలలో మతప్రచార మొనర్చుటచే నాభాషలుగూడ నభివృద్ధి నందసాగినవి. జనసామాన్యోపయోగార్థమై నన్నయాది మహాకవు

లుద్గ్రంథముల నెన్నిటినో దేశభాషలలోనికి బరివర్తింప జొచ్చిరి. దానజేసి యింతవరకును సంస్కృతభాష నాశ్రయించియుండిన హిందూవైదుష్య మిపు డనేక భాషలలో బ్రసరించినది.

రాజాస్థానములు:—సముద్రగుప్త చంద్రగుప్తాది గుప్తచక్రవర్తుల కాలమున శ్రీహర్షుని రాజ్యకాలము నందు నుత్తరహిందూస్థానమునందువలె దక్షిణాపథమున మధ్యయుగమునందు నిజమైన జాతీయజీవనము, సర్వతో ముఖమగు వైదుష్యము నభివృద్ధినందినవి. ఇట్టి నూతనోజ్జీవనమును గల్పించిన సంస్థలలో రాజాస్థానము లగ్రగణ్యములు. పండిత, కవి, గాయక వర్గము రాజసభలకు ముఖ్యాంగములు. వేనకువేలుగ దొరకు శిలా తామ్రశాసనములు రాజులు పుణ్యకాలములందును, పట్టబంధ, సమరవిజయాది సంతోషసమయములందును బండితుల కొనర్చిన దానములను దెలుపుచున్నవి. అనేకులగు పండితుల కగ్రహారము లేకభోగములుగ నొసంగబడినవి. ఇతరసమయములలో విద్వాంసులకు వృత్తు లేర్పరుపబడెడివి. ఇవిగాక అధ్యాపకులకు గౌరవవేతనము లీయబడుచుండెడివి. మహాభారతరచనసందర్భమున నన్నయభట్టునకు దోడ్పడిన నారాయణభట్టునకు చాళుక్యరాజరాజు నందమపూడిని, మనుచరిత్రరచయితయగు పెద్దన కవికి కృష్ణదేవరాయలు కోకటగ్రామమును అగ్రహారములుగ నొసంగిరి. ఇట్టి యుదాహరణము లసంఖ్యాకములు గలవు. రాజరాజ, మనుమసిద్ధి, ప్రతాపరుద్ర, కృష్ణరాయాది విద్వద్రాజులు నిరంతరమును పండిత

గోష్ఠితో కాలముగడపుచుండిరి. తిక్కనసోమయాజి, శివమహాముని, విద్యారణ్యుడు మున్నగువారలు తమ పాండితీప్రతిభలచే నిరుపములై రాజ్యముల పురోభివృద్ధికి మూలస్తంభములై యొప్పిరి. కాకతీయాంధ్రచక్రవర్తియగు గణపతిదేవుని యాస్థానమునం దొకవిద్యామంటప ముండినటుల మాల్కాపురశాసనమునుండి తెలియుచున్నది. ఆతని మనిమనుమడగు ప్రతాపరుద్రచక్రవర్తి సంస్కృతాంధ్రవాఙ్మయములను, జ్యోతిషాదిశాస్త్రములను, శిల్పము, నాట్యమున్నగు కళలను ఆదరించెను. మల్లినాధుడను మహాకవి యష్టావధానమొనర్చి యాతని మెప్పు వడసెను. ఈచక్రవర్తి స్వయము విద్వాంసుడు. కొండవీటిరెడ్లువిద్యాశాఖ నొకదానిని ప్రత్యేకముగ నెలకొల్పిరి. వారివద్ద శ్రీనాథకవి విద్యాధికారిగ నుండెను. శ్రీనాథుని జీవితమునుండియాకాలమున గవులకును,పండితులకును జరిగెడి సన్మానము తెలియుచున్నది. డిండిమభట్టువలె నప్పటి పండితులు ఢంకావాద్యము మున్నగు ప్రకటనసాధనములను గల్గియుండిరి. శ్రీనాథు డీతని నోడించుటచే విజయనగరాధీశ్వరు డాతనికి స్వర్ణాభిషేక మొనర్చెను. ఈపండితుడు రాజభోగముల ననుభవించెను. రత్నాంబరములు, హేమపాత్రాన్నము కస్తూరి మున్నగున వీతనికి సులభసాధ్యములుగ నుండెడివి. అటులే కృష్ణరాయ లల్లసాని పెద్దనార్యునకు జూపిన గౌరవమర్యాదలుగూడ నీ మధ్యయుగమున పాండిత్యమునకు గల మహత్త్వమును జూపుచున్నవి. ఏనుగుపై రాజుతో నర్ధాసనమున గూర్చొనుట, కవి యెక్కిన పల్లకిని రాజు స్వయముగ నెత్తుట, కాలికి

గండపెండేరమును దొడగుట, అగ్రహారముల ననేకముల నిచ్చుట మున్నగున విందుల కుదాహరణములు. ఈకాలపు రాజులుగూడ నెందరో మహావిద్వాంసులై యుండిరి. అందువలన "విద్వానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమం" అనునటుల వారు విద్వాంసులయెడ విశేష గౌరవాదరములను జూపిరి. ఆంధ్రరాజులలో నన్నెచోడుడు, కాకతీయరుద్రదేవప్రతాపరుద్రులు, రెడ్లలో కుమారగిరి కాటయవేములు, పద్మనాయకులలో రావుసింగమహీపాలుడు, విజయనగరరాజులలో కృష్ణదేవరాయలు నిందుల కుదాహరణములు. రాజబంధువులు, సామంతులు, ప్రధానోద్యోగులు, ధనికులునుగూడ రాజాదర్శము ననుసరించి చాలమంది కవులకును, బండితులకును ఆశ్రయమొసగి వారిచే నెన్నియో గ్రంథములను వ్రాయించు చుండిరి. విద్వజ్జనదారిద్ర్య దుఃఖమును రాజాస్థానములు నిర్మూలించు చుండినవి. "నిరాశ్రయా నశోభంతే పండితా వనితా లతాః" యనునటులు రాజాదర ముండుటచేతనే మధ్యయుగమున విద్యావైదుష్యము లపూర్వశోభను గాంచినవి.

అగ్రహారములు:—మధ్యయుగమునందు విద్యావైదుష్యములను వ్యాపింపజేసిన సంస్థలలో రాజాస్థానములకు బిమ్మట పేర్కొనవలసినవి అగ్రహారములు:-పర్వకాలములందును, దిగ్విజయపట్టబంధాది మహాసమయములందును రాజు లనేకులు వేదవేదాంగపారగులును, పురాణేతిహాసజ్ఞులును, కర్మనిరతులును అగు విప్రుల కీయగ్రహారములను దానమొసంగుచుండిరి. వీని యాదా

యముతో జీవయాత్రను జేయుచు నీ బ్రాహ్మణులు నిశ్చింతులై స్వాధ్యాయప్రవచనములతో గాలక్షేప మొనర్చుచుండిరి. ఈయగ్రహారము లేకభోగములు, బహుభోగములు నని రెండువిధములు. అందు మొదటి తరగతి వొక్కని హక్కుభుక్తములోనే యుండునవి. రెండవతరగతి యగ్రహారములలో ననేకపండితకుటుంబములకు వృత్తు లేర్పరుపబడియుండెడివి.

అగ్రహారములకు మంగలములనియు, జతుర్వేది మంగలములనియుగూడ పేరుండెడిది. వీరనోడ చతుర్వేదిమంగలమను నొకచో గల శాసనమునుండి, యచ్చట వ్యాకరణ, మీమాంసా, వేదాంత, ఋగ్యజుస్సామ, రూపావతార, పురాణ, జ్యోతిష, వైద్యవిద్యలను బోధించు నాచార్యుల నొక్కొకని కొక్కొక వృత్తి గల్పింపబడియుండెడిదని తెలియుచున్నది. ఈ యగ్రహారముల కేవిధమగు బాధయు గలుగకుండగ జేసి రాజులు వానికి సర్వస్వాతంత్ర్యముల నొసంగియుండిరి. వీనిపై ఏ విధమగు పన్నులును విధింపబడకుండినవి. ఇందలి భూములపై వచ్చు ధాన్యమంతయు నగ్రహారీకులదే. రాజకీయోద్యోగుల కిందు బ్రవేశము లేకుండెడిది. అందలి పండితులును అన్యాపేక్షలేక సర్వకార్యములను నిర్వహించుకొనుచుండిరి. ఇటు లన్ని విధములను నేటి రాజశాసనములచే నిర్మింపబడిన విశ్వవిద్యాలయములను మించిన స్వాతంత్ర్యమును గలిగి యీ యగ్రహారము లనన్యదృష్టితో వైదికవిద్యను వ్యాపింప జేయుచుండినవి.

మహాసభలు:—అగ్రహారములవలెనే యందుండిన మహాసభలుగూడ విద్యావ్యాప్తి నొనర్చుచుండినవి. ఇయ్యవి యగ్రహారములందలి కార్యములను నెరవేర్చుటకై యేర్పరుపబడిన సంఘములు. అనేక సమయములలో రాజులును, శ్రీమంతులును ఈగ్రామములందలి విద్యాభివృద్ధికై మహాసభల పరముగ ననేకధర్మములను జేయుచుండిరి. తుంబళి మనుగ్రామమున క్రీ. శ. ౧౨-వ శతాబ్దములో నిర్మింపబడిన యొకశాసనమున మలయవతీదేవి యను చాళుక్యరాజ్ఞి యాగ్రామమునం దధ్యాపకాధ్యేతల సౌకర్యార్థమై యొక భోజనసత్రమును నిర్మించుటకును, ఋగ్యజుస్సామాధ్యాపకులను, పౌరాణికు నొకనిని ఏర్పరచుటకును తుంబళిగ్రామ మహాసభాసభ్యులకు నూటనలుబదిమంది కాయూరినుండి వచ్చు 'సిద్ధాయము'లో ముప్పది గద్యాణములను దాన మొనర్చెనని చెప్పబడియున్నది. అటులే క్రీ. శ. ౯-వ శతాబ్దమున పల్లవరాజుల యాశ్రితు డొకడు బాహూగ్రామమునందలి చతుర్దశవిద్యల యభివృద్ధికొరకును మూడుగ్రామములును దానముచేసి వాని నా గ్రామ మహాసభవారికి స్వాధీనము గావించెను.

దేవాలయములు:—మధ్యయుగమునందలి విద్యాసంస్థలలోనెల్ల దేవాలయము లగ్రగణ్యములు. ఇయ్యవి గ్రామ జీవితమునకు కేంద్రస్థానములుగ నుండినవి. గ్రామస్థుల యాధ్యాత్మికజీవితమునకేకాక వారి యైహిక ప్రవృత్తులకుగూడ ననేకవిధముల నాదర్శప్రోత్సాహముల నొసంగి దేవాయతనములు సర్వాభీష్టప్రదములై యొప్పినవి. రాజ్యమువలెనే దేవాలయముగూడ నొక

క్లిప్తసంస్థగా నుండినది. సువిశాలములగు నీ యాలయములలో రాజ్యాంగమునందువలె ననేకనియోగములును, ననేకులగు నుద్యోగులును ఉండిరి. అట్టినియోగములలో విద్యాశాఖ ముఖ్యమైనది. ప్రభువులును, శ్రీమంతులును అనేక భూములను దానముజేసియు, ధనమును నిధులుగ నర్పించియు, ప్రత్యేక కార్యనిర్వాహకులకు వృత్తుల గల్పించియు, కుడ్యగోపురద్వార మంటపాదుల గట్టించియు, నారామతటాకాదుల ద్రవ్వించియు, ప్రత్యేకములగు నుత్సవాదులను జరపించి వాని కగు వ్యయములకై దానముల జేసియు, భోజనసంభారములను, పాత్రసామగ్రిని గల్పించియు, దేవతలకు ధన కనక వస్తువాహనాదికముల నర్పించియు ననేకవిధముల నా దేవాలయములను బోషించుచుండిరి. దేవాలయ కార్యనిర్వహణమునకై యొక సంఘ ముండెడిది. ఈసంఘమే యాలయమున కొసంగబడిన భూములను పరిశీలించుటకును, దేవతాకార్యముల నెల్ల నిర్వహించుటకు నుద్యోగుల నేర్పరచి ప్రమత్తులగువారల శిక్షించుచు, సర్వకార్యములను నిర్వహించు చుండెను. ఇది గాక భక్తులొసగు ద్రవ్యమును, దేవోపయోగార్థమొసంగబడు వస్తువాహనాదులను రక్షించుటకు నొక భండారము, నొక భండార సంఘము నుండెడివి. తరచుగ రాజోద్యోగు లీయాలయకార్యములను బరీక్షించుచు లోటుపాటులను సవరించుచుండిరి. ఇట్టియుత్తమ పద్ధతులపై నిర్మింపబడిన దేవాలయము లుత్కృష్ట విద్యాపీఠములుగ నుండినవి. ఆంధ్రద్రవిడ దేశములందలి శాసనము లనేకము లిట్టి యాలయములలో నధ్యా

పకులుగ నుండినవారికిని, విద్యార్థులకును వృత్తుల నేర్ప రచనవిగ నున్నవి. దక్షిణార్కాడు మండలములోని త్రిభువని యనుగ్రామ మీసందర్భమున ముఖ్యాంశము లను దెల్పుచున్నది. ౭౨ వేలీల భూమిపై సంవత్సర మున బండు ౧౨౦౦౦ కలముల ధాన్యములో ౨౫౦౦ కలములను మతసంబంధములగు కార్యములకై వినియో గించి మిగిలినవానిని విద్యాపోషణార్థ ముపయోగింపవలె నని యాశాసనము జెప్పుచున్నది. ఈవిధమున ఋగ్వేద మునకు ముగ్గురును, యజుర్వేదమునకు మువ్వురును, సామ వేదమున కిద్దరును, ఆపూర్వవాజసనేయ, బోధాయనీయ సత్యాషాఢ సూత్రముల జెప్పుట కొక్కొకరును, వేదాంత, వ్యాకరణ, రూపావతార, భారత, రామా యణ, మనువైఖానసధర్మశాస్త్రాదుల కొక్కొకరును ఉపాధ్యాయులు ప్రత్యేకవృత్తులను బడసిరి. అటులే ఋగ్యజుర్వేదముల బఠించు నూటయిరువదిమందికిని, సామవేదమును జదువు నిరువదిమందికిని, యేబదిమంది యితరశాస్త్రముల నభ్యసించువారలకును, వేదాంత వ్యాకరణరూపావతారములను నేర్చుకొను డెబ్బదిమంది కిని విద్యార్థులకు భాగము లేర్పరుపబడినవి. ఇదేవిధ మున ఎణ్ణాయిరమను మరియొకగ్రామమునందలి యాల యమున జతుర్వేదములను బఠించు రెండువందల యేబది మందికిని, రూపావతార, వ్యాకరణ, ప్రాభాకర వేదాం తాధ్యయన పరులగు నూర్గురు విద్యార్థులకును వసతులు కల్పింపబడినవి. ఇచ్చటి యుపాధ్యాయులకు దినవెచ్చ మిచ్చుటకేర్పాట్లు గావింపబడినవి. అదియునుగాకవ్యాక

రణ, ప్రాభాకర, వేదరూపావతారాధ్యాపకులకు వారి వారి శాస్త్రములలో నధ్యాయమున కొకకలంజు బంగారమును, ఆయాశాస్త్రముల నభ్యసించు విద్యార్థులకు డెబ్బదిమందికిని ముప్పదియైదుకలంజుల బంగారము నొసంగుటకై శాసింపబడెను. తిరుముక్కూడల్ అను గ్రామమునందలి మరియొక యాలయమునందలి శాసనమునుండి యింకను గొన్నివిశేషాంశములు దెలియుచున్నవి. అచ్చట 'జననాథమంటపము'నందు వేదశాస్త్రాదులను బోధించుటకై యొక విద్యాలయమును, విద్యార్థులభోజనశాలయు, నొకవైద్యాలయము నుండెడివి. ఇచ్చటి విద్యార్థులకు రాత్రులు చదువుకొనుటకై దీపములకు చమురు నిచ్చుటకును, ప్రతిశనివారము నభ్యంగస్నాన మొనర్చుటకును వలయు నేర్పాటులు చేయబడినవి. ఇట్టివివరములను దెల్పుశాసనము లనేకములు శ్రీశైలము, త్రిపురాంతకము, దాక్షారామము, మందరము, మున్నగున నేకస్థలముల గాంచనగుచున్నవి. వీనినుండి యాకాలమున వ్యాప్తిలోనుండిన శాస్త్రాదికములు దెలియుచున్నవి. ఒక్కొక్క శాస్త్రమున కొక్కొక్క యాచార్యుడుండి వారివేతనములకై ప్రత్యేకవసతు లేర్పరుపబడి, వివిధ విషయములవ్యాసంగములకై ప్రత్యేకస్థలములు నియమింపబడి, విద్యార్థులకుమజ్జనభోజనవైద్యాది సౌకర్యములు గల్పింపబడి, భగవత్సన్నిధానమున సౌశీల్యమును పెంపొందించుకొను గురుశిష్యబృందములతో నలరారుచుండిన ప్రాచీనహిందూదేవాలయములు మధ్యయుగమున హిందూ విద్యావైదుష్యముల కాలవాలములై యుండినవి. మహానాగరికులమనియు నిర్మాణకార్య

దీక్షితుల మరియు విజ్ఞవీసునాధునికులు నేటివరకును బరిష్కరింపజాలని వసతికళాశాలా (Residential Colleges) సమస్యను మన ప్రాచీను లుత్తమగతుల బరిష్కరించియుండిరి.

భట్టవృత్తి:— దేవాలయాగ్రహారములవలెనే భట్టవృత్తి మధ్యయుగమునాటి మరియొక విద్యాసంస్థ. భట్టవృత్తియనగా బండితులకు ప్రభువులును, సామంతులును సర్వబాధాపరిహారముగా నొసంగు భూదానము. వేదవేదాంగపారగులగు పండితుల కొకప్పుడు గద్యాణములను నాణెములనుగూడ నొసంగుటగలదు. ఇందుకు బ్రతిఫలముగ వారు విద్యార్థులకు విద్యనేర్పవలసి యుండెడిది.

జైనబస్తీలు:— జైనబస్తిలు గూడ బ్రాహ్మణాగ్రహారములవలెనే విద్యావ్యాప్తికి గారణములైయుండెడివి. వీనియందు జైనధర్మప్రచార మెక్కుడుగ నుండెడిది. ఇట్టిజైన విద్యాపీఠములు బెజవాడ, ధర్మవరము, రామతీర్థము, హనుమకొండ, కొల్లిపాక, గంగాపురము మున్నగు నాంధ్రభాగములందును, దక్షిణమున మధుర, ఒరయూరు మున్నగుస్థలములందును నుండినవి. రాజులనేకు లీసంస్థలకు దానధర్మములను జేయుచుండిరి.

మఠములు:— దేవాలయములవలెనే మఠములు గూడ నీకాలమున విద్యావ్యాప్తికి మూలములై యుండినవి. వీని నిర్మాణమునకు మార్గదర్శులైనవారు శైవులు. కాశ్మీరమునుండి గొందరును, భాగీరథీనర్మదామధ్యస్థమగు దహాలమండలమునుండి మరికొందరును దక్షిణమున

కేతెంచి దమయసమాన పాండితీప్రతిభచే కేరళచోళ మాళవాంధ్రదేశాధీశులను మెప్పించి వారియాదరముచే ననేకమఠములను నిర్మించి హిందూవైదుష్యమును, శైవ మతమును బ్రచారముజేసిరి. కాలాముఖశైవులు క్రీ. శ. ౯-వ శతాబ్దమునుండియు గర్ణాటాంధ్రదేశములలో విద్యావ్యాప్తి నొనర్చుచుండిరి. పిమ్మట పాశుపతులగు గోళగీమఠాచార్యులుగూడ నీకార్యమును నిర్వహించిరి. ఈశైవులవిద్యాప్రచారమునకు మఠములు ముఖ్యస్థానము లుగ నుండినవి. అనతికాలముననే ఆంధ్రదేశమున శ్రీశైలము, కాళేశ్వరము, భీమేశ్వరము, మున్నగుస్థలములు వాసికెక్కినవి. పాశుపతశైవాచార్యులప్రచారమువలన ద్వరలో దహాలమండలమందలి గోళగీమఠమునకు పుష్పగిరి, త్రిపురాంతకము, మందరము నను నాంధ్ర భాగములందును, తిరుప్పఱంకున్రమ్, మధుర, శెయ్యూరు, దేవికాపురము మున్నగు దక్షిణదేశస్థలము లందును శాఖలు బయల్వెడలినవి. గుంటూరుజిల్లాలోని మంగళగిరికి సమీపమునందున్న మల్కాపురగ్రామము నందలి యొకశాసనమును బరిశీలించినచో నీశైవమఠము లొనర్చిన విద్యాసేవ స్పష్టమగుచున్నది. భారతీయరాజ్ఞీ మణులలో నగ్రగణ్యయు నాంధ్రదేశమునెల్ల రామ రాజ్యమువలె నేలిన తేజస్వినియు నగు కాకతీయ రుద్రాంబ మందరమను గ్రామమును గోళగీమఠశైవాచార ప్రవర్తకుడును రాజగురువు నగు విశ్వేశ్వరశివమహా మునికి దానమొనర్చెను. ఆయాచార్యుడా గ్రామమునకు విశ్వేశ్వరగోళగి యనునామ మిడి యందలి భూము

లను గొన్ని బ్రాహ్మణకుటుంబములకును, దాను నూతన ముగ నిర్మించిన విశ్వేశ్వరాలయమునకును, శుద్ధశైవ మఠమునకును, విద్యార్థులకును, ప్రసూత్యారోగ్యశాల కును, విప్రసత్రమునకును బంచిపెట్టెను. ఆశైవమఠము నందలి విద్యార్థులకొరకై ఋగ్యజుస్సామవేదాధ్యాప కులు మువ్వురును, పదవాక్యప్రమాణ సాహిత్యాగమ వైద్యగణితములను నేర్పుటకు నైదుగురుపాధ్యాయులు నుండుటకును, వారిలో నొక్కొకనికి రెండుపుట్లభూమి యొసంగబడుటకు నేర్పాటు గావింపబడెను. ఇదేవిధ మున గన్నడదేశమున కేదారేశ్వరాలయమున 'కోదియ' మఠమను నొకవిద్యాసంస్థ బెలగామి యనుచోట బ్రసిద్ధి కెక్కియుండెను. అట వేదవేదాంగములును కుమార పాణిని శాకటాయనవ్యాకరణములును, షడ్దర్శనము లును, యోగశాస్త్రమును, పురాణేతిహాస, ధర్మశాస్త్ర సాహిత్యములును బోధింపబడుచుండెడివి.

ఇంతియకాక మతత్రయాచార్యులు దమ నిరం తరకృషిచే మతవ్యాప్తి నొనర్చియు నాకార్యము పారంపర్యముగ నడచుటకై భారతదేశమునం దనేక మఠములను నెలకొల్పిరి. వీనికి సన్న్యాసు లధ్యక్షు లుగనుండి సంస్కృతవిజ్ఞానము దోడుగా స్వమతసిద్ధాం తములను వ్యాప్తి చేయుచుండిరి. శ్రీ శంకరాచార్యు నిచే శ్రీ శారదాపీఠమును, ద్వారక పూరీ కాశీ హరి ద్వారము బదరీనారాయణము మున్నగు స్థలముల మఠ ములు నిర్మింపబడినవి. అటులే శ్రీరామానుజుడుగూడ మేలుకోటలోను, మన్నార్ కోయిల్, అహోబలము

మున్నగుస్థలముల మతస్థాపన మొనర్చెను. ద్వైతవేదాంత ప్రతిష్ఠాపకుడగు శ్రీ మధ్వాచార్యుడు గూడ ఉడిపి గ్రామమునం దేడుమతములను స్థాపించి, ప్రాచీన హిందూవిజ్ఞానమును, ద్వైతసిద్ధాంతమును విస్తరింప జేయుటకై యుత్తరాదిమఠమును స్థాపించెను. ఈమఠము లన్నియు నేటికిగూడ సుపాటవములై యుత్కృష్ట విద్యాసంస్థలుగ నొప్పుచున్నవి.

* * * *

నాల్గవ అధ్యాయము

[ఆధారములు

Elliot - History of India

Elphinstone - ,,

Law - Promotion of Learning in Mahomadan times.]

ఢిల్లీ సుల్తానుల పాలనము

(౧౦౦౦ - ౧౫౨౬)

క్రీ. శ. ౧౦౦౦-వ సంవత్సరమునాటికి ప్రాచీన హైందవస్వాతంత్ర్యభాను డస్తమించెను. అప్పటి నుండియు బచ్చిమోత్తరమునుండి మహమ్మదీయు లీ దేశముపై దండెత్తివచ్చి సస్యశ్యామలమును, బహుధన సమృద్ధమును, బహురాజపాలితము నగు నీదేశమును కొల్లగొని దమమతాచారములకు వ్యత్యస్తము లగు

మతాచారముల నవలంబించు హైందవుల ననేకవిధముల బాధింపసాగిరి. అనతికాలముననే యీ విదేశీయు లీ యాదృచ్ఛిక దండయాత్రలను మాని యీదేశమున స్థిరపడి రాజ్య మేలసాగిరి. క్రీ. శ. ౧౨-వ శతాబ్ది ప్రారంభమునుండి పదునెనిమిదవశతాబ్ది మధ్యభాగమున ఈస్టిండియాకంపెనీవారి పాలనము సుస్థిరముగ నాటుకొనువరకును మహమ్మదీయు లీదేశముపై నిరంకుశాధికారమును నెరపిరి. దక్షిణాపథముమాత్రము పదునాల్గవ శతాబ్దము వరకును స్వాతంత్ర్యము ననుభవించి యటుపిమ్మట మహమ్మదీయులకు వశమయ్యెను. అందుచే నుత్తరదేశమునందలి హిందూ బౌద్ధ విద్యాసంస్థలు క్షీణించి నశించినవి. తురుష్కులు తా మీ దేశమున స్థిరపడినపిమ్మట దమవిద్యావిధానమునుగూడ నిచ్చట బాదుకొల్పిరి. వారివిద్యాసంస్థలలో "మక్తాబ్, మద్రసా" లను విద్యాలయములు ముఖ్యము లైనవి. మక్తాబ్ అనునది యిప్పటి ప్రాథమికపాఠశాలకుసరియై, సామాన్యముగ మశీదులను చేరియుండెడిది. ఇందు కొరాన్ అను మతగ్రంథమును, చదువుట వ్రాయుటయు, గణితము నను విషయములు మాత్రము బోధింపబడుచుండెడివి. మద్రసా యనునది ప్రస్తుత కళాశాలకు సరియగును. ఇం దున్నతవిద్యయు, తత్త్వము నభ్యాసింపబడుచుండెడివి.

మహమ్మదీయయుగమున రెండు విభాగములు గాంచనగుచున్నవి. వానిలో మొదటిది ఢిల్లీ సుల్తానుల పరిపాలనాకాలము. రెండవది మొగలుసామ్రాజ్య

కాలము. మహమ్మద్ గోరీ యీదేశమును జయించిన పిమ్మట తనబానిసయు, మహాశూరుడు నగు కుతుబ్ ఉద్దీననునాతని నిచ్చట రాజప్రతినిధిగ నియమించెను. మహమ్మద్ మరణానంతర మీబానిస స్వతంత్రుడై క్రీ. శ. ౧౨౦౬ నుండియు ఢిల్లీ నగరమునుండి రాజ్యమేల సాగెను. అప్పటినుండియు క్రీ. శ. ౧౫౨౬లో మొగలు లీదేశముపై దాడివెడలువరకును ఢిల్లీ సుల్తానుల పాలనము కొనసాగినది. ఈ ప్రకరణమునందు సుల్తానుల పాలనము నందలి విద్యాచరిత్రము వర్ణింపబడుచున్నది. ఇప్పటి విద్యాస్థితి కేవలమును పాలకుల వైదుష్యముపైనను, రసజ్ఞతపైనను ఆధారపడియుండినది. వారలు విద్వాంసు లైనచో వారియాస్థానము లనేకులగు పండితకవిగాయ కుల కాలవాలము లగుటయు, దేశమునం దనేకములగు విద్యాసంస్థలును, గ్రంథాగారములును బయల్వెడలు టయు జరగుచుండెడివి. ఈ కాలమునందలి రాజాదరము కేవలమును మహమ్మదీయవైదుష్యమునకే యొసంగ బడుచుండెడిది. సుల్తానులు యథాసాధ్యముగ దేశీయ విద్యాసంస్థలను, వైదుష్యమును నశింప జేయుచుండిరి.

గజినీవంశము, ౯౬౭-౧౧౫౨:— ఈ వంశము నం దగ్రగణ్యుడగు సుల్తాన్ మహమ్మదు మిక్కిలివిద్యా ప్రియుడు. ప్రతిసంవత్సరము నీతడు వాఙ్మయాభివృద్ధికై ౪౦౦,౦౦౦ దీనారములను వెచ్చించు చుండెను. గజినీ నగరమునం దొకవస్తుప్రదర్శనశాలయు (Museum), దానిసిజేరి యొక విశ్వవిద్యాలయము (University)ను నీతనిచే నిర్మింపబడినవి. 'షానామా' యను రాజ చరిత్రమును రచించిన ఫిర్దౌషీకవి యీకాలముననే

జీవించెను. ఈ సుల్తానునకు పర్షియన్ వాఙ్మయమునం దభిరుచి మెండుగ నుండెడిది. ఈతని యాస్థానమునందలి పండితులలో ఆల్ బిరూనీ యనునాత డగ్రగణ్యుడు. సుల్తాన్ మహమ్మదు పంజాబును జయించినపిమ్మట నీపండితు డచ్చట గొంతకాలము నివసించి హిందూ వైదుష్యమున ప్రవేశము సంపాదించెను. సంస్కృత భాష నభ్యసించి యీతడు పురాణములను, గణితము, జ్యోతిషము, కాలజ్ఞానము (Chronology), భూగోళ శాస్త్రము, ధాతికరసాయనాదిశాస్త్రములు మున్నగు విషయములను బెక్కింటిని బరిశోధించి తన మాతృ భాషలోనికి బరివర్తించెను. ఈ పండితునికి హిందూ తత్త్వశాస్త్రమునందును, ముఖ్యముగ భగవద్గీతపైనను ప్రీతి యెక్కుడుగ నుండెను.

సుల్తాన్ మహమ్మన్ పుత్రుడగు మసూద్ గూడ చక్కని విద్వాంసుడు. ఈతడు జ్యోతిషమును గూర్చియు, తత్త్వశాస్త్రమునను గొన్ని గ్రంథములను సహితము రచించెను. ఈతనికి బిమ్మట సుల్తాన్ బైరం అనువాతడు పేరొక్కనదగినవాడు. ఈతని ప్రోత్సాహ ముచే నన్యభాషలనుండి యనేక గ్రంథములు పర్షియను భాషలోనికి తర్జుమాచేయబడినవి. హిందువుల 'పంచ తంత్రము' 'ఖలీలాదమ్నా' యనుపేరున భాషాంతరము నందినది.

ఘోర్ వంశము, ౧౧౫౩-౧౨౦౬:—పండ్రెం డవ శతాబ్దపుటంత్యభాగమున మహమ్మద్ ఘోర్ అను వీరుని యాధిపత్యమున మహమ్మదీయులు మనదేశముపై దండెత్తివచ్చి చౌహాణ, పాల, సేనవంశీయులగు రాజుల

నెల్ల జయించి యుత్తరదేశము నాక్రమించిరి. పిమ్మట నీ మహమ్మదు సుల్తానయ్యెను. ఈతనివద్ద ననేకులను తురుష్క బానిస లుండిరి. వీరికెల్లరకు నీసుల్తాను చక్కనివిద్యను నేర్పించి రాజ్యాంగనిర్వహణమునందును వారిని నిపుణులుగ నొనర్చెను.

బానిసవంశము, ౧౨౦౬-౧౨౯౦:—మహమ్మద్ ఘోర్ మరణించినపిమ్మట నాతనిబానిసలలో నగ్రగణ్యుడగు కుతుబ్ ఉద్దీన్ అనునాతడు హిందూదేశము నాక్రమించి ఢిల్లీనగరమునుండి స్వతంత్రపాలనమును సాగించెను. ఇంతటినుండియు ఢిల్లీసుల్తానులపాలన మారంభమయ్యెను. కుతుబ్ ఉద్దీను కొన్నిమశీదులను గట్టించియుండినను విద్యావిషయమునం దితడు విశేషాదరమును జూపిన ట్లగపడదు. అంతియకాక, యీతని సేనానులలో నగ్రగణ్యుడగు భక్తియార్ ఖిల్జీ తనవిజయయాత్రలలో, దేశీయవిద్యాసంస్థలకు నిరుపమమగు వినాశమును చేకూర్చెను. బీహారురాష్ట్రమునందలి బౌద్ధవిద్యాలయరాజములగు నాలందా విక్రమశిలా విశ్వవిద్యాలయము లితనిచే నిర్మూలింపబడినవి. మహమ్మదీయులు బౌద్ధభిక్షువులను చిత్రవధ గావించియు, గ్రంథాలయముల నగ్నిహోత్రప్రీతి గావించియు, కట్టడములను బడగొట్టియు ననేకవిధముల విధ్వంసము గావించిరి. వంగరాష్ట్రమునందలి నవద్వీపవిద్యాలయముగూడ నిదే యవస్థకు లోనయ్యెను.

కుతుబ్ ఉద్దీనునకు బిమ్మట నీవంశీయులలో అల్ ఏమిష్, బాల్ బన్, రెజియా, నాజిరుడ్డీన్ అను

వారలు విద్యాప్రియులై యుండి విద్య ననేకవిధముల బోషించిరి. భారతరాజ్ఞీమణులలో పేరెన్నికగాంచిన రెజియాబీగము పెక్కుమందివిద్వాంసుల కాశ్రయ మొసంగెను. ఈమె ఢిల్లీనగరమునం దొకకళాశాలను నిర్మించెను. అనంతరము ఢిల్లీసింహాసనము నధిష్ఠించిన నాజిరుద్దీను మహావిద్వాంసుడై యుండెను. ఈతడు మహారాజపదమున నుండియు స్వయముగ ననేకగ్రంథములను రచించి వాని విక్రయమూల్యమువలననే తనజీవితమును గడపుచుండెను. జలంధర్ నగరమునం దీత డొకకళాశాలను గట్టించెను. సుల్తాన్ బాల్బన్ కాలము విద్యాచరిత్రమునకు మిగుల ముఖ్యమైనది. పర్షియాదేశమునుండి ప్రాణరక్షణార్థమై పారివచ్చిన రాజన్యులకు, వారితో నేతెంచిన కవిపండితాదులకు ననేకుల కీతడు శరణ మొసంగెను. కాన ఢిల్లీనగరమునం దొకనూతనోత్తేజనము గల్గెను. విద్వాంసులు, విద్యాకలాపములు నచ్చట సామాన్యములైనవి. యువరాజగు మహమ్మద్ ఆకాలమున మహాపండితుడని పేరుగాంచెను. ఆత డీవిదేశములనుండి యేతెంచిన విద్వాంసులను, భారతదేశమున పేరెన్నిక గాంచిన యితరులను రాజధానీనగరమునకు రావించి యచ్చట నొకవిద్వత్సమాజము నేర్పరచెను. ఈవిధమున నీతని యాదరసన్మానములను బడసినవారిలో "అమీర్ ఖుస్రూ, అమీర్ హస్సన్" అనుపండితు లగ్రగణ్యులు.

ఖిల్జీవంశము, ౧౨౯౦ - ౧౩౨౦ :— ఈ వంశీయుల పరిపాలనకాలమున ఢిల్లీనగర మొకగొప్పవిద్యా

కేంద్రముగ నుండెను. ఈవంశీయులలో విద్యావిషయమున పేరొందదగినసుల్తాను లిర్వురు. జలాలుద్దీను కాలమున విద్వాంసులను రావించి వారల కనేకవిధములగు వినోదములను గల్పించుట రాజాస్థానమున కొక ముఖ్యకర్తవ్యముగ నుండెను. ఈసుల్తాను ఢిల్లీనగరమునం దొకగ్రంథాలయమును నిర్మించెను. సయ్యద్ మాలా యనుపండితు డీతనియాదరమును బడసి రాజధానీనగరమునం దొకసారస్వతసమాజమును (Literary Society) నిర్వహించుచుండెను. జలాలుద్దీనునకు బిమ్మట రాజ్యమునకు వచ్చిన "అల్లాఉద్దీన్" సుల్తానునకు విద్యావాసన తక్కువగ నుండెను. ఈతడు స్వస్థానరక్షణమునందును, రాజ్యవిస్తరణమునందునే తనశక్తిసామర్థ్యములను వినియోగించి విద్యావిషయమున నిర్లక్ష్యమును, ద్వేషమునుగూడ వహించియుండెను. ఎల్లర ననుమానించుట, స్వాహంకారము, నితరులను చులకనచేయుట మున్నగుదుర్గుణము లీతనికి సహజముగ నుండినవి. దానంజేసి విద్వాంసు లనేకు లీతనికి దూరముగ నుండిరి. తనవిజయయాత్రలకై విశేషముగ ద్రవ్యము గావలసియుండుటచే నీసుల్తాను విద్యాసంస్థలకును, విద్వాంసులకును దనపూర్వు లొసంగియుండిన భరణములను, వసతులను వారినుండి తప్పించి తనవశము చేసికొనెను. అయినను చిత్రమేమన, రాజింత విద్యాపరాఙ్ముఖుడుగ నుండిన యీకాలముననే విద్య దేశమున విశేషముగ విస్తరించెను. ఇంతకుబూర్వము సుల్తాన్ బాల్బన్ కాలమునం దీదేశమున కేతెంచినపండితు లిచటనే స్థిరపడిరి. కాన నీకాలమునకు వారిప్రతిభ దేశ

మునం దంతటను వ్యాపించుటచే నసేక లీపండితుల గృహములకు గుమిగూడుచుండిరి. అల్లాయుద్దీనుకాలమున రాజాస్థానము లొనర్పవలసిన విద్యావ్యాపనము నీపండితగృహములు చేయుచుండినవి. అదియునుగాక విజ్ఞానచంద్రికలను వెదచల్లు సారస్వతసమాజము లనేకము లాకాలమున ఢిల్లీనగరమునం దుండినవి. కాన నీకాలమునం దనేకప్రబంధములును, మతము, వేదాంతము, చరిత్రము, వ్యాకరణము మున్నగు విషయములకు సంబంధించిన గ్రంథము లనేకములును రచింపబడినవి. సుల్తానుగౌరవాదరములను బడయజాలని విద్వాంసు లనేకులు సామంతులచేతను, రాజోద్యోగులచేతను బోషింపబడుచు విద్యను వ్యాపింపజేయుచుండిరి.

తుగ్లక్ వంశము, ౧౩౨౦-౧౪౧౪:—ఖిల్జీవంశీయులలో కడపటివాడగు ‘ ముబారక్ ’ యొక్క నీతిబాహ్యమగు ప్రవర్తనమువలనను, దాత్కాలిక రాజకీయ విప్లవములవలనను ననేకులగు విద్వాంసులు రాజధానిని విడిచిపోయిరి. “ ఘయాసుద్దీన్ ” తుగ్లక్ రాజ్యమునకు వచ్చినపిమ్మట కొంతశాంతి చేకూరినది. కాని యతని యనంతరము ఢిల్లీసింహాసనము నధిష్ఠించిన మహమ్మద్ కాలమున తిరిగి యుపద్రవములు జరగినవి. అల్లాఉద్దీన్ ఖిల్జీ విద్యయెడ నిరాదరమును జూపినగూడ నాతనికాలమున వైదుష్య మభివృద్ధినం దెనని యిదివరలో చెప్పబడియున్నది. ఈ మహమ్మద్ తుగ్లక్ స్వయముగ మహావిద్వాంసుడై పండితపక్షపాతియై యుండినను గూడ నీతనికాలము విద్వాంసుల కపాయకర

ముగనే యుండెను. ఈసుల్తానుపిచ్చిచేష్టలను పైశాచిక క్రోధజ్వాలలను దాళజాలక పండితులనేకులు పలాయితులైరి. అయిన నీతనివైదుష్యము సర్వతోముఖముగ నుండెను. కవిత్వమునందును, చరిత్రమునందును, తర్కమునందును, వైద్యశాస్త్రమునందును ఈసుల్తానున కెక్కుడభిరుచి యుండెను. ఈతని ధారణాశక్తి నిరుపమము.

మహమ్మద్‌కు పిమ్మట ఫిరోజ్ షా సుల్తానయ్యెను. మహావిద్వాంసుడు, రసజ్ఞుడు నగు నీతడు విద్వత్సమ్మానార్థమై ప్రత్యేకముగ నొకభవనమును గట్టించెను. విద్యానిలయముల యభివృద్ధికిని, పండితులయొక్కయు, విద్యార్థులయొక్కయు భరణములకొరకును ప్రతివత్సరము నీసుల్తాను కోశాగారమునుండి ముప్పదియారులక్షల టంకములు వ్యయపరుపబడుచుండెడివి. రాజాంతఃపురమునందలి పదునెనిమిది వేలబానిసలకు నీతడు విద్యనేర్పించి, వారలనుపరిశ్రమలందును, కొరాన్ గ్రంథమునకు ప్రతులను వ్రాయుటయందును నిపుణుల నొనర్చెను. ఈసుల్తానుచే నూతనముగ నిర్మింపబడిన "ఫిరోజాబాద్" నగరము సర్వవిద్యలకును కేంద్రస్థానముగ నుండెను. అనేకములగు పాఠశాలలు, కళాశాలలు నీతనిచే నుద్ధరింపబడినవి. కవులను, తత్త్వజ్ఞులను దేశమునందలి వివిధరాష్ట్రముల కేగి ప్రజలకు జ్ఞానదానము నొనర్ప నీసుల్తాను నియమించుచుండెను. ఈతడు నిష్పక్షపాతియై హిందూవిజ్ఞానము నెడగూడ నెక్కుడుగౌరవమును చూపుచుండెను. ఈతనియాజ్ఞచే నొకజీర్ణదేవాలయమునుండి యనేక హిందూగ్రంథము లుద్ధరింపబడి పర్షియనుభాషలోనికి

పరివర్తింపబడినవి. ఇట్టియుదారబుద్ధిగల సుల్తాను స్వీయ చరిత్రమునుగూడ రచించెను. విద్యాసంపదగల్గియు దారిద్ర్యదుఃఖముచే బీడింపబడుచుండెడివా రందరును ప్రభుత్వాదరణమునకు పాత్రులుగ నుండవలెనని యీ సుల్తాను శాసించియుండెను.

లోడీవంశము, ౧౪౫౦-౧౫౨౬:— తుగ్లక్ వంశీయులకు పిమ్మట ౧౪౧౪-౧౪౫౦ ల నడుమ "సయ్యద్" వంశీయులు రాజ్యమేలియుండిరి. విద్యాచరిత్రమునకు వారిపరిపాలనకాలము నిరుపయోగమగుటచే నిచట విడువబడినది. లోడీవంశీయులలో రెండవవాడగు సికందర్ రాజ్యకాలము మిగులముఖ్యమైనది. ఈతని కవితాశక్తి శ్లాఘనీయముగ నుండెడిది. రాజధాని యాగ్రానగరమునకు మార్పబడుటచే నానగరము ప్రధాన విద్యాస్థానముగ నుండెడిది. తనసైనికనియోగమునందుండినవా రెల్లరును రణనీతిశిక్షితులుగ నుండవలెనని యీ సుల్తాను శాసించెను. తాత్త్వికవాదముల నాకర్ణించుటయం దీతనికి శ్రద్ధ మిక్కుటముగ నుండెను. ఈతనికాలమున హిందువులుగూడ పర్షియనుభాష నభ్యసించుచుండిరి. సుల్తానుకీర్తి దూరదేశములకుగూడ వ్యాపించుటచే పర్షియా, అరేబియా, బొఖారా మున్నగుదేశములనుండి యనేకమందివిద్వాంసు లీతని యాస్థానమున కేతెంచి యుద్గ్రంథములను రచించుచుండిరి.

ఇంతవరకును ఢిల్లీసుల్తానుల పరిపాలనకాలమున వారియాదరగౌరవములచే నభివృద్ధినందిన విద్యావైదుష్యములచరిత్రమును వర్ణించియుంటిమి. ఈకాలమున

చిన్న చిన్న సంస్థానము లనేకములు ప్రబలియుండినవి. వానిపాలకులుగూడ విద్యాభివృద్ధికై యనేకవిధముల గృషిసల్పియుండిరి. కాన నాచరిత్రమునుగూడ పరిశీలింపవలసియున్నది.

బహమనీరాజ్యము, ౧౩౪౭ - ౧౫౨౬:— బహమనీసుల్తానులలో రెండవవాడగు మహమ్మద్‌షా పర్షియను అరబ్బీభాషలలో నిర్దుష్టమగు కవిత్వమును చెప్పగల్గియుండెను. గుల్‌బర్గా, బీదర్, ఎల్లిచ్‌పూర్ మున్నగు నగరములం దితడు పెక్కువిద్యాలయముల నేర్పరచి విద్యార్థులకు వసతులను, భోజనసదుపాయములను ఏర్పరచెను. అనంతరము పేరొందినవాడు సుల్తానుఫిరోజ్ షా బ హ మ నీ. ఆకాలపుచరిత్రకారుల వ్రాతలనుండి యీతడు బహుభాషాభిజ్ఞుడనియు, నంతఃపురస్త్రీలతో బండ్రెండుభాషలలో సంభాషించుచుండెడివాడనియు దెలియుచున్నది. విదేశములకు నౌకలనంపి యచ్చటి సుప్రసిద్ధులగు విద్వాంసులను రావించి యీతడు వారివలన వృక్షశాస్త్రము, రేఖాగణితము (Geometry). తర్కము మున్నగునభిమానవిద్యలను నేర్చుచుండెను. జ్యోతిశ్శాస్త్రాభినిరతుడగు నీరాజు దౌలతాబాదునం దొకజ్యోతిర్దర్శనశాలను (Observatory) నిర్మించెను. రెండవమహమ్మద్‌షా యను మరియొకసుల్తానుకాలమున మహమ్మద్‌గవాన్ అనునొకమంత్రి విద్యావ్యాప్తికై విశేషముగ పాటుపడెను. బీదర్‌నగరమునం దొకకళాశాలయు, దానికిజేరి ౩౦,౦౦౦ గ్రంథములుగల యొక విశాలభవనము నీతనిచే నిర్మింపబడినవి.

ఢిల్లీసుల్తానగు మహమ్మద్ తుగ్లక్ కాలమున హాస్సన్ అనువానిచే నీబహమనీరాజ్యము నిర్మింపబడెను. ఇందలి మొదటి సుల్తానులు కాకతీయాంధ్రసామ్రాజ్యము నకు రాజధానియై విశ్వవిఖ్యాతి నందియుండి క్రీ. శ. ౧౩౨౩లో మహమ్మదీయులకు వశమై తన యౌన్నత్య మును గోలుపోయి నామావశేషమై యుండిన యేక శిలానగరమును (Warangal) సాధించుటకై యత్నించిరి. అనంతర మీబహమనీరాజ్యమునకును, హైందవ స్వాతంత్ర్యసంరక్షణదీక్షాబద్ధమై తుంగభద్రాతీరమున బయల్వెడలిన విజయనగరసామ్రాజ్యమునకును ఎడతెగని పోరాటము సంభవించినది. ఈయుద్ధములలోనెల్ల బహమనీసుల్తానులు వర్ణనాతీతమగు క్రౌర్యమును చూపియుండిరి. ప్రజాసామాన్య మనేకకష్టములకు లోనయ్యెను. ఈసుల్తానులు దక్కనునందు హిందువులను నిర్మూలించుటకును, లేనిచో వారలనెల్ల మహమ్మదీయులుగ మార్చుటకును అనేకవిధముల ప్రయత్నించియుండిరి.* పాలకు లెల్లరును విషయలోలురై యుండిరి. అందుచే నీకాలమున విద్యావైదుష్యములు విశేషముగ నభివృద్ధినందుట కవకాశము లేకుండినది.

బిజాపురరాజ్యము, ౧౪౯౦-౧౬౮౬:—బహమనీ రాజ్యపతనానంతరము యూసఫ్ ఆదిల్షాయనునాత డీ బిజాపురరాజ్యమును స్థాపించెను. న్యాయమునకు, సత్ప్రవర్తనమునకు నీత డాదర్శప్రాయుడుగ నుండెననియు, సంగీతసాహిత్యములయం దభిరుచి గలిగియుండెననియు

---

*Smith—Oxford History of India, P. 284.

ఫెరిష్టాయను చరిత్రకారుడు వ్రాసియున్నాడు. పర్షియా, టర్కీస్థానము, రూమ్ మున్నగు దేశములనుండి విద్వాంసులను రావించి యీతడు వారిని తనయాస్థానమున బోషించుచుండెను. యూసఫ్‌నకు బిమ్మట రాజ్యమునకు వచ్చిన ఇస్మైల్ షా గుణశీలములలో దండ్రిని బోలియుండెను. బిజాపురమున నీతనిచే నొకచక్కని గ్రంథాలయము నెలకొల్పబడెను. ఈవంశమునందలి నాల్గవ సుల్తానగు "ఆలీఆదిల్ షా" కాలముననే చరిత్రప్రసిద్ధమగు తళ్లికోట యుద్ధమును, విజయనగరాంధ్రసామ్రాజ్య పతనమును జరగినవి. బిజాపురపాలకులలో కడపట పేరొక్కనదగిన సుల్తాను రెండవఇబ్రహీం. ఈవంశీయులు హిందూ రాజ్యములలో నగ్రగణ్యమగు విజయనగర సామ్రాజ్య నాశమునకు కారకులైయుండినను, వీరిపరిపాలనమున హిందువులు సౌఖ్యము ననుభవించి యనేకముగ రాజకీయోద్యోగములనుగూడ చేయుచుండిరి. ఈసుల్తానుల పరిపాలనకాలము విశేషముగ విజయనగరాధీశులతో బోరుటయందే వినియోగింపబడుటచే విద్యావైదుష్యము లభివృద్ధిజెందుటకు వలనుపడకుండినది.

గోల్కొండరాజ్యము:—ఈ రాజ్యము నేలిన సుల్తానులలోనెల్ల ముఖ్యుడగు కులీకుతుబ్ షా యను నాతడు హైదరాబాదునగరమున 'చార్ మినార్' అను భవనమును గట్టించి యందొకకళాశాలను స్థాపించెను.

బంగాళారాజ్యము, ౧౩౮౦-౧౫౭౬ :—విద్యా చరిత్రమున కీబంగాళారాజ్యవృత్తాంతము మిగుల ముఖ్య

మైనది. ఇతర మహమ్మదీయరాజ్యములందువలె నిచ్చటను రక్తపాతములును, హత్యలును సర్వసామాన్యములుగనే యుండినను, ఇచ్చటిసుల్తానులు వంగసంస్కృత వాఙ్మయములకు చక్కని ప్రోత్సాహము నొసంగియుండిరి. ఘియాసుద్దీనను ప్రతినిధిపాలకుడు ౧౩౬౦ ప్రాంతమున లక్ష్మణావతీనగరమునం దొకకళాశాలను నిర్మించి, యందు విద్యావ్యాసంగము జేయుపండితులకు వేతనముల నేర్పరచెను. నాసిర్ షాయనునొకసుల్తాను దేశీయమగు వంగభాష ననేకవిధముల ప్రోత్సహించి సంస్కృత భారతము నాభాషలోనికి బరివర్తింపజేసెను. విద్యాపతి యను వంగకవి యీసుల్తాను ననేకవిధముల నొని యాడియున్నాడు. రెండవఘియాసుద్దీన్ కాలమున వాల్మీకిరామాయణము బంగాలీభాషలోనికి దర్జుమాచేయ బడెను. హుస్సేన్ షా భాగవతపురాణమును మాలాధర్ బాసు యనుపండితునిచే బరివర్తింపజేసెను. పరాగల్ ఖాన్ అను నీసుల్తాను సేనాని కవీంద్రపరమేశ్వరుడను పండితునిచే శ్రీమహాభారతమునకు మరియొకయనువాదమును వ్రాయించెను. దీని నీసేనానితనయుడు శ్రీకర్ణనంది యనుమరియొక విద్వాంసునిచే బూర్తిచేయించెను. ఈవిధమున వంగరాష్ట్రమున మహమ్మదీయపాలకులు హిందూవాఙ్మయమునెడ గౌరవాదరములనుజూపి, ప్రజోపయోగార్థమై దానిని దేశభాషలోనికి బరివర్తింపజేసిరి. ఇయ్యది కడుశ్లాఘ్యమగు విషయము.

క్రీ. శ. ౧౦౦౦-౧౫౨౬ సంవత్సరముల నడుమ మహమ్మదీయుల పరిపాలనమునందలి భారతీయ విద్యా

చరిత్రమును సంక్షేపముగ వర్ణించియుంటిమి. ఈ కాల మున విద్వాంసులును, విద్యాపోషణాభినిరతులును అగు ఫిరోజ్ షాతుగ్లకువంటి సుల్తాను లెందరోయుండిరి. రాజాదరణము లేకుండినను సామంతులయొక్కయు, ప్రజాసామాన్యముయొక్కయు సమాదరణముచే నీకాల మున విద్య యభివృద్ధి నందుచుండె ననుటకు అల్లా యుద్దీన్ ఖిలీపాలనకాలమె తార్కాణము. ఢిల్లీ, ఆగ్రా, ఫిరోజాబాద్, బిజాపురము, జునాపూర్, బీడర్ మున్నగు నగరములు విద్యాకేంద్రములుగ నొప్పి నవి. మఖ్ తాబ్ లను పాఠశాలలును, మద్రసాలను కళా శాలలును, పండితుల గృహములును, ప్రధాననగరము లందలి విద్వత్సమాజములును దాత్కాలిక విద్యాసంస్థ లలో నగ్రగణ్యములు. పాలకుల వైదుష్యమూర్ఖ్యములే విద్యాభివృద్ధికిని, క్షైణ్యమునకును గారణములై యుండి నవి. ఈకాలపు హిందూవిద్యాస్థితిని గూర్చిన ప్రశంస యైనను మహమ్మదీయచరిత్రకారుల వ్రాతలలో గాన రాకున్నది. అందుచే నుత్తరాపథమున బంగాళమున దక్కనితరరాష్ట్రములందలి హిందూప్రజ లాత్మరక్ష ణమునకే తమశక్తినంతయు వినియోగించి యథాసాధ్య ముగ బూర్వవిద్యావిధానమును సాగించుకొనుచు, నపూర్వములగు గ్రంథముల నెటులైనను మహమ్మ దీయులవారిని పడకుండునటులు సంరక్షించుకొను చుండిరని స్పష్టమగుచున్నది. ఈకాలపు హిందూ

వైదుష్యమును దెలిసికొనుటకు దక్షిణాపథచరిత్రమే శరణ్యము. అచ్చటనే కాకతీయవిజయనగరాంధ్ర సామ్రాజ్యాభిరక్షితమై ప్రాచీనహైందవవిజ్ఞానదీపిక వెలుగుచుండినది.

*　　*　　*　　*

ఐదవ అధ్యాయము

[ఆధారములు

Eliott—History of India.

Law—Promotion of Learning in Mahomadan times.

Kennedy—History of the Great Moguls.

Aiyeen—i—Akbari.]

మొగలుయుగము

(౧౫౨౬ - ౧౭౬౧)

క్రీ. శ. ౧౫౨౫-వ సంవత్సరమున దౌలత్ ఖాన్ అను సామంతుడు ఢిల్లీసుల్తానగు ఇబ్రాహీంలోడీయధికారమును ధిక్కరించి కాబూల్ దేశపుపాలకు డగు బేబర్ సహాయము నభ్యర్థించెను. కాని కాబూలీదేశమునకు వచ్చినవెంటనే దౌలత్ ఖాను వారిపై నెదురుతిరిగెను. గత్యంతరములేక నాసమయమున స్వదేశమునకు మరలినను బేబరు తిరిగి ౧౫౨౬ లో హిందూదేశముపై దండెత్తివచ్చెను. అప్పు డితనికిని సుల్తాన్

ఇబ్రహీంనకును పానిపట్ వద్ద నొకయుద్ధము జరగి యందు బేబరు విజయము నందెను. అనతికాలముననే ఢిల్లీ, ఆగ్రానగరము లాతనికి స్వాధీనము లైనవి. ౧౫౩౦ నాటికి బేబరున కుత్తరహింమాస్థాన మంతయు స్వాధీన మయ్యెను. ఇంతటితో భారతదేశమున మొగలు సామ్రాజ్యోదయ మయ్యెను. ఈ సామ్రాజ్యము రెండు శతాబ్దములకాలము వర్ధిల్లినది. ఈ కాలమున భారత దేశమునందు చాల మార్పులు గల్గినవి. ఇప్పటికే మహమ్మదీయపరిపాలనము ననుభవించి యందలి బాగోగులను జవిచూచిన హిందువులు దమయాచారవ్యవహారముల యం దవసరములగు మార్పులను గల్పించుకొని తమ జాతీయజీవితమును బునరుద్ధరించుకొన బ్రయత్నించు చుండిరి. మొగలుచక్రవర్తు లందరును చక్కని విద్వాంసులును, రసజ్ఞులునునై యుండుటచే హైందవ విజ్ఞానము కొంచెము తలయెత్తికొనుట కవకాశ మొదవెను. అప్పటి మహమ్మదీయు లనేకులు సంస్కృతమును, హిందువులు పర్షియనుభాషను నేర్చికొని యాయాసారస్వతము లందలి విశేషములను గ్రహింప బ్రయత్నించుచుండిరి. అక్బరుకాలమున హిందూమతమునకుగూడ మంచిదినములు వచ్చినవి. దానజేసి దేశమునందలి యన్నివిజ్ఞానములకును నూతనోత్తేజము గల్గినది. పారశీకసంస్కృతభాషాసమ్మిశ్రేణమువలన నుర్దూభాష వెలువడి నూతనగ్రంథరచనమునకు గారణ మయ్యెను. విద్వాంసులును, గవులునేకాక శిల్పి, గాయక, చిత్రకార, లేఖకాదివివిధకళాభిజ్ఞులుగూడ

రాజాదరణమును బడసి యనేకవిధముల దమనైపుణ్యా మును వ్యక్తీకరించిరి.

మొగలుల కాలమునగూడ మక్తాబులును, మద్రసాలును ముఖ్యములగు విద్యాసంస్థలుగ నుండినవి. ఔరంగజేబు పాదుషా తప్ప ఇతరు లందరును నిష్పక్షపాతబుద్ధితో విద్యాదాదరణము నొనర్చుటచే నీకాలము భారతవిద్యాచరిత్రమున కనూల్యమగు భూషణము. మనుపటివలెనే యొక్కొక పాదుషాకాలపు విద్యాచరిత్రము నీక్రింద సంక్షేపముగ జేర్కొనబడుచున్నది:

జేబరు, ౧౫౨౫ - ౧౫౩౦:—ఈతడు ప్రశంసనీయమగు విమర్శనాశక్తిని, పర్షియన్, అరేబియన్, తుర్కీ భాషలలో నద్వితీయమగు పాండిత్యమును గలిగి యుండెను. తుర్కీ భాషలో నీతడు పెక్కు కావ్యములను, ఛందశ్శాస్త్రము నొకదానిని రచించెను. సంగీతమునను, ధర్మశాస్త్రమునను గూడ నీతనిచే రచింపబడిన గ్రంథములు గలవు తనజీవితమునందలి వివిధ విషయముల నుల్లేఖించుచు నీతడు వ్రాసిన స్వీయచరిత్రము చరిత్రమునకును, వాఙ్మయమునకును మిగుల ముఖ్యమైనది. నిరాడంబరమును, స్వాభావికము నగుశైలి యాతని గద్యపద్యములకు గల ముఖ్యలక్షణము. నూతనమగు నొకఛందస్సును, మరియొక యపూర్వలిపియు నీతనిచే గనిపెట్టబడినవి. చిత్రలేఖనమునగూడ జేబరున కభిరుచి మెండుగ నుండెడిది. ఈ పాదుషా విద్వాంసుల సమావేశములందును, గ్రంథాలయములందును విశేషకాలమును గడపుచుండెను

హుమయూన్, ౧౫౩౦-౧౫౫౬ :— ఈతడు చక్కని విద్వాంసుడు. జ్యోతిష,భూగోళశాస్త్రముల యం దభిరుచి గల యీచక్రవర్తి స్వోపయోగార్థము భూగోళఖగోళములకు ప్రతికృతులను (Globes) నిర్మించుకొనెను. జాతకభాగమునం దీతనికి ప్రబలమగు విశ్వాస ముండెడిది. పంచభూతములయొక్క తత్త్వమును విమర్శించుచు నితఁ డొక గ్రంథమును రచించెను. తన దర్శనమొనర్చి తన యాదరమును బడయ నేతెంచువారల నెల్ల రనీతడు కొన్ని తరగతులుగ విభజించి యందు విద్వాంసులకు మతప్రచారకుల తోడను, ధర్మశాస్త్రజ్ఞులతోడను సమముగ నగ్రస్థానము నొసంగెను. ఖగోళమునందలి గ్రహములపేరిట దివ్య భవనములను నిర్మించి యీ చక్రవర్తి శనిగురువుల భవనములలో విద్వత్సమ్మానము నొనర్చుచుండెను. యుద్ధరంగముల కేగునపుడును, దుదకు ప్రాణములకై పరుగెత్తునపుడునుగూడ నీతడు గ్రంథములనుమాత్రము విడువకుండెనట. దీనినుండి యీతనికి గల విద్యాపిపాస వ్యక్తమగుచున్నది. ఈచక్రవర్తి నిర్మించిన విద్యానిలయములలో ఢిల్లీనగరమునందలి కళాశాలయు, ఆగ్రానగరమున కెదురుగ యమునాతీరమునందలి మరియొక విద్యాలయమును ముఖ్యములు.

అక్బరు, ౧౫౫౬-౧౬౦౫:—సదసద్వివేకియు, దయాస్వాంతుడును,సరసుడునునగు నీచక్రవర్తి పరిపాలన కాలము చంద్రగుప్త, అశోక, కనిష్క, శ్రీహర్షాది హైందవరాజన్యుల పరిపాలన కాలమున కెనయై భారత దేశచరిత్రమునకు వెలలేనిరత్నమై యొప్పుచున్నది.విద్యా

పోషణమునం దీతడు మహామ్మదీయపాలకులలో నెల్ల నగ్రగణ్యుడు. సర్వతోముఖమగు నీతని పాండితీసమాదరణము నిష్పక్షపాతముగను, గుణప్రధానముగను ఒప్పినది. అన్ని మతములను, వాఙ్మయములను నీతడు శ్రద్ధతో బరిశీలించి సమ్మానించుచుండెను. ప్రతిదినమును నిదురించుటకుపూర్వ మీత డుద్గ్రంథములను వినుచుండెను. ఈచక్రవర్తి తాను నూతనముగ నిర్మించిన ఫతేపూర్ సిక్రీ యను రాజధానీనగరమున "ఇబాదత్ ఖానా" యనునొకభవనమును గట్టించెను. ఈత డందలి పశ్చిమభాగమున సయ్యదులను మతగురువులను, దక్షిణమున ఉలేమాలను విద్వాంసులను సమ్మానించుచుండెను. ఆది శుక్రవారములందును, పుణ్యదినములలో రాత్రులందును చక్రవర్తి, మహమ్మదీయమత ప్రచారకులను, ధర్మశాస్త్రవేత్తలను, బ్రాహ్మణులను, జైనులను, బౌద్ధులను, చార్వాకులను, పారసీకులను, క్రైస్తవులను సమావేశపరచి వారివారి మతములనుగూర్చి విశేషాంశములను దెలిసికొనుచుండెను. ఇచ్చట నట్టిసమయములలో జరగుచుండిన వివాదములలో జక్రవర్తి తానును బాల్గొనుచుండెను. ఈ పాండితీప్రదర్శనమునం దగ్రగణ్యులుగ నిర్ణయింపబడినవారల కీతడు "అష్రఫీ"లను బంగారునాణెములను దోసెళ్లతో నిచ్చి బహూకరించుచుండెను.

అక్బరు ప్రేరేపణచే సంస్కృతమునుండియు, నితర భాషలనుండియు ననేకగ్రంథములు పర్షియను హిందీ భాషలలోనికి బరివర్తింపబడుచుండెడివి. ౧౫౮౨-వ సంవత్సరమున మహాభారతము 'రాజంనామా' యను

పేరిట పర్షియనులోనికి తర్జుమాచేయబడెను. ఆగ్రంథమునకు చక్రవర్తి అబుల్ ఫజుల్ అను సుప్రసిద్ధ చరిత్రకారునిచే టీకను వ్రాయించి దానిప్రతులను ధనసామంతులందరును గొనునటు లాజ్ఞాపించెను. అబ్దుల్ ఖ్వాదిర్ అను నతఁడు రామాయణమును, ఇబ్రహీం సర్‌హిందీ యనునతఁ డథర్వవేదమును, ఫైజీయనునాతఁడు లీలావతియను జ్యోతిష గ్రంథమును, షాహబాదీయను నతఁడు రాజతరంగిణిని భాషాంతరీకరించిరి. అటులనే హరివంశపంచతంత్రములును, నలదమయంతియను కావ్యమును పర్షియనులో వ్రాయబడినవి. 'సింహాసనబత్తీసి' యను బౌద్ధగ్రంథమును, కిషన్ జోషి, గంగాధర, మహేశ్ మహానంద యనుసంస్కృతగ్రంథములును, బైబిలుగ్రంథమును, బేబరుచక్రవర్తియొక్క చరిత్రమును, తారీఖ్ ఇ ఆఫీఫ్ అను మరియొకచరిత్రమునుగూడ బరివర్తనము నందినవి.

తాను స్వయముగ సేకరించియు, నితరులనుండి సంపాదించియు నక్బరుచక్రవర్తి యనేకపుస్తకములను గూర్చి యొక చక్కని భాండాగారమును నిర్మించెను. ఈతనికి చిత్రలేఖనమన నెక్కుడు ప్రీతి. ఈతని చిత్రశాలలలో ననేకులు పనిచేయుచుండిరి. వీరిలో నెక్కుమంది హిందువు లుండిరి. వీరిచే రాజబంధువులయొక్కయు, ప్రధానోద్యోగులయొక్కయు చిత్రములనేకములు తయారుచేయబడినవి. సుప్రసిద్ధగాయకులనేకులు చక్రవర్తియాదరమును బడసిరి. రామదాసు, హరిదాసు ననుహిందువులు వారిలో ముఖ్యులు.

'అయినీ అక్బారీ'యనుచరిత్రమునుంశి యక్బరు కాలమునందలి విద్యావిధానమునుగూర్చి కొన్ని విశేషాంశములు దెలియుచున్నవి. మతభేదములను పాటింపక చక్రవర్తి యెల్లవిద్యల నాదరించుచుండెను. పాఠశాలలో హిందూమహమ్మదీయబాలురు కలసియే చదువుచుండిరి. ఒక్కొకరికిని తగనవిద్యాప్రణాళిక లేర్పరుపబడియుండినవి. విద్యార్థికి మనోవికాసమును గల్గించుటయేకాక ఆతనికి భావిజీవితసమస్యల నెదుర్కొనుశక్తినిగూడ గల్పించుట విద్యావిధానముయొక్క పరమావధియని యాచక్రవర్తి నిశ్చయించెను. ఇంతకుబూర్వము బాలురు సుమారు నాల్గుసంవత్సరములకాలమును అచ్చులను, హల్లులను నేర్చుటయందు వ్యర్థపరచుచుండిరి. దీనిని మార్పుచేసి యక్బరు వార లాకాలమున జదువుట, వ్రాయుట, గద్యపద్యములను మనోగతముల జేసికొనుట, నీతి, మతము మున్నగువి శేషాంశములను గ్రహింపగల్గునటు లేర్పరచెను. విద్యనభ్యసించుటలో విద్యార్థియే మిగుల గష్టపడవలెననియు, నుపాధ్యాయుడు కేవలమును మార్గదర్శిగనే యుండవలెననియు నక్బరుచక్రవర్తి తలంచెను. పైవిధమున ప్రారంభవిద్య ముగిసిన పిమ్మట బాలురకు గణితము, రేఖాగణితము, వ్యవసాయము, జ్యోతిషము, రాజ్యాంగము, వైద్యము, తర్కము, చరిత్రము మున్నగునవి నేర్పబడుచుండెడివి. హిందూబాలురు వేదాంతమును, పాతంజలిమహాభాష్యాంతము వ్యాకరణమును జదువుచుండిరి. అటుపై మున్నతవిద్యాభ్యాసమునుగోరువారలు ఫతేపూర్ సిక్రీ, ఢిల్లీ, ఆగ్రా మున్నగువిద్యాక్షేత్రస్థానముల కేగుచుండిరి.

తాత్కాలికవిద్యావిధానము నిటుల సంస్కరించుటయేకాక చక్రవర్తి యనేకస్థలముల విద్యానిలయములను నెలకొల్పెను. ఆతని దాదియగు మహాన్ అన్గ యనునామె ఢిల్లీలో నొక కళాశాలను నెలకొల్పెను. మంత్రియగు బైరంఖాను, నాతని తనయుడగు అబ్దుల్ రహీమును మహావిద్వాంసులుగ నుండి చక్కనిగ్రంథాలయమును నిర్మించిరి.

రాజకీయమునందువలెనే విద్యానిర్వహణమునగూడ అక్బరుచక్రవర్తిపరిపాలనము సర్వజనసమ్మతమై యపూర్వశోభావంతమై యుండినది. నాలుగైదు శతాబ్దములనుండి యణగద్రొక్కబడి నామావశేషముగ నుండిన హిందూవైదుష్యము ఈచక్రవర్తిపరిపాలనమున దిరిగి వెలయెత్తసాగినది. హిందువులును, మహమ్మదీయులును పరస్పరద్వేషములను వీడి రాజధర్మము ననుగమించి సౌహార్దముతో మెలగుటజేసి వారలనాగరికతలు నూతనోత్తేజనము నందినవి.

జహంగీరు, ౧౬౦౫-౧౬౨౭:—ఈచక్రవర్తి రాజకీయములందువలెనే విద్యావిషయముననుగూడ తన తండ్రియగు అక్బరుచక్రవర్తిమార్గము ననుగమించెను. ఈతని శీలము విషమముగ నుండెననియు, నీత డొకప్పుడతిక్రౌర్యమును, మరయొకసమయమునం దతిదయను జూపుచుండెననియు చరిత్రము దెల్పుచున్నది. అదృష్టవశమున విద్యావిషయము లీతని యత్యంతాదరమును బడసినవి. సహజముగ నీతనికి పర్షియను, తుర్కీభాషలలో జక్కనివైదుష్య ముండెను. ఈతనిస్వీయచరిత్రమునుండి

యీతని విద్యాభినిరతియు, లలితకళలయందలి యభిరుచియు దెలియుచున్నవి. దాయాదులు లేక మరణించిన ధనికులయొక్కయు, యాత్రికులయొక్కయు సర్వస్వమును ప్రభుత్వమునకే జెందవలెననియు, నయ్యది విద్యాలయోద్ధరణార్థ ముపయోగింపబడవలెననియు నీ చక్రవర్తి శాసించెను. "ఫర్‌హన్గి జహాంగీరి" యను నొకనిఘంటువు నీతడు తయారుచేయించెను. లలితకళలయెడ నీచక్రవర్తికిగల యభిమానము వర్ణనాతీతము. ఈతడు తనయాస్థానపు ప్రతికృతిని సుప్రసిద్ధులగు చిత్రకారులచే వ్రాయించి దానిని తనస్వీయ చరిత్రమునకు ముఖపత్రముగ వేయించెను. ఈతని పోషణమునం దుండిన దేశీయచిత్రకారులు పాశ్చాత్య చిత్రములకుసహితము మాతృకలను మరపింపజేయునంతటి చక్కని ప్రతికృతులను తయారుచేయ సమర్థులై యుండిరి. అబుల్‌హస్సన్, మన్సూర్ అనువారలప్పటి చిత్రకారులలో సుప్రసిద్ధులుగ నుండిరి. ఈ చక్రవర్తికాలమున నిర్మింపబడిన దివ్యభవనములందలి శిల్పము చక్రవర్తియుద్దేశ్యము ననుసరించియే నిర్మింపబడినది. ఆగ్రానగరమునందలి ఇతిమాదుద్దౌలా సమాధియు, సికందరనగరములోని అక్బరుసమాధియు, లాహోరునగరమునందలి యీచక్రవర్తిసమాధియు నీతని కళాభిజ్ఞతకు ప్రబలనిదర్శనములు.

షాజహాన్, ౧౬౨౭ - ౧౬౫౮ :— షాజహాన్ చక్రవర్తిస్వభావమునుగూర్చి చరిత్రకారులలో నభిప్రాయభేదములు గలవు. విన్సెంటుస్మిత్తుపండితు డీచక్రవర్తి మఃకోపియనియు, నతిక్రోధమును అతి

దయను జూపుచుండెననియు, విషయలోలుడుగ నుండె ననియు వ్రాసియున్నాడు. ఎల్ఫిన్‌స్టన్ మున్నగు నితరులు షాజహాను దయాళు డనియును, మహనీయు డనియును వ్రాసియున్నారు. ఏది యెట్లున్నను విద్యా విషయమునం దీచక్రవర్తి యొనర్చిన విశేషకార్యము లేమియు లేవు. బాద్‌షానామా, ముంతఖాబుల్ లుబాబ్ అను రెండు చరిత్రములుమాత్ర మీతని ప్రోత్సాహముచే లిఖింపబడినవి. ఢిల్లీనగరమున జుమ్మా మసీదు నొద్ద నొకకళాశాలగూడ నీతనిచే నిర్మింపబడెను. ఈచక్రవర్తికి గానమునెడను, శిల్పమునెడను బ్రీతి యెక్కువ. ఈత డాదరించినగాయకులలో రామదాస్, మహాపత్తార్ అను హిందువులు ముఖ్యులు.

షాజహాన్ కాలమునం దాతనితనయుడగు దారా మిగుల బ్రసిద్ధిచెందిన పండితుడుగ నుండెను. పర్షియన్, అరబిక్, సంస్కృతభాషలలో నీతనిపాండిత్య మద్వితీయమైయుండెను. సంస్కృతవాఙ్మయము, హిందూ విజ్ఞానము నీతడు విశేషముగ బ్రేమించుచుండెను. ఈయువరాజు మణిఖచితములగు దనయంగుళీయకములపై 'ప్రభు' యనుపదమును చెక్కించుకొనెనట. కాశీనగరమునుండి సుప్రసిద్ధులగు పండితులను రావించి వారి సాహాయ్యముచే నీతడు ఉపనిషత్తులను, భగవద్గీతను, యోగవాసిష్ఠమును పర్షియనుభాషలోనికి బరివర్తించెను. హిందూమతమును, సూఫీమతమును సరిపోల్చుచు నీతడు రచించిన విమర్శనము మిగుల ప్రశంసనీయము.

ఔరంగజేబు, ౧౬౫౮-౧౭౦౭ :— షాజహాను కాలమునను మొగలుసామ్రాజ్యము సర్వవిషయములను

బరమావధిని గాంచినది. ఆతనితనయుడగు ఔరంగజేబు మహాపరాక్రమశాలియు, రాజనీతిజ్ఞుడును నై యుండినను మతావేశపిశాచమునకు లోనయ్యెను. దేశమునం దధిక సంఖ్యాకులుగ నున్న హిందువుల యాదరసౌఖ్యముల పైననే మొగలుసామ్రాజ్యసౌధము నిర్మింపబడవలెనను నక్బరుచక్రవర్తియాదర్శమును, హిందువులయెడ నాతడు చూపిన మతసహిష్ణుతయు, వారివిజ్ఞానమున కాత డొసంగిన ప్రోత్సాహమును ఔరంగజేబుచే తారుమారుచేయబడినవి. తనసామ్రాజ్యమునం దెల్లరును సున్నీమతానుయాయులుగ నుండవలెననియు, రాజ్యాంగమంతయు ఖొరానునందలి విధుల ననుసరించియే నిర్వహింపబడవలెననియు నీతడు కృతనిశ్చయు డయ్యెను. ఈ యాదర్శముల నీత డాచరణలోనికి దెచ్చుట హిందువులకకాలప్రళయ మొదవినటు లయ్యెను. ఈచక్రవర్తి యాగ్రహము హిందూదేవాలయములపైనను, హిందూ విజ్ఞానము పైనను బ్రసరించెను. దానజేసి ౧౬౬౯ లో నీతనియాజ్ఞచే హిందూవిద్యానిధానములగు దేవాలయము లెన్నియో నాశమొనర్పబడినవి. అందు కాశీక్షేత్రమునందలి విశ్వనాథాలయమును, మధురాక్షేత్రమున రాజావీర్ సింగుచే ముప్పదిమూడులక్షలు వ్యయపరచి కట్టింపబడి, సుందరశిల్పములలో నద్వితీయమని పేరెన్నికగాంచిన కేశవదేవాలయమును ముఖ్యములు. రాష్ట్రీయపాలకులందరకును హిందువుల యాలయములను, విద్యాలయములను ధ్వంసముచేయునటు లాజ్ఞయొసంగబడెను. ఢిల్లీసుల్తానులకాలమున వారిక్రౌర్యమున కోర్వజాలక మారుమూలల దాగి యజ్ఞాతవాస

మొనర్చుచుండి యక్బరు జహంగీరు చక్రవర్తుల సహిష్ణుతాబుద్ధిచే బునర్జీవమునంది దన యసమానశోభావైభవములచే వారిమన్ననను, ప్రోత్సాహమును బడసి నూతన వికాసము నందుచుండిన హిందూవిజ్ఞానవల్లిక యౌరంగజేబు పైశాచికమతావేశముచే సమూలముగ ఛేదింపబడెను. ఈసందర్భమున నెందరో పండితులును, ఎన్నియో గ్రంథములును నశించియుండినవి. కాన హిందూ విద్యాచరిత్రమున నౌరంగజేబురాజ్యకాలము మహాదౌర్భాగ్యము నొనగూర్చిన యంధకారయుగము. ఆతని యీ దుష్ప్రవృత్తిచే మొగలుసామ్రాజ్యనాశమునకు ప్రథమసోపాన మేర్పడుటయేకాక హిందూవాఙ్మయమునకును, నాధునిక భారతీయసారస్వత గౌరవమునకును తీరనిలోటు సంభవించినది.

చక్రవర్తిమతావేశము హిందూవిద్య కెంతకీడును గల్గించెనో మహమ్మదీయవిద్య కంత యభ్యుదయమును చేకూర్చెను. అనేకస్థలముల నితడు పాఠశాలలను, కళాశాలలను నిర్మించి సుప్రసిద్ధపండితుల నం దుపాధ్యాయులుగ నియమించి వారికిని విద్యార్థులకును గూడ వేతనములను, భరణములను నేర్పరచెను. ఫిరోజ్ షా తుగ్లక్ వలె నీతడును బానిసలయుద్ధరణమునకై పాటుపడెను. గుజరాత్ దేశమునందలి బోహ్రా లను బానిసలకీతడు విద్య నేర్పించెను. ఈతనికాలమున పాదుషాల గ్రంథాలయమున కెన్నియోగ్రంథములు చేర్పబడినవి.

అక్బరుచక్రవర్తివలె నీతడుగూడ దాత్కాలిక విద్యావిధానమున ననేకములగు మార్పులను జేయిం

చెను. విద్యావిషయమునం దీతనికిగలయభిప్రాయములు గొన్ని మిక్కిలి కొనియాడదగియున్నవి. మేధాశక్తిని మాత్రము పెంపొందించు వ్యాకరణతత్త్వశాస్త్రములకు సామాన్యవిద్యాప్రణాళికయం దంతప్రాముఖ్య ముండరా దనియు, ప్రపంచజ్ఞానము నభివృద్ధిపరచుచరిత్రము, భూగోళము, భాషలు మున్నగువానిలో ప్రత్యేకబోధన మవసరమనియు నీతడు దలంచెను. జీవితరంగమునందలి వివిధసమస్యల నెదుర్కొని వానిని జయప్రదముగ దాటుట కవసరమగుపాటవము నిచ్చుచు, భావిజీవితమున ప్రతివారును దామూనుకొను వృత్తులతో సన్నిహితమగు సంబంధమును గల్గియుండువిద్యయే పాఠశాలలో బోధింపబడవలసిన విద్యయని యాతడు ప్రతిపాదించెను.

ఔరంగజేబు ప్రబలమగు మతావేశమును, వైరాగ్యమును గల్గియుండెను. నిరాడంబరమగు జీవితమును, నిరంతరాధ్యాత్మికచింతనమును జీవితపరమావధు లను ఖురానువాక్యముల నీత డాచరణలోనికి దెచ్చెను. దానజేసి యీతడు మొగలులయాస్థానమున స్థిరముగ నాటియున్న యాడంబర, శృంగార, రాజసచిహ్నములగు లలితకళలను, శిల్పమును, గానమును, అలంకారములను దూరముగ దరిమివైచెను. ఇంతవరకును రోజున కొక మాదిరి నూతనకావ్యాభరణములతో, మురియుచు, ఘడియ కొకనూతనగీతిక నాలాపించుచు, దినదినము నొక్కొక నూతనశిల్పనాట్యమునొనర్చుచుహిందూవాఙ్మయమోహ యనుంగుచేడియవలె వెంటరా, విశ్వమోహనగతులను విహరించుచుండిన మొగలుసామ్రాజ్యరమణి హఠాత్తుగ

సర్వనాశమునంది పాలకునివలెనే పరివ్రాజికావస్థ నంది నిస్తేజయయ్యెను.

కడపటి మొగలులు, ౧౭౦౭ - ౧౭౬౧:— మొగలుసామ్రాజ్యము వాస్తవముగ నౌరంగజేబుతోడనే యస్తమించెను. ఆతనియనంతర మాతనిపుత్రులు సింహాసనమునకై తగవులాడి యొకరికంఠముల నింకొకరు త్తరించుకొనుచుండ సామంతులును, శత్రువులును వివిధ రాష్ట్రములను వశపరచుకొనిరి. నామమాత్రావశేషులగు నా కడపటిమొగలులు లెటులో మరియరువది సంవత్సరములకాలము తమ జీవితములను సాగించిరి. ఔరంగజేబునకు పిమ్మట రాజ్యమునకు వచ్చిన యాతని పెద్ద కుమారుడగు బహదూర్‌షాకాలమున ఢిల్లీ మున్నగు నగరములలో విద్యాలయము లెన్నియో యుండెడివి. పిమ్మట మహమ్మద్‌షాకాలమున జయపుర రాజపుత్ర సంస్థాననిర్మాత యగు రాజా జయసింగ్ జయపూర్, ఉజ్జయిని, మాల్వా, మధుర, కాశీ, ఢిల్లీ మున్నగు స్థలముల జ్యోతిర్దర్శనశాలలను (observatories) గట్టించెను. ఈకాలమున పర్షియాదేశపాలకుడగు నాదిర్షా భారతదేశముపై దండెత్తివచ్చి మొగలుల స్వాతంత్ర్యమును, విశేషధనరాసులను గొనిపోయెను. ఇటు లీ దేశమును బాసిపోయిన యమూల్యవస్తువులలో మొగలు చక్రవర్తుల గ్రంథాలయము మిగుల ముఖ్యమైనది.

స్త్రీవిద్య:— ఈ మొగలుచక్రవర్తుల పరిపాలన కాలమునందలి విద్యాచరిత్రమును ముగించుటకు పూర్వమాకాలమునందలి స్త్రీలవైదుష్యమును సంక్షేపముగ బరిశీలింపవలసియున్నది. పర్‌దానియమమునకు లోనై

మహమ్మదీయవనితలును, మానభంగశంకచే హిందూస్త్రీ
లును నిరంతరము నంతఃపురములనే తమజీవితములను
గడపుచుండిరి. బాల్యమునమాత్రము వారలు పాఠ
శాలలలో చదువుచుండిరి. యౌవనప్రాదుర్భావమే వారి
వైదుష్యమునకు భరతవాక్యముగ నొప్పుచుండెడిది.
మహమ్మదీయపాలనమును విశేషముగ నెరుంగక ప్రాచీన
హిందూమతాచారవ్యవహారముల కాలవాలమైయుండిన
రజపుత్రస్థానమునందును, సుచిరకాలము స్వాతంత్ర్యము
ననుభవించి హిందూమతోద్ధరణదీక్షితులగు రాజన్యు
లచే పాలింపబడిన దక్షిణాపథమునను మాత్రము హిందూ
స్త్రీలున్నతవిద్య నభ్యసించి సుప్రసిద్ధ విదుషీమణులని
ప్రసిద్ధి గాంచిరి.

మహమ్మదీయకాంతలలో గూడ వైదుష్యమును
సంపాదించినవార లుండినటులు చరిత్రము తెల్పు
చున్నది. ఢిల్లీ సింహాసనము నధిష్ఠించిన రమణీమణియగు
రెజియాబీగము చక్కనివిద్యావతి. మాల్వారాజ్యపరి
పాలకుడగు సుల్తాన్ ఘీయాసుద్దీను తన యంతఃపుర
స్త్రీలకు విద్యనేర్పుటకై యుపాధ్యాయినుల నేర్పర
చెను. బాబరుచక్రవర్తికూతు రగు గుల్బదన్ బేగం
హుమాయూన్ చరిత్రమును రచించెను. హుమాయూన్
మేనకోడలగు నొకస్త్రీ పర్షియనుభాషలో చక్కని
పద్యములను రచించెను. అక్బరుచక్రవర్తి దాదియగు
మెహన్ అన్గయనునామె విద్యావతి. ఈచక్రవర్తి ఫతే
పూర్ సిక్రీలోని తనరాజభవనమునందలి కొన్నిభాగ
ముల నంతఃపురస్త్రీల విద్యాభ్యాసమునకై ప్రత్యే
కించెను. జహంగీర్ పత్నియగు నూర్జహానుకు అరబిక్,

పర్షియనుభాషలలో నిర్దుష్టమగు పాండిత్య ముండె డిది. షాజహాన్ భార్యయగు మంతాజ్ మహాళ్ పర్షియనులో చక్కనిగీతములను వ్రాయుచుండెను. ఈ చక్రవర్తికూతురగు జహనార బేగముకూడ చక్కనివిదుషీ మణియైయుండెను. ఔరంగజేబు తన తనయయగు జేబున్నీసాకు స్వయముగ విద్యనేర్పి యామె నొక సుప్రసిద్ధవిదుషీమణిగను, జక్కనిలేఖరిగను ఒనర్చెను.

* * * *

ఆరవ అధ్యాయము

[ఆధారములు

Mahmood—History of English Education in India.

Mayhew—The Education of India.

Satyanadhan—History of Education in the Madras Presidency.

Trevelyan—Education of the people of India.

Bureau of Education, India—Selections from Educational Records 2P,ts.

Report of the Calcutta university Commission quinquinnial reports on Indian Education Report of the Indian Education Commission, 1883.

బ్రిటిష్ పరిపాలనము

క్రీ. శ. ౧౭౦౭ లో ఔరంగజేబుమరణమువరకును గల విద్యాచరిత్రమును వెనుకటిప్రకరణములో వర్ణించియుంటిమి. అప్పటినుండి క్రీ. శ. ౧౮౧౩ వరకును భారతదేశచరిత్రము వివిధపరివర్తనముల నందెనది. ఈకాలమున ఢిల్లీ సింహాసనము నధిష్ఠించిన మొగలు చక్రవర్తు లందరును దుర్బలులును, నప్రయోజకులును నగుటచే నరాజకము చెలరేగె. నూతనరాజవంశములు బయల్వెడలినవి. పంజాబులో సిక్కులును, డక్కనులో మహారాష్ట్రులును విజృంభించిరి. దక్షిణమున మైసూరు, నైజాంరాజ్యములు బయల్వెడలినవి. మహారాష్ట్రు లుత్తరదక్షిణముల ననేకవిజయముల నంది యేకచ్ఛత్రాధిపత్యమును వహింపనున్న కాలమున బశ్చిమమునుండి అహమ్మదుషాదురానీ భారతదేశముపై దండెత్తి వచ్చెను. ౧౭౬౧ లో పానిపట్టువద్ద నొకగొప్ప యుద్ధము జరిగె నందు మహారాష్ట్రులోడిపోయిరి. అనతికాలమునకే దురానీ స్వదేశమునకు మరలెను. అప్పుడు భారతదేశము దిక్కులేనిదివాణమువలె నుండెను. ఈక్లిష్టసమయమున వర్తకులుగ నీదేశమున బ్రవేశించి క్రమక్రమముగ రాజకీయముల జోక్యము గల్గించుకొనుచుండిన యాంగ్లేయులు విజృంభించిరి.

క్రీ. శ. ౧౬-వ శతాబ్దిలోనే పాశ్చాత్యులీదేశమున కేతెంచిరి. మొగలుచక్రవర్తులకాలమున వారు వివిధభాగములలో వసతుల నేర్పరచుకొని ప్రబలుచుండిరి. పోర్చుగల్, హాలండు, ఫ్రాంసు,

ఇంగ్లండు మున్నగుదేశములనుండి యిటకువచ్చిన యీ విదేశీయులు తరచుగా దమలోఁ దాము పోరాడుచుండిరి. ౧౮-వ శతాబ్దమున నింగ్లీషువారును, ఫ్రెంచివారును ప్రతిపక్షులుగ నుండిరి. వర్తకసంబంధములగు తాత్కాలికకారణములనుబట్టియు, మాతృదేశములలో జరుగుచుండిన పోరాటములనుబట్టియు, నీదేశమునగూడ నీయిర్వురకును యుద్ధములు జరగుచుండినవి. ఇంతియకాక ఈపాశ్చాత్యులు దేశీయపాలకుల వ్యవహారములలో గల్పించుకొని దన్మూలమున గొంతలాభమును బొందుచుండిరి. ౧౭౬౧ నాటికి బెంగాలులోను, దక్షిణమునను గూడ నాంగ్లేయులు ఫ్రెంచివారి నణగద్రొక్కిరి. ౧౭౬౩ లో జరగిన బక్సరుయుద్ధములో విజయమునందుటతోడనే వారును భారతదేశరాజకీయాధికారమునకు ముఖ్యప్రత్యర్థులుగ నిలచిరి. అనతికాలమునకే వీరిపరిపాలనలోనుండినభాగములకొరకై యొక ప్రత్యేకపరిపాలనావిధాన (Regulating Act) మేర్పరుపబడినది. ౧౯౦౦ నాటికి దక్షిణమున మహారాష్ట్రులు, నుత్తరమున సిక్కులునుదప్ప నాంగ్లేయులకు శత్రువు లెవరును లేకుండిరి. మొదట వీరిదేశమున వర్తకముజేసికొనుటకై వారియేలికవద్దనుండి యొకయాజ్ఞాపత్రమును బడసి East India Company అనుపేర నొకవర్తకసంఘముగ నీదేశమున కేతెంచిరి. అప్పుడప్పుడీపత్రము సంస్కరింపబడుచుండినది, ౧౯-వ శతాబ్దమున నాంగ్లేయుల రాజకీయాధికారము వృద్ధిజెందినప్పటినుండియు మాతృదేశమునుండి యొకగవర్నరుజనరలు బంపబడుచుండెను.

౧౮౧౮ నాటికి మైసూరురాజ్యమును, మహారాష్ట్రములనుగూడ నాంగ్లేయులకు లొంగుటయు, కంపెనీవారు బలాత్కారముగ కొన్ని రాజ్యముల నాక్రమించుటయు జరగినవి. ఇంతటితో వీరు భారతభూమి కేలికలైరి. ఇటనుండి ౧౮౫౭ వరకును కంపెనీవారి యభ్యుదయ మప్రతిహతముగ నడచినది. ఆ సంవత్సరమున "సిపాయీలవిద్రోహ" మని ప్రఖ్యాతిగాంచిన మహావిప్లవము బయల్వెడలి దేశమునందల్లెడల నల్లకల్లోలము గావించినది. తుదకు కంపెనీవారు దీనిలో జయమునందినను, ఆంగ్లదేశప్రభుత్వమువారు భారతదేశప్రభుత్వముకంపెనీవారికి తలకుమించినపనియని నిశ్చయించి, దానిని దామే నిర్వహింపసమకట్టిరి. విక్టోరియామహారాజ్ఞి ప్రకటనతో ౧౮౫౮-వ సంవత్సరమున భారతదేశమునం దాంగ్లరాజుల పరిపాలన మారంభమయ్యెను.

(౧) ౧౮౩౩ వరకు — కంపెనీవారి పరిపాలన కాలమున విద్యావ్యాపనమునకై చేయబడిన మొదటి ప్రయత్నములలో మతప్రచారము చేయునుద్దేశ్యము కన్పించుచున్నది. వీరికి ముందుగనే యిచటికిజేరిన క్రైస్తవమతస్థులు దేశీయులు కొందరికి రోమనుకాథలిక్ దీక్ష నొసంగిరి. వీరిని మరియితరులను స్వీయమగు ప్రొటెస్టెంటుమతమునకు మార్చుటయే కంపెనీవారి ప్రథమోద్దేశ్యము. ౧౭౪౩ లో మదరాసులోని సెంటుజార్జికోటయందలి బాలబాలికల విద్యాభ్యాసమునకై లూయిస్ అనునతడు రెండుపాఠశాలలను స్థాపించెను.

బెల్ అనునతడు ఎగ్మూరులో నింగ్లీకవిద్యాశాలను నెల
కొల్పెను. త్వరలోనే క్రైస్తవమతప్రచారకులయాజ
మాన్యమున కడలూరు, తిరుచునాపల్లి, తంజావూరులలో
పాఠశాలలు బయల్వెడలినవి. అప్పటియధికారులకు
దేశీయు లాంగ్లవిద్యను నేర్చినచో తెలివిమీరి తమయధి
కారమును ధిక్కరింతురనుభయముగూడ నుండినది.

కొంతకాలమునకుబిమ్మట ననగా ౧౮-వ శతా
బ్దాంత్యభాగమునకు దమవ్యవహారములను నిర్వహింపగల
దేశీయు లవసరమైరి. అప్పుడు వారు విధిలేక ౧౭౮౧
లో కలకత్తాలోను ౧౭౯౧ లో కాశీలోను, ౧౮౨౧
లో పూనాలోను విద్యాశాలలను నిర్మించి, వానికై
యొకలక్షరూపాయలను వ్యయపరచుటకై నిశ్చయించిరి.

ఈకాలమున మహనీయులుకొందరు విద్యావిష
యమున కృషిచేసిరి. అట్టివారిలో సుప్రసిద్ధదేశభక్తుడగు
రాజారామమోహనరాయ లగ్రగణ్యుడు. ఈస్ట్ అను
నాంగ్లేయుని తోడ్పాటుతో నాయన వంగదేశమున
౧౮౧౭ లో Central Hindu College ని స్థాపింప
జేసెను. ౧౮౪౦ ప్రాంతమున మదరాసులో పచ్చ
యప్పపాఠశాలలు నెలకొల్పబడినవి.

(౨) ౧౮౩౩-౫౩ — ౧౮౩౩లో కంపెనీవారికొసం
గబడినకొత్తయాజ్ఞాపత్రమున, భారతీయవిద్యాభివృద్ధికై
పదిలక్షలరూపాయలనువినియోగింపవలసినదనిశాసింపబడి
నది. అంతట దేశీయులకు నేర్పవలసినవిద్య యెట్టిదిగ
నుండవలె ననుసమస్య యేర్పడి, వాదోపవాదములు
బయల్వెడలినవి. ఇందు దేశీయుల కాంగ్లవిద్యను నేర్ప

వలెనా, దేశీయవిద్యను నేర్పవలెనా? అట్టివిద్య యాంగ్ల భాషలో బోధింపబడవలెనా, లేక దేశభాషలలోనా? దేశభాషలకు ప్రభుత్వము ప్రోత్సాహ మొసంగవలెనా? అనునవి ముఖ్యాంశములు. ఈవిషయమగుచర్చ సుమారు పం్రెండుసంవత్సరములకాలము జరగి తుదకు ౧౮౩౫ లో ముగిసినది. ఈచర్చలలో బాల్గొనినవారిని రెండు తెగలుగ విభజింపవచ్చును.—(౧) ప్రాచ్యవిద్యావాదులు, (౨) పాశ్చాత్యవిద్యావాదులు.

ప్రాచ్యవిద్యావాదులలో హెచ్. హెచ్. విల్సన్ అనునతడు ప్రముఖుడు. "ఆంగ్లభాషావాదులకు దేశీయులకుగల యవసరానవసరములు దెలియవు. వారి నిత్యకృత్యములలో నాంగ్లభాష యనవసరము. వారికి గావలసినవి దేశభాషలు, న్యాయశాస్త్రము, వ్యవహారము మాత్రమే. ఇట్టివారి కాంగ్లభాషను నేర్పినచో పాశ్చాత్యవిద్యాంసులను క్రొత్తవర్ణ మొకటి యేర్పడును. వీరి కితరదేశీయులయెడ సానుభూతి యుండ జాలదు. అదియునుగాక ప్రజాసామాన్యమున కీవిద్య దుర్లభమగును. ఏజాతికైనను స్వభాషలోదప్ప నితర భాషలలో విద్య నేర్పుటకు వీలుపడదు." అనునవి యాతని ముఖ్యాభిప్రాయములు.

పాశ్చాత్యవిద్యావాదులు పలువు రుండిరి. వారిలో కొలదిమందిమాత్రము దేశీయులపురోభివృద్ధికై యావిద్య గావలె ననిరి. ఇతరులు స్వార్థమును బురస్కరించుకొని యటులు వాదించిరి. ఈయిరుతెగలవారి యభిప్రాయములు నిట్లుండినవి:

"యువకులను దమజీవితమునం దమూల్యమగు పం(డెండుసంవత్సరముల కాలమును సంస్కృత వ్యాకరణ సాహిత్యములను జదువుచు, వ్యర్థపరచు డనుటవలన ప్రయోజనము లేదు. పాలితుల యభివృద్ధియే ప్రభుత్వాదర్శము. అందువలన గణితము, వేదాంతము, రసాయనశాస్త్రము మున్నగు వివిధవిషయములు దేశీయులకు నేర్పబడవలెను. ఇది యాంగ్లవిద్యమూలమననే సాధ్యమగును."—రాజారామమోహనరాయలు.

"విజ్ఞానమును విరజిమ్ముట మనధర్మము. దానిఫలితముతో మనకు సంబంధములేదు. పాలితులసౌఖ్యమభివృద్ధిపరచిననే మనము పరిపాలనమున కర్హులము. భావికాలమున నేమో యాపదగల్గునని నేడు విద్యను నిరాకరించుటచే మన కపకీర్తి రాగలదు"—అని బెంటింకునకుపిమ్మట ౧౮౩౫ లో గవర్నరుజనరలుగ నుండిన సర్. చార్లెస్ మెట్కాఫ్ అభిప్రాయము. రెండవతెగవారు భారతదేశమునం దాంగ్లేయులపాలనము స్థిరీకరించునుద్దేశ్యముతో నాంగ్లవిద్యను బ్రతిపాదించిరి. సర్. చార్లెస్ ట్రెవరియన్ అనునతడు "మహమ్మదీయులు ప్రపంచమంతయు తమసామ్రాజ్యమనియు, నితరమతస్థుల కందు తావు లేదనియు నమ్ముదురు. హిందువు లితరులను మ్లేచ్ఛులుగ బరిగణించి, వారికి బరిపాలనార్హత లేదని తలంతురు. అరేబికు సంస్కృతవాఙ్మయముల జదువుటచే గల్గునభిప్రాయము లిట్టివే. కాన వీనిని వదలి యాంగ్లసంపర్కాభ్యుదయములకు దోడ్పడు నాంగ్లవిద్యనే దేశీయులకు నేర్పవలె" నని వ్రాసెను. సుప్రసిద్ధాంగ్లపండితుడగు మెకాలే

యాకాలమున గవర్నరుజనరలునాలోచనాసంఘమున సభ్యుడుగానుండి యాంగ్లవిద్యావాదమున కెక్కుడు ప్రోద్బల మొసగెను. అప్పటిగవర్నరుజనరలగు బెంటింకు ప్రభువు కేవలమును రాజకీయోద్దేశ్యములతోడనే యీ వాదమును ప్రోత్సహించెను. ఆంగ్లవిద్యను నేర్పినచో దేశీయులు వేషభాషలయందును, ప్రవర్తనయందును, నాదర్శములందునుగూడ నాంగ్లేయులనే యనుకరింతురనియు, దన్మూలమున వారిజాతీయభావములు నూతన మార్గములను బట్టగలవనియు నీతడు దలంచెను.

పైచర్చనుండి, యాంగ్లవిద్య కావలెననినవారిలో పెక్కుమంది స్వార్థమును రక్షించుకొనుటకును, దేశీయులు దమపూర్వపుటౌన్నత్యమును దలంచుకొని తత్ప్రతిష్ఠాపనార్థమై తిరిగి ప్రయత్నముచేసి, యాంగ్లపాలనమున కుపద్రవము గలుగజేయకుండునటు లొనర్చుటకునై యట్లు వాదించిరని స్పష్టమగుచున్నది. ఈయాశయములే బ్రిటిష్‌పరిపాలన కాలమునందలి విద్యాచరిత్రమునకు మూలాధారములు.

(3) వుడ్ ప్రణాళిక (Wood's Dispatch)

౧౮౫౪:—పైవిద్యావిషయకముసుచర్చ ౧౮౫౩ నాటికి ముగిసినది. మరుసటిసంవత్సరమున వుడ్ అనునతడు గవర్నరుజనరలున కొకవిద్యాప్రణాళికను బంపెను. అందు దేశీయులకాంగ్లభాషను, ఆంగ్లవిద్యను గరపుట యత్యావసరమనియు, దన్మూలమున గాలక్రమమున ప్రభుత్వమున కెక్కుడులాభము గలుగుననియు, ప్రజాసామాన్యవిద్యకై యొకప్రత్యేకవిద్యాశాఖను నిర్మింపవలెననియు,

ఉన్నతవిద్యకై కళాశాలలను స్థాపింపవలెననియు, ప్రత్యేకపాఠశాలలకు (Private Schools) ద్రవ్య సాహాయ్యము చేయవలెననియు ఆవుడ్ ప్రణాళికలో వివరింపబడియుండెను. వృత్తివిద్యనుగూర్చియు, పరిశ్రమలనుగూర్చియు, స్త్రీవిద్యనుగూర్చియు నిందే ప్రశంసయు జేయబడియుండలేదు. కంపెనీవారిపరిపాలనము నకు గావలసినకార్యములను నిర్వర్తింపగల యాంగ్లవాసనగల దేశీయలేఖకులను తయారుచేయుటయే పై ప్రణాళికకు బరమావధి. దీనికిఫలితముగ బొంబాయి, కలకత్తా, మదరాసు, అలహాబాదు, లాహోరులలో విశ్వవిద్యాలయములు నెలకొల్పబడినవి. వీనికి గళాశాలలను నెలకొల్పి యందలి విద్యావిధానమును సరిచూచుబాధ్యత యొసంగబడినది.

(౪) ౧౮౫౪-౧౮౮౨:—౧౮౫౪ నుండియు వుడ్ ప్రణాళికయందలి సూచనలన్నియు నాచరణలోనికి వచ్చినవి. ఉన్నతవిద్యను నేర్చినవారలు తమంతటదామే యితరులకు విద్య నేర్పుదురనునభిప్రాయముతో ప్రభుత్వధనమంతయు రాజకీయవిద్యాలయములకొరకే వెచ్చింపబడుచుండినది. రాజకీయోద్యోగముల కాంగ్లభాషాజ్ఞానమవసరమగుటయు, విశ్వవిద్యాలయపట్టముల నందు కుతూహలము హెచ్చుటయు గారణములుగా ప్రత్యేకపాఠశాలలసంఖ్య హెచ్చినది. ౧౮౭౧ నుండియు ప్రభుత్వాదాయము తగ్గి వారిసాహాయ్యము ప్రాథమికవిద్యకే వినియోగింపబడుచుండినది. సహాయవిరాళములు (Grants-in-aid) బిగింపబడినవి. అయినను పాఠశాలలలో ప్రవేశింపగోరువారిసంఖ్య దరుగకుండుటచే వానికి

లోటు గలుగలేదు. అధికసంఖ్యాకులకు స్థాన మిచ్చి తమయార్థికస్థితి నభివృద్ధిచేసికొని యీపాఠశాలానిర్వాహకులు ప్రభుత్వవిరాళమును లక్ష్యముచేయక, పట్ట పరీక్షలపైననే తమదృష్టిని కేంద్రీకరించి విద్యార్థులను తయారుచేయుచుండిరి.

విశ్వవిద్యాలయములు స్థాపింపబడినమాత్రమున కళాశాలల వైదుష్యమునం దెట్టిమార్పును గలుగలేదు. విశ్వవిద్యాలయసంఘములలో (Senate) రాజకీయ వేత్తలు మున్నగునుపాధ్యాయేతరు లెక్కువగ నుండిరి. అందుచే విద్యావిషయములన్నియు జడీకృతములయినవి. కళాశాలలకు సోపానములగు నున్నతవిద్యాలయములును బైయవస్థనే యనుభవించుచుండినవి. వీనిపై నపు డిర్వురుయజమాను లధికారము సేయుచుండిరి. పరీక్షలవిషయమున విశ్వవిద్యాలయములును, ద్రవ్యవిషయముల బ్రభుత్వవిద్యాశాఖయు బాఠశాలాధికారులపై దరచుగా దండెత్తుచుండినవి. రాజాదరణ మక్కర లేనివారు విశ్వవిద్యాలయనియమములను, విద్యాశాఖానియమములనుగూడ లక్ష్యము సేయకుండిరి.

(౨) హంటరువిద్యాసంఘము, ౧౮౮౨:— ఇట్టి విద్యావిధానమును సంస్కరించుమార్గముల నేర్పరచుటకై ప్రభుత్వమువారీసంఘమును నియమించిరి. ఇం దిరువదియొక్కరు సభ్యు లుండిరి. వీరికి గొన్నిసూచనలు చేయబడినవి. ఇది వానిసారాంశము: (౧) ప్రాథమిక విద్య ప్రజాసామాన్యమున కుపయోగించునదిగావున దానికే ప్రాముఖ్యమొసంగబడవలెను. (౨) పాఠ

శాలలకు స్థానికసంఘములు గొంతవరకును సాయము చేయవలెను. (3) శ్రీమంతులు బీదవిద్యార్థుల కుచిత వేతనముల నీయవలెను. (౪) దేశీయవిద్యాలయ ముల నభివృద్ధిపరచవలెను. (౫) పాఠశాలాపరీక్షావిధా నమునందలి లోటుపాటులు చక్కపడవలెను. (౬) విశ్వవిద్యాలయములతో నీసంఘములకు సంబంధము లేదు.

ఇట్టిసూచనలను గైకొని ౧౯3 వ్యక్తులను, సంఘ ములను బరిశీలించి హంటరుసంఘమువారు కొన్నితీర్మాన ములను గావించిరి:

(౧) పండితులతోడను, మౌల్వీలతోడను సంప్ర తించి ప్రభుత్వమువారు దేశీయవిద్యాలయములకు సాయ పడవలెను. ఇందలి యుపాధ్యాయులు శిక్షణమునందుట (Training) మంచిది. వీనిపోషణమును ముఖ్యముగ స్థానికసంఘములు వహింపవలెను.

(౨) ప్రారంభవిద్యాశాలలకు ప్రభుత్వమువా రొసంగువిరాళములు, పరీక్షాఫలితములను బట్టి నిర్ణ యింపబడవలెను. గణితము, ప్రకృతిభౌతికశాస్త్రములు, వ్యవసాయము, పరిశ్రమలు మున్నగునవిగూడ వీనిలో చేర్పబడవలెను. అధికారులు బాలురశీలముపై నొక కన్నుంచవలెను.

(3) ఉన్నతవిద్యాలయములలో విశ్వవిద్యా లయప్రవేశమునకు పనికివచ్చున దొకటియు, వెంటనే వృత్తిజీవనమున బ్రవేశించుట కుపయోగపడునదొకటియు రెండుతరగతు లుండవలెను. గ్రంథాలయములను, బల్లలు కుర్చీలు మున్నగువానిని సంపాదించుటకై పాఠశాలలకు

సాంవత్సరికవిరాళము లొసంగబడవలెను. స్థానికులసహకారము నన్నివిధముల బ్రోత్సహించు టావశ్యకము.

(౫) విద్యాశాఖాధికారియు, బరీక్షకవర్గమును దరచు కలసికొనవలెను. రివిన్యూయుద్యోగులు దమపరిసముల నుండుపాఠశాలలను బరీక్షించి విద్యాశాఖకు దెలియజేయవలెను. పఠనీయగ్రంథసమితులను నెలకొల్పు టత్యావశ్యకము.

(౬) మహమ్మదీయులకొరకును, స్త్రీలకొరకును బ్రత్యేకములగు నేర్పాటులను గావించి, స్త్రీలు విశేషముగ నుపాధ్యాయులుగ వచ్చునట్లొనరింపవలెను.

(౭) ప్రతిపాఠశాలయు విద్యార్థుల సౌకర్యమునకై వసతిగృహముల నేర్పరుపవలెను.

(౮) ౧౮౮౨-౧౮౮౬:—ఇది పైహంటరుసంఘతీర్మానము లాచరణలోనికి వచ్చినకాలము. స్థానికసంఘములకీయబడిన స్వాతంత్ర్యమువలన బ్రయోజనమేమియు లేకుండినది. ప్రాథమికపాఠశాలలసంఖ్య తగ్గెను. ఉన్నతవిద్యయే ప్రధానముగుటచే మాధ్యమికపాఠశాలలు (Middle Schools) గూడ క్షీణించినవి. తాత్కాలికగౌరవమునుబట్టియు, ద్రవ్యము నార్జింప నెంచియు యాదృచ్ఛికపాఠశాల (Venture Schools) లెన్నియో బయల్వెడలినవి. శిక్షితులగు బోధకులును, చక్కనివేతనములును, తగినస్థలమును వీనియం దరుదుగ నుండినవి. విశ్వవిద్యాలయములును, విద్యాశాఖయు వీనిని నియమింపజాలకుండినవి.

హంటరుసంఘమునకు విశ్వ విద్యాలయములతో నేవిధమగుజోక్యమును లేకుండుటచే నయ్యవి యథాపూర్వముగ నుండినవి. వీనిసంఘములలో ననర్హు లెందరో యుండిరి. కళాశాలలపై వీని కధికారము లేకుండెను. ప్రారంభవ్యయమునుండి నిర్వాహకులు జంకుటచేతను, విద్యార్థులలో బీదరికమును, మతాచారవ్యత్యాసమును విశేషముగ నుండుటవలనను వసతిగృహములు నిర్మింపబడలేదు.

ప్రారంభవిద్యమాత్ర మించుక యభివృద్ధినందుచుండెను. ప్రభుత్వవిరాళములు సక్రమముగ వ్యయమగుచుండినవి. ఉపాధ్యాయశిక్షణార్థమై మదరాసులో నొకకళాశాల యేర్పరుపబడినది. మహమ్మదీయులను ప్రవేశపెట్టుకొను విద్యాలయములకు నూటికి ౨౫ వంతున విరాళము హెచ్చింపబడినది.

(౭) ౧౮౮౭–౧౮౯౨:—ఈ యైదు సంవత్సరములలోని విద్యాచరిత్రము నామ్నివేదికనుండి తెలియుచున్నది. విద్యాశాఖలో గొన్ని సంస్కరణములు జరగినవి. ఉపపరీక్షకులసంఖ్య హెచ్చింపబడి విద్యాశాఖాధికారుల కర్తవ్యములను దెల్పు "విద్యాస్మృతి" (Education Code) నిర్మింపబడెను. స్థానికసంఘములు ప్రారంభవిద్యకును, పురపాలకసంఘములు మాధ్యమికపాఠశాలలకును, రాష్ట్రీయకోశము లున్నత విద్యాశాలలకును సాహాయ్యము చేయవలెనను సిద్ధాంత మీకాలమునం దేర్పడెను. ఉన్నతవిద్యను మాతృభాషలో గరుపవలెనా, యాంగ్లమున జెప్పవలెనా యనుసమస్య

యీసమయమున బయల్వెడలినది. ౧౯౫౦ లో మిడిల్ స్కూల్ పరీక్ష తీసివేయబడి "లోయర్ సెకండరీ" పద్ధతి ప్రవేశపెట్టబడినది. దీనికి పైగా "అప్పరు సెకండరీపరీక్ష" యుండినది. విద్యార్థులందరును వ్యాయామమున పాల్గొనవలెనని శాసింపబడెను. బాలురశీలమునకు ప్రాముఖ్యము హెచ్చెను. ఇందులకై ప్రత్యేకముగ పుస్తకము లేర్పరుపబడినవి.

(౮) ౧౯౫౨-౧౯౫౮:—కాటన్ నివేదికనుండి యీకాలపు పరిస్థితులు దెలియనగుచున్నవి. విశ్వవిద్యాలయములు స్వయంపోషకములుగ నుండినవి. మెట్రిక్యులేషనుపరీక్ష కాంగ్లపఠనీయగ్రంథములు దీసివేయబడినవి. అప్పర్ సెకండరీపరీక్ష నిష్ఫలమగుటచే దానిని తీసివేసిరి. ఉత్తర సర్కారులలోని యుపాధ్యాయుల సౌకర్యమునకై రాజమహేంద్రవరమున బోధనాభ్యసనకళాశాల నెలకొల్పబడెను. ౧౯౫౩ లో బంధములవిద్యకై ప్రభుత్వమువారు సౌకర్యముల నొనగూర్చిరి. పాఠశాలలో ప్రవేశింపదలచువారు శీలపత్రములను(Conduct Certificate) జూపింపవలసియుండెను.

(౯) ౧౯౫౮-౧౯౬౨:—పాఠశాలల కొసంగు విరాళములు కేవలమును బరీక్షాఫలితములనుబట్టియే కాక వేతనములనుబట్టియు, శాశ్వతనిధినిబట్టియు గూడ నిర్ణయింపబడవలెనని యీకాలమున దీర్మానింపబడెను. ఆంగ్లపఠనీయగ్రంథములయావశ్యకతనుగూర్చియు చర్చలు జరగినవి. గుడ్డి, మూగ మున్నగువారలకై క్రైస్తవమతప్రచారకులు తిరునెల్వేలి, పాలంకోటలలో ప్రత్యేక పాఠశాలల నేర్పరచిరి.

(౧౦) ౧౯౦౭ నాటి విద్యాసంఘము:—ఇదివరలో నియమింపబడిన హంటరుసంఘము విశ్వవిద్యాలయములవంకకు బోలేదు. ఇందులకై ౧౯౦౭ లో నొకసంఘ మేర్పరుపబడెను. దీనిఫలితములుగ (౧) విశ్వవిద్యాలయసంఘములు సంస్కరింపబడవలెను. (౨) కళాశాలల సామర్థ్యమును నిర్ణయింప వీని కధికారమీయవలెను. (౩) ఇయ్యవి బోధనవిధినిగూడ నిర్వహించవలెను అనునీమూడుసిద్ధాంతము లేర్పడినవి.

౧౯౦౮ నాటి విద్యా-చట్టము—పై విద్యాసంఘముయొక్క తీర్మానముల నావేదించి ప్రభుత్వము వారు ౧౯౦౮ లో నొక విద్యాచట్టమును నిర్మించిరి. అది చక్కనియభ్యుదయమును సూచించునది. అందలి విషయములలో నీక్రిందివి ముఖ్యములు: (౧)ప్రభుత్వము వారు సాధ్యమగునంతవరకును విద్యాలయనిర్మాణమునకై స్థానికులను ప్రేరేపింపవలెను. వా రాదర్శపూర్వకములగు కొన్నిటినిమాత్రమే నిర్వహించి యితరవిద్యాలయములను దమయధికారులు బరీక్షించునటులు చేయవలెను. (౨) స్థానికసంఘముల విద్యావ్యయపట్టిక(Educational Budget) విద్యాశాఖవారి యనుమతిని బడయవలెను. (౩) ఆర్థికస్థైర్యము, సామర్థ్యము నుండినగాని యున్నతపాఠశాలలకు విరాళము లొసంగబడవు. పాఠశాలాంత్యవిభాగమువరకును మాతృభాషాపరిచయముండి తీరవలెను. (౪) స్త్రీవిద్య జాతీయాభ్యుదయమునకు మూలము. వారికై ప్రత్యేకపాఠశాలలు నెలకొల్పబడినవి. (౫) విదేశములకేగి విద్య నభ్యసించువారికి సౌకర్యములు గావింపబడినవి. పారిశ్రామిక, వాణిజ్య, కర్షక

విద్యాశాలలను స్థాపించుటకై ప్రయత్నము చేయబడు చున్నవి. (౬) విద్యాసామర్థ్యమున కుపాధ్యాయశిక్షణము మూలాధారము. ఈవిషయమును, పాఠశాలలందలి విద్యాప్రణాళికనుగూడ విద్యాశాఖ శ్రద్ధగా బరిశీలింప వలెను. (౭) ఈ సంస్కరణముల కన్నిటికిని పది లక్షలరూపాయలు ప్రత్యేకింపబడినవి.

(౧౧) ౧౯౧౩ నాటి విద్యావిషయక తీర్మానము:—గవర్నరు జనరలుసభలో గావింపబడిన యీ తీర్మానము మిగుల ముఖ్యమయినది. అందలి ముఖ్యాంశముల నిట్లు పేర్కొనవచ్చును: (౧) విద్యార్థుల జ్ఞానమేకాక నడవడికూడ సరిచేయబడవలెను. వసతి గృహము లీవిషయమున ముఖ్యసాధనములుగ నుండగలవు. (౨) ప్రారంభవిద్య సాధారణముగ స్థానిక సంఘములచే నిర్వహింపబడవలెను. ప్రత్యేకసంఘము (Private Associations) లున్నతవిద్యకై పాటుపడవలెను. (౩) విద్యాశాఖవారు కేవలము పరీక్షకులుగనే యుండక, తరచుగా విద్యావిషయకసభలను గావించి, పాఠశాలానిర్వాహకులకు సలహాల నొసంగుచుండవలెను. ఇందులకై మండలవిద్యాసభలు (District Educational Conferences) స్థాపింపబడవలెను.

ఈ తీర్మానమునుండి మూడు ముఖ్యాంశములు తేటపడుచున్నవి: (౧) విద్యాశాఖాధికారులు సమర్థులును, బుద్ధిమంతులును, అనుభవజ్ఞులును, సానుభూతిగలవారును నైయుండవలెను. (౨) జాతీయవిద్య యొక్క భాగస్వామ్యము. ఇందు ప్రభుత్వమును, స్థానికసంఘ

ములును, ప్రజాసంఘములును సభ్యులు. (3) పైవిద్యావిధానమున నుపాధ్యాయులు ముఖ్యులు. వారికి తగినంత ప్రోత్సాహ మొసంగబడినచో వారు తమధర్మమును ప్రీతితో నెరవేర్తురు.

(౧౨) ౧౯౧౭–౧౯౨౨:—భారతీయ విద్యాచరిత్రమున నీయైదుసంవత్సరములకాలమును మిక్కిలి ముఖ్యమైనది. ఆర్థికరాజకీయపరిణామము లెన్నియో యీకాలమున విద్యాప్రపంచమును గలంచివేసినవి. ౧౯౧౭ లో ఇండియామంత్రి క్రమపరిణామమగు స్వపరిపాలనమే (Gradual Self Government) భారతదేశమునకు పరమావధి యని చెప్పెను. దీనికి ఫలితముగ దేశమునం దొకప్రబోధము గల్గెను. జాతీయభావము ప్రబలకపోవుటకు దేశమునందలి యజ్ఞానమే కారణమని స్పష్టపడెను. అందువలన ప్రజాసామాన్యవిద్యావిషయకములగు ప్రయత్నములు చేయబడినవి. ౧౯౧౧ లో గోపాలకృష్ణగోఖ్లేగారు ప్రాథమికవిద్యా-చట్టమును సామ్రాజ్యశాసనసభలో నుపపాదించిరి. రాష్ట్రములలోఁగూడ నిట్టియత్నములు జరగినవి.

౧౯౨౦-వ సంవత్సరమున జాతీయమహాసభవారు సహాయోద్యమమును ప్రారంభించిరి. పట్టములను మాత్రము లభింపజేయు నీవిద్య నిరుపయోగ మను భావము ప్రబలినది. విద్యాలయ బహిష్కరణ మీయుద్యమమునందలి యొక ముఖ్యాంశము. ఆంగ్లవిద్యాలయములలోని సంఖ్య చాలవరకు తగ్గినది. కొన్ని మూయబడినవి. పరీక్షలుపసంహరింపబడినవి.

ఎన్నియో విద్యాసంఘములును, విద్యానివేదికలును గల్గింపజాలని విద్యాభిమానము నీయుద్యమము ప్రజలలో నతిసులభముగ గల్గించినది. ప్రభుత్వసహాకారాపేక్ష లేని జాతీయవిద్యాలయము లెన్నియో బయల్వెడలినవి.

ఇదేకాలమున జరగిన విశ్వసంక్షోభకరమగు నైరోపాసంగ్రామముగూడ దాత్కాలికవిద్యాప్రపంచమును గలత పెట్టినది. ధనాభావముచే ముఖ్యసంస్కరణము లుపసంహరింపబడినవి. విద్యాశాఖోద్యోగు లెందరో యుద్ధభూమి కేగిరి. విద్యాలయములకు వలయు బోధన సామగ్రి విదేశములనుండి వచ్చుటకు వీలుగాకుండెను. అయినను విద్యాసంస్థ లీయుద్ధమున గొంతయుపకారము జేసినవి. విశ్వవిద్యాలయములలో సంరక్షకసంఘములును (Red Cross Societies), భారతీయరక్షకబలములును (Indian DefensiveForces)స్థాపింపబడినవి.

ఈకాలమునందలి విద్యాచరిత్రమును షార్పు అనునతడు వ్రాసిన నివేదిక తెలుపుచున్నది. కళాశాలలలోనివిద్య పూర్తిగా గ్రాంథికమును, సారస్వతాత్మకమును నై యుండినది. ఉద్యోగములను సంపాదించుటయే దీనియుపయోగము. భారతీయవిద్యావిధానము "తలబరువు" గలదిగ నుండెను. ఈదేశమున పురుషులలో నూటి కయిదుమంది విద్యావంతులును, పదిమంది యక్షరజ్ఞానము గలవారును, స్త్రీలలో నూటికి ౧౪ మంది విద్య నేర్చినవారు, నొక్కరుమాత్ర మక్షరజ్ఞానము గలవారు నైయున్నారు. ధనమంతయు కొలదిమంది విద్యాధికులను దయారుచేయుటకేవినియోగపడుచున్నది.

ఉపాధ్యాయులలో సుశిక్షితులైనవారు కొలదిమంది. వారివేతనములును, దానినుండి బోధనమును గూడ నసంతృప్తికరములు. పరీక్షలు విషమములుగ నుండినవి. వీని నేవిధముననైన దాటుట విద్యార్థులకును, దాటించు టుపాధ్యాయులకును ముఖ్యాదర్శము.

(౧౩) సాడ్లరువిద్యాసంఘము, ౧౯౧౭-౧౯౧౯ :— కలకత్తా విశ్వవిద్యాలయసంస్కరణార్థమై గవర్నరు జనరలు సంఘమును నియమించెను. పాశ్చాత్యదేశములందలి యాధునికవిద్యాపరివర్తనముల నెరింగినవారు నల్వురును, భారతదేశపరిస్థితులు దెలిసినవారు ముగ్వురును ఇందు సభ్యులు. ౧౯౧౯ లో వీరు ప్రచురించిన నివేదిక యన్నివిద్యాలయములకును వర్తించును. అందలి ముఖ్యాంశములనుమాత్ర మిచట గమనింపవలసియున్నది.

ప్రస్తుత విశ్వవిద్యాలయవిద్య నిష్ఫలమగుచున్నది. ఇందు ప్రవేశించినప్రతివారు నొకేవిధమగు శిక్షణము నంది, బయటపడినతోడనే నిరుద్యోగసంఘమున జేరుచున్నారు. దినదినప్రవర్ధమానమగు నిట్టి విద్యాధికులగు నిరుద్యోగులసమూహము దేశమునకు ప్రమాదకరము. విద్యాశాలలలో సంఖ్య యెక్కువ, పాఠ్యవిషయములు తక్కువ, వైదుష్య మొకస్వప్నవార్త. విద్యార్థులశీలములవిషయమై శ్రద్ధతీసికొనబడుట లేదు. విశ్వవిద్యాలయప్రవేశపరీక్షను, ఇంటరుమీడియేటుపరీక్షను నిర్ణయించుట కొకప్రత్యేకసంఘ ముండవలెను. ఇంటరునకు బిమ్మట విద్యాభ్యాసమును మానివేయువారికి జీవనోపాధిని గల్పించు విషయములను గళాశాలలలో ప్రవేశ

పెట్టవలసి యున్నది. విశ్వవిద్యాలయముల సంఖ్య తక్కువగ నుండుటచే సమ్మర్ద మెక్కువగ నున్నది.

(౧౪) ౧౯౨౦ నాటి మదరాసు ప్రారంభవిద్యా-చట్టము:—దేశమునందలి రాజకీయాందోళనమునకును శాసనసంఘ తీర్మానములకును ఫలితముగ వివిధ రాష్ట్రములలో బ్రారంభవిద్యా-చట్టములు ప్రవేశపెట్టబడినవి. అందు మదరాసుచట్టమును సంక్షేపముగ నీ దిగువ నుదాహరించుచున్నాము:

(౧) ఈచట్టమువలన మండలవిద్యాసమితులు (District EducationalCouncils) శాశ్వతముగ స్థాపింపబడినవి. ఇందు స్థానికసంఘములయొక్కయు, నితరవిద్యావ్యాపకోద్యమముల యొక్కయు బ్రతినిధు లుందురు. అచ్చటచ్చట నుండుపరిస్థితులను బరిశీలించి సహాయవిరాళములకొరకు చేయబడు నభ్యర్థనములను విచారించి, ఉపాధ్యాయుల బాగోగులను గనిపెట్టుట వీనికర్తవ్యము. ప్రభుత్వవిరాళముల నుదారులను నితరు లొసగు ద్రవ్యమును గలసి సమితినిధి (Council Fund) యగును. స్థానికసంఘములచే విధింపబడు చదువు పన్నును, పాఠశాలల జీతములను జేరి ప్రాథమికవిద్యానిధి (Elementary Education Fund) అగును. ఈరెంటి పైనను విద్యాసమితికి అధికారముగలదు.

(౨) స్థానికసంఘములందలి సభ్యులలో 33 మంది నిర్బంధవిద్య యావశ్యకమని తలచినచో నావిధముగ నొకతీర్మానమును జేసి, మండలవిద్యాసమితులద్వారా ప్రభుత్వమునకు బంపవలెను. వా రంగీకరించినచో నయ్యది యాచరణలోనికి వచ్చును.

(3) ప్రభుత్వపాఠశాలలలో నేనిమను మతబోధయు చేయబడదు. ఇతరవిద్యాలయములలో నది చేసినను జేయకుండినను వారికి జోక్యము లేదు.

(౧౫) మాన్టుఫర్డ్ సంస్కరణములు, ౧౯౨౧:- ఈసంస్కరణములు భారతీయులకు గొంతవరకును స్వపరిపాలనాధికారము నొసంగుట కేర్పడినవి. శాసనసభా సభ్యత్వము సంస్కరింపబడి, యాసభికులలోనుండి నిర్ణయింపబడిన మంత్రివర్గమునకు గొంత యధికారమొసంగబడినది. ఈసందర్భమున విద్యాశాఖ యొక మంత్రియాజమాన్యమునకు వచ్చినది. ప్రభుత్వమువారి విద్యాశాఖాధికారి యీ మంత్రికి ప్రధానసాహాయ్యకుడు. మంత్రి శాసనసభ కుత్తరవాదిగ నుండి, విద్యావ్యయపట్టిక నందు ప్రవేశపెట్టవలసియుండెను.

ఇంతకుముందే రాష్ట్రీయప్రభుత్వముల కున్నత విద్యకొరకు గావలసిన ద్రవ్యమును సంపాదించి వ్యయపరచుట, ప్రారంభవిద్య నుచితముగ నేర్పించుట మున్నగు విషయములలో స్వాతంత్ర్య ముండినది. విశేషవ్యయములగు కార్యములకుమాత్రమే వారు కేంద్రప్రభుత్వమువారి యనుమతిని బడయుచుండిరి. ఈ సంస్కరణములమూలమున ద్రవ్యవిషయములలో వారికి పరిపూర్ణస్వాతంత్ర్యము లభించెను.

పై సంస్కరణములయొక్క మరియొకఫలితము కేంద్రమాంత్రికసంఘము (Central Advisory Board) స్థాపింపబడుట. విశ్వవిద్యాలయముల కన్నిటికిని ప్రేక్షకుడు (Visitor) గ నుండు గవర్నరుజనరలునకు విద్యావిషయములనుగూర్చి సలహానిచ్చుటయే దీని కర్తవ్యము. ఇందు విశ్వవిద్యాలయోపాధ్యక్షులును, యిర్వురు కళాశాలాధ్యక్షులును, నల్గురు విద్యాశాఖాధికారు

లును, విద్యాభిమానులగు మరినల్గురును సభ్యులు. దీనికి కేంద్రప్రభుత్వమువారి విద్యాశాఖాధికారి యధ్యక్షుడు.

(౧౮) ౧౯౨౨-౧౯౨౬:—ఈ యైదుసంవత్సరములకాలమునను విద్య చక్కని యభివృద్ధిని గాంచినది. ఐరోపాసంగ్రామఫలితమగు నార్థికబాధ తగ్గినది. అసహాయోద్యమమునందలి ధాటి తగ్గుటచే విద్యాలయములయందలి గౌరవము హెచ్చి, చాలమంది తిరిగి వానిని ప్రవేశించిరి. స్థానికసంఘము లెన్నియో ప్రజావిద్య, స్త్రీవిద్య, వ్యాయామము మున్నగువానియం దభిరుచిని జూపినవి. గ్రామపాఠశాలలసంఖ్య వృద్ధిచెందినది.

మాంటుఫర్డు సంస్కరణములవలన గల్గిన రాష్ట్రీయస్వాతంత్ర్యము మంచిదేయైనను, రాష్ట్రములలో నన్యోన్యసంబంధము తగ్గినది. ఈలోటును దీర్చుటకై ౧౯౨౪ లో నొకవిశ్వవిద్యాలయసభ జరిగినది. దీనిఫలితముగ నొక యంతర్విశ్వవిద్యాలయ సంఘము (Inter University Board) నెలకొల్పబడినది. ఉపాధ్యాయుల నొకచోటినుండి మరియొకచోటికి మార్చుట, భారతీయవిద్యాలయపట్టముల నితరదేశవిద్యాలయములవా రంగీకరించునట్లొనర్చుట, సామ్రాజ్యసభలకు, నంతర్జాతీయసభలకు, సమావేశములకును భారతీయప్రతినిధులను బంపుట మున్నగునవి యీసంఘమునకు ముఖ్యకర్తవ్యములు.

౧౯౨౨—౨౬ ల నడుమ కొన్నినూతన విద్యాసంస్థలు బయల్వెడలినవి. ౧౯౨౩ లో నాగపుర విశ్వవిద్యాలయమును, ౧౯౨౬ లో నాంధ్రవిశ్వవిద్యాలయమును నెలకొల్పబడినవి. ౧౯౨౦ లో ప్రభుత్వమువారి యొక్క చట్టము ననుసరించి విశ్వవిద్యాలయములలో సైనికసంఘములు (University Training Corps) స్థాపింపబడినవి.
